SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

భారత నీతికథలు

బెజవాడ, 1927

Record no. 652

Bhārata nītikathalu

Bejavāḍa, 1927

Record no. 652

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

భారత నీతికథలు / నేతి సుబ్రహ్మణ్య సోమయాజులు గారి అనూకితము.- 2. కూర్పు.- బెజవాడ : మారుతీరాం అండ్ కో., 1927.

v. <2   >, (1) leaf of plates : ill. ;19 cm.

Record no. 652

Bhārata nītikathalu / Nēti Subrahmaṇya sōmayājulu gāri anūkitamu.- 2. kūrpu.- Bejavāḍa : Mārutīrāṃ aṃḍ kō., 1927.

v. <2   >, (1) leaf of plates : ill. ;19 cm.

Record no. 652

35mm microfilm

Image placement: IA (IIA) IB IIB **Date filming began:** 24 January, 2006

Approved by the Text-Book Commettee
Vide Fort St. George Gazette Dated 16-11-26.

154

భారత నీతి కథలు.

(ద్వితీయ భాగము)

BHARATA NEETI KADHALU.

(PART II)

SUPERVISED BY

N. S. Somayajulu, B.A., L.T.,

PUBLISHERS :

MARUTI RAM & Co.,

BOOK - SELLERS

BEZWADA.

1927.

శ్రీకృష్ణ రాయబారము (వచనము)

అప్రూవుడ్.

భారతకథలోని శ్రీకృష్ణుని రాయబారము బాలురకు తేటతెల్లముగా యుండునట్లు సులభశైలిని వ్రాయబడినది. 1, 2, 3 ఫారముల బాలురకు పఠనీయ గ్రంథముగా వాడబడుచున్నది. వెల. రు 0—6—0

ఆంధ్రవీరారాధన

ఆంధ్రవీరులలో అగ్రగణ్యులగు వారి చరిత్రములు విపులముగా వ్రాయబడినవి. ప్రతివారు తెలుసుకొనవలసిన విషయములు చాల కలవు. 4, 5 ఫారముల బాలురకు పఠనీయ గ్రంథముగా వుపయోగింప తగియున్నది.

వెల రు. 0—12—0.

మారుతి హిందూదేశ చరిత్ర కథలు

నాల్గు, అయిదు తరగతులకు అప్రూవుడ్.

ఇది సెలబసు ననుసరించి వ్రాయబడినది. యీపుస్తకము యిదివరకు ఉండు పుస్తకములకన్న చాలాబాగుగయున్నదని పెక్కుమంది ఉపాధ్యాయులు అభిప్రాయముల నిచ్చియున్నారు. గ్రంథకర్తలు మునిమాణిక్యం, నరశింహారావుగారు, B. A., L. T., నేతి సుబ్రమణ్యసోమయాజులు గారు, B. A., L. T., వెల రు. 0—5—0 మాత్రం 25 చిత్రపటములుగలవు.

మారుతి హిందూదేశ చరిత్ర కథలు 5 వ తరగతికి రు. 0—5—0.

మారుతి హిందూదేశ చరిత్ర

1st ఫారమునకు అప్రూవుడ్.

గ్రంథకర్తలు: మునిమాణిక్యం నరశింహారావుగారు, B A., L.T., సాహిత్యసమితి

నేతి సుబ్రమణ్యసోమయాజులుగారు, B. A., L,T.,

రెండవఫారమునకు సెలబసు ననుసరించి వ్రాయబడినది. అనేకమంది ఉపాధ్యాయులు చాలా బాగుగయున్నదని అభిప్రాయముల నిచ్చియున్నారు. వెల రు. 0—8—0, 35 చిత్రపటములు.

దొరుకువారు:— **మారుతి రాం అండ్ కంపెని,**
పబ్లిషర్సు, బుక్కుసెల్లర్సు. బెజవాడ.

P. Ve... ...iah

మద్రాసు టెక్స్టుబుక్ కమిటీవారిచేత అప్రూవుచేయబడినది.

భారత నీతి కథలు.

(ద్వితీయ భాగము)

నేతి సుబ్రహ్మణ్య సోమయాజులు, బి, ఏ. యల్. టి. గారి

అనూకితము.

—• రెండవకూర్పు •—

పబ్లిషర్సు:

మారుతీ రాం అండ్ కో,

బుక్కుసెల్లర్సు, బెజవాడ.

1927.

 [వెల అ. 8.

విషయసూచిక.



భారత నీతి కథలు.

(ద్వితీయ భాగము)

1

ధర్మవ్యాధుఁడు

ధర్మవ్యాధుఁడను నొకబ్రాహ్మణుఁడు గలడు. అతడు చతుర్వేదములను, సమస్తశాస్త్రములను బూర్తిగాఁ జదివెను. అతనికొక రాజకుమారుఁడు మిత్రుఁడై యుండెను. మైత్రిం జేసి యారాజకుమారునితో నితఁడుగూడ విలువిద్య గఱచి యతనితోఁగూడ నరణ్యమునకుఁబోయి పెక్కుమృగములఁ జంపుచుండెను. ఇట్లుండ నొకనాఁడు విధివశమున ధర్మవ్యాధుఁడు విడిచినబాణము, తపమునందున్న యొక మునికిఁదాకెను ఆమునీశ్వరుఁడలిగి "నీవు బ్రాహ్మణుఁడవయ్యును బాపకర్మమునఁ బ్రవేశించితివి. కావున మృగవ్యాధ జన్ముండవగుదువు. గాక" యని శపించి, మఱల దయఁబూని" కిరాతకులమున జన్మించినను సమస్తధర్మములు నీకు బోధమై యుండును. పూర్వజ్ఞానము గలిగియుందువు. గురుపూజ సేయుదువు. అపర జన్మమున బ్రాహ్మణుఁడ వవుదు" వని పలికెను. ధర్మవ్యాధుఁడు మునిశాపమునఁ గిరాతుఁడై మృగమాంసము విక్రయిం

చుచు, గురుశుశ్రూషఁ గావించుచుఁ గాలము గడుపుచుండెను.

ఇట్లుండ, దపశ్శీలుఁడును, సంతతాధ్యయన తత్పరుఁడును నగు కౌశికుఁడను నొక బ్రాహ్మణుఁ డొకనాఁ డొక వృక్షమూలమున నాసీనుఁడై వేదములు జదువుచుండెను. అప్పుడు వృక్షాగ్రముననున్న యొక కొక్కెర యాతనిపై రెట్టవైచెను. కౌశికుండలిగి తలయెత్తిచూచెను. వెంటనే కొక్కెర నిశ్చేతనమై నేలబడెను. తనమూలమున నాకొక్కెర మృతినొందెననిమిగుల విచారించి మధ్యాహ్నమగుటంజేసివిప్రగృహముల భిక్షాచరణము సేయుట కరిగెను. ఇట్లు భిక్షసేయుచుఁబోయి, యొక్క పుణ్యగృహమువాకిట నిలిచి "భిక్షాం దేహి" యనెను. వెంటనే యొకసాధ్వి యతనికి భిక్షపెట్టుటకు రాబోయెను. కాని, యాక్షణమె యామెపతి మిక్కుటమగు నాలికతో నరుదేర, ముందాతనికి భోజనమిడి, సపర్యల జరిపి, యంతలో భిక్షకై నిలిచియున్న బ్రాహ్మణునిఁ దలంచి, జాగయ్యెనని విచారించి, భిక్షఁదెచ్చి యతనికొసంగఁబోయెను. "కౌశికుఁడు రోషరంజితలోచనుండై యామెంగాంచి "అడిగిన యప్పుడే భిక్షపెట్టియుంటివేని నేనేగియేయుందును. నన్నింతవరకునిలిపి యవమానం బొనర్చితివి కదా" యని పలికెను. అందుల కాసాధ్వి "భూసురోత్తమా! ఆకలిఁగొని నాపతి యరుదెంచెను. ఆతనికి భోజనముబెట్టి సపర్యలఁజేసి వచ్చితిని. ఆలస్యమునకు మన్నింపుము" అని వచించెను. ఆమాటలకుఁ గౌశికుఁడు మతిక్రోధమునఁబడి "ఏమీ! భిక్షకరుదెంచిన బ్రాహ్మణునికన్న నీభర్త యెక్కువవాఁడా? లోకవంద్యులయిన

బ్రాహ్మణులను దేవతలే పూజించుచుందురు. అట్టివారిని నీవు లాఘవముగఁజూతువా? ధరణీసురులకుఁ గోపముఁగలుగఁజేసి యెవ్వరు జీవింపనోపుదురు?" అనిపలికెను. అదివిని యాపతివ్రత యిట్లనెను. "భూసురోత్తమా! నాకుఁ బతియే దైవము. నాభర్తకుఁ బ్రీతిగలుగుటయే నేనెప్పుడును జూచుచుందును. ఆతనియాజ్ఞ ననుసరించి వర్తించుచుందును. అతనిసేవయే మోక్షమునకు మార్గమని గ్రహించితిని. నీ వతిక్రోధుండవగుట నేనెఱుంగుదును నీకోపమున నింతకుమున్నె యొకకొక్కెర నిహతంబయ్యెఁగాదే ఇది మదీయ పాతివ్రత్యమహిమచే నెఱింగితిని. కావునఁ గ్రోధంబు గొని యాడుట లగ్గుగాదు. క్రోధమోహములను పేరుగల శత్రువు లిరువురు మనస్సులోఁ జరించుచుందురు. వాని నడంపకున్నచో బ్రాహ్మణునకు గౌరవముండదు. సత్యముబలుకుట, హింసావిదూరుఁడై యుండుట, యెల్లవారినిఁ దనయట్లుచూచుట, కామమునఁ దగులొనకయుండుట, మొదలగు సద్గుణములు బ్రాహ్మణునకు భూషణములు. ధర్మగతి కివియే సాధనములు. ధర్మము బహుమార్గదృష్టమైయుండును. నీవు కేవల స్వాధ్యాయపరుండవు. కాని ధర్మమెఱుంగవు. కావునఁ దడయక మిథిలాపురమున కరుగుము. అందు జితేంద్రియుడును, సత్యవాదియు, మాతాపితృపూజారతుఁడును, నైన ధర్మవ్యాధుఁడను కిరాతుఁ డొకఁడున్నాడు. అతఁడు నీకు సకలధర్మముల బోధించును." ఇట్లుపలికిన యాపతివ్రతవాక్యముల కద్భుతమంది, "సాధ్వీ! నీకతమున నాచిత్తము శాంతిఁ బొందెను. నీవాక్యముల ననుసరించి ధర్మవ్యాధుని యొద్దకు

బోయెద. నీకు మంగళ మగుఁగాక" యనిపలికి, యాకౌశికుఁ డచ్చోటు వాసెను.

కౌశికుఁడు ధర్మవ్యాధదర్శనలాలసుఁడై యనేకనగర గ్రామము లతిక్రమించి మిథిలాపురము జొచ్చి, రాజమార్గము దటిసి, యచ్చట జనములచే ధర్మవ్యాధుఁ డున్న తావెఱింగి, యయ్యెడ కేగి, ముందట నల్పమృగ మాంసఖండము లంగడిం బచరించి యమ్ముచున్నవాని, మాంసముగొనుటకు వచ్చిన జనులచే నావరింపఁబడియున్నవాని, నక్కరాతుంగని, యతి జుగుప్సితంబైన యాప్రదేశము జేరనొల్లక తొలంగి యొక్క యెడ నిలిచియుండును. ధర్మవ్యాధుఁడు బ్రాహ్మణుని రాకఁ గాంచి, యాతనియెడకు వచ్చి, పరమభక్తితో మ్రొక్కి, కుశలమడిగి "బ్రాహ్మణపతివ్రత నావిధము నీకుఁ జెప్పి, నాకడకుఁబొమ్మనిన వచ్చితివి కాదే! నీమనోరథము నేనెఱుంగుదును. రమ్ము. మద్గృహమునకుఁ బోవుదము" అనిపలికి, కౌశికునిఁ దనగృహమునకుఁ దోడ్కొనిపోయెను. కౌశికుఁడు ధర్మవ్యాధుని యెఱుక కచ్చెరువంబొందె. "నీవు ధర్మపరుఁడవు. జీవహింస జీవనముగఁ జేసికొనుట మంచిదగునా? ఇట్టిదిచూడ నాకు మిగులదుఃఖముకలుగుచున్నది" యనిపలుక ధర్మవ్యాధుఁ డిట్లు బదులుచెప్పెను. "బ్రాహ్మణులకుఁ దపస్సు మొదలగు నవియు, రాజులకు ధరాపాలనమును, వైశ్యులకు వాణిజ్యమును, శూద్రులకు శుశ్రూషయు నెట్లు ధర్మమైయున్నదో యట్లే మాకీమాంసవిక్రియము కులాచారమైయున్నది. నేను నిజకర్మపరిత్యాగము సేయనొల్లక యీవృత్తిఁ బూనితిని. నే

నిట్టి వృత్తియందున్నను జీవహింసమాత్ర మెన్నఁడుసేయను. ఒరులు చంపితెచ్చిన మాంసమును తగినవెల కమ్మి జీవించుచుంటిని. వినయము, గురుజనవిప్రపూజ, సత్యము, శౌచము, తాలిమి, మొదలగు సద్గుణములు నన్నెప్పుడును నెడబాయవు. అట్టివాఁడ నగుటచేత హీనకులజుఁడనయ్యు, నిర్మలుఁడనై యుంటిని.

అనిపలికి యాతఁడు కౌశికునకు ధర్మములన్నియు నుపదేశించెను. అంతట ధర్మజ్ఞాన మార్జించిన కౌశికుఁడు ధర్మవ్యాధునకు నమస్కరించి చనెను నాఁటినుండియు నాతఁడు ధర్మముతప్పక చరించుచుఁ గృతార్థుఁడయ్యెను. ధర్మవ్యాధుఁడును నపరజన్మమున బ్రాహ్మణుఁడై విరాజిల్లెను.

క॥ "తన కులధర్మము విడువక
మనుట పరమధర్మ మండ్రు • మాన్యులు చిత్తం
బునఁ గృపగలుగుట ముఖ్యపుఁ
బని సైరణావలయు నిఖల • భావములందున్."

2

సావిత్రి-సత్యవంతుఁడు

మద్రదేశము బరిపాలించు నశ్వపతియను నొక రాజు కలఁడు. అతఁడు సంతానము గొఱకు సావిత్రింగూర్చి తపము జేసెను, అతని తపమునకు మెచ్చి సావిత్రి ప్రత్యక్షమై యొక్క కూతుం బ్రసాదించెను. అశ్వపతి యద్దేవికి మ్రొక్కి "తల్లీ!

సుతులు లేనివారికి గతులు లేవని ధర్మశాస్త్రమునఁ జెప్పఁబడియున్నది. నందనోదయమునకై నేను నిన్నుఁ గూర్చి తపంబుఁ జేసితిని. నీవు నాకుఁ బుత్రిక ననుగ్రహించితివి" యని వినయముతోఁ బలికెను. "రాజా! నీవు చింతింపవలదు. నీకాపుత్రికవలన శతపుత్రలాభము కలుగును" అని బదులుచెప్పి సావిత్రీదేవి యంతర్ధానమయ్యెను. అంతఁ గొన్నాళ్లకు నశ్వపతికి మాళవియను ధర్మపత్నియందు నొక కూతురు కలిగెను. సావిత్రీవరమునఁ బుట్టినదగుటచే నాబిడ్డకు సావిత్రియను పేరు బెట్టిరి. అట్లుజనించిన సావిత్రి దినదిన ప్రవర్ధమానయై సౌందర్యమునందు సురకన్యల హసించుచు, సంప్రాప్తయౌవనయై యుండుటఁ జూచి, యక్కన్నియకుఁ దగినవరునిఁగూర్చి నశ్వపతి తలంచియుండెను.

ఇట్లుండ నొక సమయమున నారాజుకడకు నారదుఁడరుదెంచి మాటల సందర్భమున సాళ్వపతియైన ద్యుమత్సేనుని పుత్రుఁడగు సత్యవంతుని సద్గుణ సౌందర్యములఁగూర్చి చెప్పుచుండఁగా సావిత్రివిని యాసత్యవంతునియందు మనస్సు నిలిపియుండెను. కాని సిగ్గుచే నెవ్వరికిని దెలుపలేదు. మఱియొకనాఁడు నారదుఁడు వచ్చి యశ్వపతి చేఁబూజలంది సుఖాసీనుఁడై యిష్టాగోష్ఠినున్న సమయమున నశ్వపతి యాజ్ఞపై నయ్యెడకు సావిత్రి వచ్చెను. నారదుఁడు రాజేంద్రుని జూచి "రాజా! సావిత్రికింకను వివాహ ప్రయత్నము సేయుకుంటి వేమి" యని యడిగెను. అశ్వపతి పుత్రికం గాంచి "అమ్మాయీ! నీకింక వివాహము సేయవలసియున్నది. నీకుఁ దగినపతిని నీవే

పేర్కొనుము. వానికి నిన్నొసంగి పరిణయము జేసెద" నని పలికెను. సావిత్రియొక్కింత సిగ్గుబొంది తండ్రితో "నాచిత్తము సాళ్వరాజు కుమారుఁడైన సత్యవంతునిపైఁ జిక్కియున్న" దనెను. యశ్వపతి సత్యవంతుని గూర్చి నారదు నడిగెను. నారదుం డిట్లనియె. "సాళ్వరాజిప్పు డంధుఁడై రాజ్యము గోల్పోయి భార్యాపుత్ర సహితముగ నరణ్యమున నున్నవాఁడు. సకలసుగుణములును భుజబలపరాక్రమ విక్రమధైర్యములును సత్యవంతునియొద్ద నున్నవి. సౌదర్యమునకా! రెండవ మన్మథుఁడే! కాని యొక్కసంగతి మాత్రము దెలుపవలసియున్నది. వివాహమైన సంవత్సరమున కాతఁడు మరణించును."

నారదునిపలుకులు వినఁగనే యశ్వపతి కేమియుఁ దోపక "అట్టివానినేల వరించెదవు? మఱియొకనిఁ గోరుకొను"మని పుత్రికకు జెప్పెను. "మనోవాక్కాయములను మూఁడింటియందు నంతఃకరణము ప్రధానము. తొలుత మనమున గోరిన వరుని మాని మఱియొకని వరించుట ధర్మముకాదు. ఆ సత్యవంతుఁడు సౌఖ్యసంపదలకు దూరుఁడై యరణ్యమున నుండుగాక! నేనాతనినే వరించితి" నని సావిత్రి తండ్రికి బదులు చెప్పెను. తండ్రియెంత చెప్పినను నామె మఱియొకని వరించుటకు సమ్మతింపలేదు. నారదుఁడేమి యాలోచనము జెప్పునోయని యశ్వపతి యతని దెసఁ జూచెను. నారదుం డిట్లనియె "రాజా! గుణములప్రోవైన నీపుత్రిక తలంపు మాన్ప నెవ్వరికిని శక్యముగాదు. కావున నాసత్యవంతునకే యొసంగుము. ఈమె చేసిన పుణ్యములచేత నాసత్యవంతుఁడు దీర్ఘాయురుపేతుఁడగుఁగాక."

మద్రేశ్వరుఁ డందులకు సమ్మతించి సకల పురోహితామాత్య బృందములు వెంటరా సావిత్రిం దోడ్కొని సాళ్వపతియున్న యరణ్యమునకరిగి యాతనిచేఁ బూజితుఁడై తన యభీష్టము దెలిపెను. ద్యుమత్సేను డతనింగాంచి "రాజేంద్రా! నీవు మా యెడలఁ జూపుచున్న గౌరవమున కెంతయు సంతసించితిని. కాని మేము విగతరాజ్యులమై యీ ఘోరవిపినములనుంటిమి. సుకుమారియగు నీకుమారి మాతో నిడుమలు బడఁగలదా!" యనెను. యశ్వపతి యందులకిట్లనియె. "ధరావల్లభా! నాయందు గౌరవముంచి నాపుత్రికను గోడలిఁగా గైకొనుము. ఇరువురును సమంచిత మూర్తులగుటచే నొకరి కొకరు తగియున్నారు. కలిమి లేములు స్థిరములుగావు నీవీ విషయమును గూర్చి విచారింపవలదు. నీతో వియ్యమంద వలెనని యాసతో నిట్లువచ్చితి. నాప్రార్థనఁ గైకొని యిందుకు సమ్మతింపుము" అనిన విని ద్యుమత్సేనుఁడు సంబధమునకు సంతసంబున సమ్మతించెను. అంత నొక శుభలగ్నమున నశ్వపతి సావిత్రిని సత్యవంతునకు వివాహము జేసి వివిధాంబరాభరణముల నిచ్చి నిజపురమున కరిగెను.

అట్లు సత్యవంతుని వివాహమాడి సావిత్రి దివ్యభూషణాంబరముల నుజ్జగించి వల్కలాజిన వసనయై యత్తమామల చిత్తములు రంజిల్లునట్లు సేవఁ జేయుచుఁ బతిని భక్తితో గొలుచుచుండెను. నారదుని వాక్యములననుసరించి యాసాధ్వీమణియైనది మొదలు భర్త యాయుఃప్రమాణమును దినము లెక్కపెట్టుచుండెను. నాలుగుదినములు కొఱతగా సంవత్సర

మునిండెను. అప్పుడీమె త్రిరాత్రోపవాసవ్రతముఁ బూనెను. మూడుదినములు గడచెను. నాలవ దినమునఁ బతికి మరణము గలుగునని యెఱింగి చింతించుచుఁ బరమేశ్వరునిఁ జిత్తమున నిలిపెను. ఆనాఁడు సత్యవంతుఁడు సమిత్కుశఫలార్థియై యరుగనున్న సమయమున సావిత్రి యతనిం జూచి తన్నుఁ గూడ నడవికిఁ గొనిపొమ్మని యడిగెను. సత్యవంతుడు "తరుణీ! నీవు త్రిరాత్రోపవాసమున మిగులఁ బడలియుంటివి. నేను సత్వరముగ నరుదెంచెద. నీవాశ్రమమున నుండు"మని చెప్పెను. కాని యామె యందుకు సమ్మతింప లేదు. సత్యవంతుఁ డామె రాకకు సమ్మతించెను. అత్తమామల యనుజ్ఞఁ బొంది యామె నాథునివెంట నరణ్యమున కరిగెను. సత్యవంతుఁడు ఫలములను బత్రములను గోసి యొక యెండిన వృక్షము నొద్దకుఁ బోయి గొడ్డలిచేత దానిని జీల్చుచు మిగుల శ్రమనంది గొడ్డలి నేలపై బడవైచి సావిత్రిం జేరి "సతీ! నాశరీరము నావశమగుట లేదు. నాశిరముపై శూలములచేఁ బొడచినట్లున్నది. నిమిషమైనను నిల్వఁజాల. శ్రమవాయ నొక్కింత కాలము విశ్రమించెద" నని పలికెను. అంత సావిత్రి తనయంకతల మాతని కుపధానముగఁ జేయనతఁడు వ్రాలి నిశ్చేతనుఁడయ్యెను. అంతఁగొంత తడవునకుఁ గాటుకవంటి శరీరమును, ఘోరమై, వాడిగల దంష్ట్రలును, రక్తచ్ఛాయంబోలు కన్నులును, లోకమును గంపింపఁజేయు రూపమును, గలిగి పాశహస్తుఁడై సత్యవంతుని గదిసిన యొక పురుషుంగాంచి, భయమంది యా సావిత్రి నిజేశుని శిరము నంకతలమునుండి నేలఁబెట్టి "అయ్యా! మీ రెవ్వరు? ఏమి పనికై మీ రిచ్చటి కరుదెంచితి"రని యడిగెను.

అనుటయు సత్పురుషుండామెకు "తరుణీ నేను కాలుఁడ. నీపాతి



సావిత్రి - సత్యవంతుఁడు.

వ్రత్య మహిమం జేసినన్నుఁ గాంచగలిగితివి. అన్యులకు నే

నగోచరుఁడ. నీపతికిఁ గాలము సమీపించినది. ఈతఁడు పుణ్యామూర్తియగుటచే నితరులను బంపక నేన వచ్చితిని." అనిపలికి సత్యవంతుని దేహముననున్న జీవుని వెడలించి దీర్ఘపాశ నిబద్ధుం జేసి దక్షిణాభిముఖుఁడై పోవుచుండెను. సావిత్రి శోకము నందుచు సత్యవంతుని శరీర మొక్కయెడ గుప్తము గావించి యముని వెంట నేగుచుండెను. యముఁ డామెను జూచి "కమలాక్షీ! నీవేల నావెంటవచ్చెదవు? ఇంకముందున్నమార్గ మగమ్యము. నిలువు" మనెను. "దేవా! నీకరుణచేతను, నాపతిభక్తిచేతను నే నరుగలేని స్థలములుగలవే? (పతులెచ్చటనున్న సతులు గూడ నచ్చటనుండుట ధర్మముగదా!) ధర్మమార్గమున కాలవాలమయిన సజ్జనదర్శనము వృథయగునా? నీదర్శనమున నేను శుభములందక యెట్లు మగుదుదు" నని శమనునకు బదులు చెప్పెను. యముఁ డామె వచనముల కద్భుతమంది "నారీమణీ! నీయుదారవాక్యములకు మెచ్చితిని. విభునిజీవితము దక్క మఱియొక వరము గోరుము" అనెను శత్రులచే రాజ్యము గోల్పడి యంధుఁడై యరణ్యముననున్న తన మామయగు సాళ్వపతికిఁ గన్నులు వచ్చునట్లు సావిత్రి కోరెను. యముఁడా వరమిచ్చి చనుచుండెను. సావిత్రియు నతని వెనువెంట నేగుచుండెను. అతఁ డామెను మరలి పొమ్మనిన వినక యతనితో ("వాఙ్మనఃక్రియల నెవ్వరికిని హింససేయకుండుటయు, దీనులఁ గృపతోడఁ బ్రోచుటయు, నర్థుల యభీష్టముల దీర్చుటయు, నార్యజన ధర్మములై యొప్పుచుండును) నీవెఱుంగని ధర్మములు లేవు. ధర్మస్వరూపుఁడ వగుటచేతనే నిన్ను ధర్మదేవతయని పిలుతురు. అఖిలజీవశ్రేణియొక్క కర్మఫల

ములను సమబుద్ధిం జూచువాఁడవగుటం జేసి సమవర్తి వైతివి. భూతములను యమించువాఁడవగుటచే యముండవనియు, పాపశమనము సేయువాఁడవగుటచే శమనుండవనియుఁ బిలువఁబడుచుంటివి." యని పలుక యముఁడు "తృష్ణాపీడితుని శీతలసలిలము మోదితుని జేయు విధమునఁ గల్మషహారణములైన నీవాక్యములు నాహృదయమునకు మోదము గలిగించినవి. కావున సత్యవంతుప్రాణములు దక్కఁ దక్కిన కోర్కె యేదియేని కోరు మనెను. "వైరులచే గెలువఁబడిన రాజ్యలక్ష్మి మఱల మామామను జేరునట్లనుగ్రహింపుమని యామె కోరెను. ఆవరమును గూడనిచ్చి యముఁ డరుగుచుండెను. ఆమెయు నతని వెనుకఁ బోవుచుండ నతఁడు రావలదని చెప్పెను. సావిత్రి కృతాంజలియై "పతిపోవుచున్న మార్గమును విడచి సతిమఱి యొక మార్గమున నెట్లుపోవును? ధర్మము దలంపవలదా" యనిపలుక, నతఁడు ప్రీతిఁ జెంది, మఱలఁ బ్రాణేశు బ్రతుకు దప్ప మఱియొక వరము కోరుకొనుమనెను. అనిన విని, యామె "తనతండ్రికి శతపుత్రలాభము గలుగునట్లుగాఁ బ్రసాదింపు" మని కోరెను. ఆ వరముగూడనిచ్చి యతఁడేగుచు వెనుక వచ్చుచున్న సావిత్రిం గాంచి "సాధ్వీమణీ! నీవు కడుదూరము నడచి డస్సితివి. ఇంక మగుడుట మంచిది." యని పలికెను. అందులకు సావిత్రి యిట్లనెను. "మహానుభావా! నాకు డప్పి యెక్కడనుండును? పతినివిడిచి పోవుటకు నాచిత్తము సమ్మతించునా? ఇంకొక విన్నపము నీకుఁ జేసికొనుచుంటిని. ధర్మనిరతులైన పుణ్యాత్ముల సందర్శనము దుర్లభము. వారిసంసర్గమున సమస్తదురితములు శాంతిఁ బొందును. (ఏడుమాటలాడి

నచో నట్టివారును నార్యజనులకుఁ జుట్టములగుదురని పెద్దలు చెప్పుదురు.) ఆకారణమున నే నిప్పుడు నీకుఁ జుట్టమనైతినని వేఱ చెప్పనేల? అట్టిచో బంధుజన మనోరథము దీర్చుట నీ కవశ్యకర్తవ్యమై యున్నది.

యముఁ డామె పలుకులకు సంతసించి "సాధ్వీమణీ! నేను నీకుఁ బ్రసన్నుఁడనైతిని. నీకిష్టమైనవర మొక్కటి యిచ్చెద కోరుము" అని పలికెను. అంత సావిత్రి మహానందముబొంది "దేవా! ఇంతకుమున్ను విభుని జీవితముతప్ప మఱియొకవరము గోరుమని చెప్పుచు వచ్చితివి. నీ విప్పుడా మాటలు పలుకలేదు. కావున నాయందుఁ గృపాంతరంగుఁడవై నాపతిని సజీవుం జేయుము." అని వేడెను. శమనుఁడు సంతోషించి కోరినట్లను గ్రహించి తన పాశముచే బంధించిన సత్యవంతుని దేహమున నున్నజీవునివిడిచెను. సావిత్రియు బరమసంతోషము బొందుచు సత్యవంతుఁడున్న స్థలమునకు వచ్చెను. అంతకుమున్నే సత్యవంతుఁడు లేచి సావిత్రి నరయుచుండెను. ఇంతలో సావిత్రి యతనిం జేరి జరిగినదంతయు నెఱింగించెను. అనంతర మిరువురును నాశ్రమమునకువచ్చిరి. సాళ్వపతి లబ్ధచక్షుండయ్యెను. దీనికంతకును గారణము సావిత్రియని యెఱింగి, సాళ్వపతి యామెంగాంచి "తల్లీ! మావంశము విపద్వార్ధిలో మునుఁగకుండ నోడవై కాపాడిన నీపుణ్యచరిత్రము మిగులవర్ణనీయ" మని శ్లాఘించెను. ఆప్రాంతమున నున్నమునులెల్ల నయ్యెడకు వచ్చి సావిత్రీసత్యవంతుల దీవించి చనిరి. వైరులుగెలచిన

రాజ్యము మఱల ద్యుమత్సేనుఁడు గాంచగలిగి, సత్యవంతుని పట్టాభిషిక్తుని జేసెను.

క॥ "ఆపత్సముద్రమగ్నం
బై పోయెడు నస్మదన్వయము పెంపెసఁగం
దేపయయి కడవఁబెట్టిన
నీపుణ్యచరిత్ర గీర్తనీయము దల్లీ."

3

లిఖితుఁడు

నిఖిలశాస్త్రములుఁ జదివినవారును, నాచారసంపన్నులును, నెప్పుడును బరమేశ్వరుని నారాధించువారును నగు శంఖలిఖితులను బ్రాహ్మణ సోదరులు బాహుదానదీతీరమున నాశ్రమములు గల్పించుకొని వాసము సేయుచుండిరి. ప్రపంచసుఖముల కాసపడక, కేవలము మోక్షము నందుటకు వారు తపస్సు జేయుచుండిరి. ఒకనాఁడు లిఖితుఁడు తనయాశ్రమ సమీపముననున్న వనములోఁ బండ్లు కొన్ని కోసికొని తెచ్చి తినుచుండెను. ఆసమయమున నతని కగ్రజుఁడగు శంఖుఁడువచ్చి యీపండ్లెట్లు వచ్చెనని యడిగెను. సమీపవనములోనివి తెచ్చితినని యతఁడు బదులు చెప్పెను. శంఖుఁడు తమ్మునిజూచి "తమ్ముఁడా! అనుమతిలేకుండ నీ వితరుల వనములోని పండ్లు గోసి తెచ్చితివి, ఇయ్యది చౌర్యమనఁబడును.

చౌర్యమువలనఁ బాపము సంభవించును. ఈపాపము నృపతిచే దండితుఁడవై బాపుకొనుము. నీవు సత్వరముగ రాజసన్నిధికిఁ బోయి నీవు చేసిన పాపము వచించి దండింపుమని వేఁడుము" అని చెప్పెను. లిఖితుఁ డగ్రజుని యాజ్ఞననుసరించి సుద్యుమ్నుఁడను రాజేంద్రుని మందిరముం జేరి, యచ్చటనిలిచి యుండెను. ద్వారపాలకు లాతని రాకఁ గాంచి, రాజేంద్రునకు విన్నవింప నాతఁడు లిఖితున కెదురుగావచ్చి సాష్టాంగనమస్కారము జేసి, తోడ్కొనిపోయి యొక పీఠమున నాసీనుం జేసి "బ్రాహ్మణోత్తమా! నీవరుదెంచుటం జేసి నామందిరము పావనమైనది. నేను కృతార్థుడనైతి. నీతపము నిర్విఘ్నముగ సాగుచున్నదా? నీ రాకకుఁ గారణమేమి? నీయభీష్టము దెలుపుము. నీయిష్టం బెట్టిదైన నొడగూర్తు"నని పలికెను. లిఖితుం డిట్లు చెప్పెను. "రాజేంద్రా! నేను చెప్పినయట్లు నీవు సేయుదునని పలికినాఁడవు. కావున నన్నమాటకు భంగము గలిగింపవలదు. ఆజ్ఞ లేనిదే నేనొకరివనమున ఫలములు గోసితిని. కావున నన్నుఁ దస్కరునివిధమున శిక్షించి విగతపాపునిఁ జేయుము. రాజుచే దండింపఁబడినవారిని యముఁడు దండింపఁడు నన్ను దండించినందువలన నీకుఁ గిల్బిష మంటదు."

లిఖితుని మాటలువిని భూవల్లభుఁడు విస్మయమంది తన్నీ కార్యమునందు నియోగింపవలదని పాదములపైఁ బడి యెంతయో ప్రార్థించెను. కాని లిఖితుఁడు వినక తన్నుదండింపుమని యతనిని బలవంతపఱచెను. అంత నారాజు లిఖితుని కరయుగము ఖండించెను లిఖితుఁడు రాజు నాశీర్వదించి

యాశ్రమమునకువచ్చి యన్నకు ఖండింపఁబడిన తనహస్తములు చూపెను. శంఖుఁడు తమ్మున కిట్లు పలికెను. "తమ్ముఁడా! ధర్మమార్గము నెప్పుడు నుల్లంఘింపరాదు. ఆకారణమున నీకు దండనయైనది. నీమూలమునఁ గులమునకు గౌరవము వచ్చెను. కల్లుద్రావుట, గురుపత్నిం గవయుట, బ్రాహ్మణుని జంపుట, మ్రుచ్చిలుట, మొదలగునవి మహాపాతకములని ధర్మశాస్త్రమునఁ జెప్పబడియున్నవి. ఈపాతకములలో నేదియొనర్చినను, నేకులజుఁడైనను దండనార్హుఁడే. రాజుచే దండింపఁబడినవారు పాతకములవాసి సుకృతవంతులై పుణ్యలోకము ప్రాపింతురు. నీవు రాజుచే దండింపఁబడుటచేఁ బుణ్యాత్ముఁడవును, వంశసముద్ధరణ సమర్థుఁడవు నైతివి." అనిపలికి, యతనిని బాహుదానదియందు స్నానముజేసి రమ్మనిచెప్పెను. లిఖితుఁ డగ్రజుఁడు చెప్పినట్లు బాహుదానదికిఁ బోయి స్నానమాచరించెను. వెంటనే యతని ఖండింపఁబడిన హస్తములు మరల ప్రభవించెను. అప్పుడు లిఖితుఁడు విస్మయమందుచు శంఖునిం జేరి తనచేతులుఁజూప, యతఁడు "అనుజా! దీనికద్భుతమంద నవసరములేదు. ఇయ్యది దైవకృపచే నాతపోమహిమవలన నైనవిశేషము. నీవింక శుచివైతివి. నిన్నుదండించిన రాజేంద్రుఁడును. ధన్యుఁడయ్యె" నని పలికెను.

తే॥ గీ॥ కల్లుద్రావుట గురుపత్నిఁ । గవయుటయును
విప్రుఁజంపుట, బ్రహ్మస్వ । విషయమైన
మ్రుచ్చిలుటయును నవిగల । క్రూరజనుల
ప్రీతిఁ బొందుటయును మహా । పాతకములు"

4

ధౌమ్యుఁడు - శిష్యులు

ధౌమ్యుఁడను నొకమునీంద్రునకు, ఉపమన్యువు, ఆరుణి, బైదుఁడు నను ముప్వురు శిష్యులుండిరి. వారు ముప్వురును గురువియందు భయభక్తులు కలిగి విద్యలఁ గఱచుచుండిరి. ఒకనాఁడు ధౌమ్యుఁ డారుణియను శిష్యునిఁబిలిచి, తనయాశ్రమ సమీపముననున్న వరిచేనిలోనికిఁ బ్రవహించుచున్న పంటకాలువ కడ్డుగట్టు వేయుమని యాజ్ఞాపించెను. గురుని యాజ్ఞపై నారుణి యచ్చటకుఁబోయి, యాపొలములోనికి నీరు ప్రవహింపకుండ నెంతయో మన్నుదెచ్చి యడ్డము వేసెను. కాని యది నిలువలేదు. అందుచేత నతఁడే నీటికడ్డముగాఁ బండుకొనెను. అప్పుడు నీరు పైకిఁ బ్రవహింపకుండ నిలిచెను. ఆరుణి యాశ్రమమున కెంతసేపటికిని రాకపోవుటచే ధౌమ్యుఁడు తక్కినశిష్యులతో వానినెనుకుచు వచ్చి, నీరుబ్రవహింపకుండ నడ్డముగాఁ బండుకొనియున్న యాతనిం బిలిచెను. ఆరుణి గురునిఁజూచి యీవలకువచ్చి తానుచేసిన పని చెప్పెను. ఆరుణి తనయాజ్ఞఁ జెల్లించుటకుఁ జేసినకార్యమునకు సంతోషించి "వత్సా! నీకు నాయందున్న భక్తికి మిగులసంతసించితిని, నీకు సమస్తవిద్యలుఁ గరతలామలకమై యుండు" నని దీవించెను.

మఱియొకదినమున ధౌమ్యుఁడు, ఉపమన్యుఁ డను శిష్యునిఁబిలిచి "నీవు నేటినుండి విద్యాభ్యాస మైనతరువాత

గోవులను మేపుచుండు" మని పలికెను. ఉపమన్యుఁ డట్లే చేయుచుండెను. ఇట్లుండ నొకనాఁడు ధౌమ్యుఁడు వానిం గాంచి "శిష్యుఁడా! నే నిచ్చుటకే నేగక, యున్న దేమో తినుచు నింటఁ గూర్చుందును. నీవా! కష్టపడుచుందువు. నీ యంత బలము నాకు లే దేమి కారణ" మని పలుక, నతఁడు గురున కిట్లు చెప్పెను. "దేవా! నే ననుదినము ప్రతి బ్రాహ్మణుని గృహమున భిక్ష మెత్తుకొని జీవించుచుంటిని. భోజనపదార్థములు నా కెన్నియో లభించుచుండును. నేను పిండివంటతోఁ దినని దినమే యుండదు. అందుచేత నే నింత బలము గలవాఁడనై యున్నాను." ఆ మాటలు విని ధౌమ్యుఁడు "నీవు నేటినుండి తెచ్చుకొనిన భిక్షను నాకిచ్చుచుండు" మనెను. ఉపమన్యుఁ డందునకు సమ్మతించి యట్లు సేయుచుండెను. ఉపమన్యుఁడు తెచ్చినదెల్ల గొంచెమయిన నుంచక గురుఁడు తినుచుండెను, దానికి శిష్యుఁడు విచారము నందక యప్పటియట్లు గోవుల మేపుచు నే యుండెను. కాని యతఁ డింకను బలము కలిగియే యుండెను. ధౌమ్యుఁడు వానిం జూచి "నీవు తెచ్చుకొనుచున్న భిక్ష నంతయు నేనే యారగించుచుంటిని, నీ కడుపెట్లు నిండుచున్నది. నీ వెప్పటివలెనే బలముఁ గలిగి యున్నాఁడవు, కారణ మేమి" యని యడిగెను. శిష్యుఁ డిట్లు బదులు చెప్పెను. "పగలు తెచ్చిన భిక్ష మీకు సమర్పించుచున్నాను, రాత్రిభిక్ష నేను తినుచున్నాను." అందునకు గురువు రాత్రిభిక్ష కూడ నాకే పెట్టుమని యానతిచ్చెను. ఉపమన్యుఁ డట్లే చేయుచు నావులఁ గాచుచుండెను. ఇట్లు రెండువేళలఁ దెచ్చిన భిక్ష గురున కర్పించుచున్నను నాతఁడు బలముగలవాఁడుగనే యుండెను. ధౌమ్యుఁడు మరలఁ వానిని

రెండు వేళలఁ దెచ్చిన భిక్ష నాకిచ్చుచున్నను నీవు బలము గలిగి యుంటి వేమని యడిగెను ఆవుపాలు త్రావుచుంటినని శిష్యుఁడు చెప్పెను. నా యాజ్ఞ లేనిదే నీవట్లు సేయఁగూడదని గురుఁడు చెప్ప, నతఁడు పాలను ద్రావుట మాని వేసి దూడలు పాలు త్రాగునప్పుడు బయటికిఁ గ్రక్కు నురుగు ద్రాగుచుండెను. గురుఁడు దానిఁగూడ వలదని చెప్పెను. అప్పు డుపమన్యుఁడు తినుట కాహారము లేక శుష్కించుచుండెను. ఒకనాఁ డాకటి బాధ కోర్వఁజాలక యతఁడు జిల్లేడాకులఁ దినెను. ఆ కారణమున నతనికిఁ గన్నుల దృష్టి తప్పెను. వాఁడు గోవులను నింటికిఁ దోలుకొని వచ్చునప్పుడు దారి కనఁబడక యొక నూతిలోఁ బడెను. సంధ్యా సమయమున కతఁడు గృహమునకు రాకపోవుటకు మిగుల విచారించి ధౌమ్యుఁడు వాని నెమకుచు నరణ్యమునకు వచ్చి "యుపమన్యుఁడా! యుపమన్యుఁడా" యని గట్టిగాఁ బిలిచెను. గురుని కేక విని యుపమన్యుఁడు నూతిలోనుండి తన స్థితి గురుని కెఱింగించెను. తన యందున్న భక్తిచే వానికట్టి యవస్థ కలిగెనని గురుఁడు వగచి, యశ్వినీదేవతలఁ బ్రార్థింపుమని వానికిఁ దెలిపెను. ఉపమన్యుఁ డశ్వినీ దేవతలఁ బ్రార్థింపఁగాఁ గన్నులు వచ్చెను.

తరువాత ధౌమ్యుఁడు బైదుఁ డను శిష్యునితోఁ దన యింటనుండి తాను చెప్పు పనులన్నియుఁ జేయుచుండుమని చెప్పెను. వాఁ డందునకు సమ్మతించెను. వాని చిత్తము బరీక్షించుటకు గురుఁడు మిగుల కష్టములయిన పనులు చెప్పుచుండెను. కాని, యా శిష్యుఁడు విసుగుఁజెందక పనులన్నియు నెఱవేర్చుచుండెను.

ఇట్లు మువ్వురుశిష్యులును ధౌమ్యునియందు భక్తిఁ గలిగి వర్తించుటచే నతనిదయకుఁ బాత్రులై సమస్తవిద్యలు సంపూర్తిగ జదివి తమనివాసములకుఁ బోయి పేరువడసిరి.

తే॥ గీ॥ గురుఁడె దైవంబుగా నెంచి ♦ పరమభక్తి
సేవలనుసల్పు శిష్యులు ♦ క్షితితలమున
సకలవిద్యలఁ బూర్ణులై ♦ సద్యశంబు
గాంచి, శుభసంపదల నెపుడు ♦ గాంచగలరు.

5

యక్షుడు - ధర్మరాజు

అరణ్యమునఁ దమ్ములతోఁ గూర్చుండి యున్న ధర్మరాజు పాలికి నొకబ్రాహ్మణుఁడువచ్చి "రాజా! చెట్టుకొమ్మనుదగిల్చిన నాయరణి యొక హరిణము కొమ్మునకుఁ దగిలి యూడఁగా దానితో నాహరిణము బరుగెత్తెను. కావున నాకు నిత్యవిధి లోపముగలుగకుండ నామృగమును బట్టుకొని నాయరణిఁదెచ్చి పెట్టుము" అనిపలికెను. అంతట ధర్మరాజు చాపహస్తుఁడై తమ్ములతో బయలు దేరి త్వరితగమనమున నాహరిణమును వెంటాడించెను. ఆహరిణము పాండవులను గొంత దూరము తీసికొనిపోయి యక్కడ యదృశ్యమయ్యెను. తమ యత్నము విఫలమైనదని వారు విచారించుచు మార్గాయాసమున డస్సి యుండుటచే నొక్క వటవిటపిక్రింద విశ్రమించిరి. అప్పుడు వారందఱును దాహముఁ గొనియుండుటచే ధర్మ

రాజు నకులునిజూచి "తమ్ముఁడా! నీ వీమహీరుహమెక్కి జలమే దెసనైన నున్నదేమో చూడు"మని చెప్పెను. నకులుఁడు వృక్షము నెక్కి దిక్కులు గలయంజూచి, సరోవర మొండు కానిపించుచున్న"దని ధర్మజునకుఁ దెలిపెను. "అట్లయిన నీవు సత్వరముగఁబోయి జలములు ద్రాగి, మాకుఁగూడఁ గొనిరమ్మ" అని నకులునకు ధర్మజుఁడు పలికెను.

నకులుఁడు సరోవరమున్న ప్రదేశమునకుఁబోయి నీరుఁ ద్రావఁబోవ, "ఓయీ! ఈతటాకము నాయది. నీ వీజలము ద్రాగఁదలఁచితి వేని నే నడుగు ప్రశ్నముల కుత్తరములిమ్మ" అనుపలుకు లాతనికి వినవచ్చెను. అతనికంటి కెవ్వరును గనిపింపలేదు. ఆపలుకుల నతఁడు గణింపక సరస్సున నీరములు ద్రావి, యాక్షణముననే దానితీరమున నిశ్చేతనుఁడై పడెను. నకులుఁ డెంతసేపటికిని రాకపోవుటచే ధర్మజుఁడు వానిసరసి జలములు గొనిరమ్మని సహదేవునిఁ బంపెను. సహదేవుఁడరిగి తటాకతీరమునఁ బడియున్న నకులుంగాంచి, యతఁ డట్లుపడి యుండుట కేమికారణమోయని విచారించుచు, దాహబాధకుఁ దాళలేక నీరములు ద్రావఁబోయెను. నకులునకు వినిపించిన మాటలే యతనికిని వినిపించెను. సహదేవుఁడుగూడ నాపలుకుల నిరాదరించి జలములుగ్రోలి, నకులుని విధమున నయ్యెను. వీరిరువురను జూచుటకు ధర్మరాజర్జునుని బంపెను. అర్జునుఁ డరిగి తటాకతీరమునఁ బడియున్న నకులసహదేవులం గాంచి విస్మయమంది నలుదిక్కులఁ గలయం బరికించి యెవ్వరింగానక సలిలములు గ్రోలసమకట్ట "ఈతటాకమున దిగితి వేని ప్రాణముమీఁదికి వచ్చును. ఇయ్యది నాయది ఇందలి

జలములు ద్రావఁదలంచితివేని నాప్రశ్నముల కుత్తరములిమ్ము" అను పూర్వపువాక్యములు వినవచ్చెను. ఆపలుకులకు ధనంజయుఁడు సక్రోధుఁడై నీవెవ్వఁడవు? "చాటుగనుండి యిట్లు పలికినంతమాత్రమున భయమందుదునని తలంచితివి కాబోలు? ఈయర్జునునిముందు నీయాటలు సాగవు" అనిపలికి సరోవరమున దిగి యంబుపానముసేసి తనతమ్ములవలెనే ధరపై నొఱగెను. తరువాత వీరిమువ్వురి కొఱకు ధర్మజునిచే భీముఁడు పంపఁబడెను. భీముఁడరిగి మూర్ఛిల్లియున్న తమ్ములఁగాంచి వారి యవస్థకుఁబరితపించి, దాహముగోని సలిలములు ద్రావఁబోవ నెప్పటి పలుకులే యతనికి వినవచ్చెను. అతఁడుఁగూడ నప్పలుకులుగైకొనక నీరములు ద్రావి మూర్ఛితుండై పడియె.

అట్లునలువురు తమ్ములును మసలుట కాత్మయందువిచారించుచు ధర్మజుఁడు వారినరయుచు సరోవరతీరమునకు వచ్చి మూర్ఛిల్లియున్న తమ్ములంగని, తానుగూడ మూర్ఛిల్లి కొంతసేపటికిఁ దెలివిఁదెచ్చికొని కొంచెము ధైర్యముబూని యంతరంగమున "ఇతరులెవ్వరు నిచ్చటికి వచ్చిపోయిన జాడ కనిపించుటలేదు. ఎవ్వరితోనైన నాతమ్ములు యుద్ధము జేసిన జాడయుఁ గనిపించుటలేదు. వీరిట్లుపడుటకుఁ గారణ మేమై యుండును? దురాత్ముఁడైన దుర్యోధనుఁ డేమాయయైన బన్నెనేమో! వీరిముఖకాంతి కొఱఁతవడలేదు. ఈజలములు విషదుష్టమనియైనఁ దలంపఁజాలను. ఈమాయ యేమో యెఱుంగఁజాలకుంటిని సమస్తరాజ్యసంపదలను వైరులపాలు చేసి, వీరినిడికొని యరణ్యమునకు వచ్చిన నాకు విధాతృఁడింత దుఃఖము దెచ్చిపెట్టెనుగదా! పుత్రుల కిట్టిదుర్గతి ప్రాప్తించె

నని మాతల్లియగు కుంతీదేవి యెంతయో విలపించుచున్నది. శపథముదీర్చి పురమునకు నేనుబోయినచో నామె నన్నుఁజూచి "నీతమ్ములేమైరి నీ వొక్కఁడవే యేలవచ్చితి" వని యడిగిన "నేనేమని ప్రత్యుత్తరం బిచ్చువాడ" నని పెక్కుభంగుల వగచి, దాహమును కోర్వఁజాలక యతఁడు సరోవరములోనికి దిగెను. అప్పు డాతని కెప్పటియట్లె, యశరీరభూత మిట్లనియె. ఓరాజా! ఈకొలను నాసొమ్ము, నేనొక బకంబను, నాపలుకులువినక నీతమ్ము లిందలిజలములు ద్రావి ప్రాణచ్యుతిఁ బొందిరి. నీవును సాహసించితివేని వారివలె నయ్యెదవు. నేనడుగు ప్రశ్నముల కుత్తరములిచ్చి పయఃపానము సేయుము." అనినవిని ధర్మనందనుఁ డాకాశమువంకఁ జూచుచు, నయ్యశరీరభూతము నుద్దేశించి "అయ్యా! నీవు బకరూపముధరించిన బ్రహ్మవో! విష్ణుఁడవో! రుద్రుఁడవో! యెఱుంగఁజాలక యున్నాను. కేవలము పక్షివేయైనచో లోకైకవీరులగు నా తమ్ముల నిట్లుసేయఁగల సత్వము నీకెట్లు లభ్యమైనది? నీ పలుకులు నాకుఁ గడునద్భుతము గలిగించుచున్నవి. నీవెవ్వఁడవు? నీతలంపెట్టిది? కరుణించి నాకెఱింగించి నాహృదయ వేదన వాపు" మని పలికెను. అంతట "నేనుబకమునుగాను, యక్షుఁడ. నామూలముననే నీసోదరు లీరీతి ధాత్రిపై నొఱఁగిరి" అని పలుకుచు, భయంకరరూపముతో నొకయక్షుఁడు ధర్మజుని యెదుట నిలిచి "నాయాజ్ఞలేనిదే, యీయుదక మెవ్వరైనఁ ద్రాగినచోఁ జత్తురు. నీవు మంచిచెడ్డలు విచారించువాఁడవగుటఁజేసి యిందలిజలము గ్రోలవైతివి. కావున నే నడుగు ప్రశ్నముల కుత్తరము సెప్పు"మనెను. ధర్మజుఁడందుకు

సమ్మతించి, యయ్యక్షుఁడడిగిన ప్రశ్నములకెల్ల సదుత్తరము లిచ్చెను. యక్షుఁడు సంతసించి ధర్మనందనా! నీబుద్ధికి సంతసించితిని. నీతమ్ములలో నొక్కని జీవింపఁజేసెద, వేఁడు"మనెను. నకులుని బ్రదికింపుమని ధర్మరాజు యక్షునికోరెను. "రాజా! భీమార్జునులు మహాబలపరాక్రమశాలురు, నీకుఁ బ్రియులు, ఏకగర్భ సంజనితులు, వారిఁగోరక నకులు నేలకోరితివి" యని యక్షుఁడు ప్రశ్నింప ధర్మజుఁడిట్లు బదులు చెప్పెను. మహాత్మా! మా తండ్రియగు పాండురాజున కిరువురు భార్యలు అందుఁ గుంతికిఁ గొడుకులైన మువ్వురిలోన నేను బ్రదికియుంటి, ఇంక మాద్రితనయు లిరువురందు నొక్కఁడు బ్రదుకవలయునుగదా! ఈధర్మరాజు ధర్మసంధుఁడని జనులు చెప్పుచుందురు. ఎట్టిహాని వాటిల్లినను నేను ధర్మహాని కోర్వఁజాల" అనినవిని, యక్షుఁడు "నీధర్మసంధత్వమునకు మెచ్చితి, నీతమ్ములందఱు లబ్ధజీవితు లయ్యెదరుగాక" యనిపలికెను. వెంటనే భీమార్జున నకులసహదేవులు నిద్రపోయి మేల్కొనిన తెఱంగున లేచి ధర్మజునకు మోదము గలిగించిరి.

ధర్మజుం డదియంతయుఁ జూచి యచ్చెరువుబొంది యక్షునివిలోకించి "మహాత్మా! నిన్నొక యక్షమాత్రునిఁగాఁ దలంపరాదు. నీవెవ్వఁడవో యొకమహానుభావుఁడవు కరుణించి నీనిజవృత్తాంత మెఱిగింపు"మని వేఁడెను. యక్షుఁడిట్లు వచించెను. "నేను ధర్ముఁడ, ధర్మచరిత్రుఁడవైన నీచిత్తము పరీక్షించుటకు వచ్చితిని, నీధర్మబుద్ధి నాకుఁ బ్రీతిఁగలిగించెను. నీకెట్టివరము కావలయునో కోరుము." ధర్మరాజు ధర్మదేవతకు నమస్కరించి "దేవా! మాయాశ్రమ సమీపముననున్న యొక

భూసురుని యరణి యొకహరిణముచే నపహృతమయ్యెను. దానికొఱకిట్లు వచ్చితిని. అయ్యది కరుణింపు"మని కోర, "నేనే యట్లొనర్చితిని, హరిణమొక్కఁడను లేదు"అని పలికి యాధర్ముఁడు భూసురుని యరణి ధర్మరాజున కొసంగి "ముందుమీరు సలుపఁబోవు నజ్ఞాతవాసమున మీకేరూపము గావలసిన నది యలవడి మిమ్మెవ్వరును గనుఁగొనకుండునట్లు వరంబిచ్చితి" నని పలికి యదృశ్యుఁడయ్యెను.

క॥ "వదనంబుల తెల్వియ్యుఁగర
పదరుచియుం జెడదు నీకు • నడుటకుఁ గత మీ
యుదకము విషదుష్టంబని
మదిఁ దలపంబోలదేమి • మాయయొ యెఱుఁగన్.

6

హంస కాకీయోపాఖ్యానము

సముద్రమధ్యమున నొక్క ద్వీపముకలదు. అందుఁ బుణ్యమార్గవర్తనుఁడును సదాచారసంపన్నుఁడును, శాంతగుణప్రధానుఁడును, దయామయుఁడును నగు నొకవైశ్యుఁ డుండెను. అతఁ డనేక పుత్రులఁగలిగియుండి సంపదలలోఁ దులఁదూగుచుండెను. ఇట్లుండ నొకనాఁడొక వాయస మాతని గృహము జేరంగాంచి, యావైశ్యపుత్రులు దాని కెంగిళులు బెట్టుచుఁ బోషించుచు వచ్చిరి. అక్కాకియు వారి గృహ

మున నెంగిళులు దినుచుఁ గ్రొవ్వుపట్టి, తన కీడగుపక్షులు లేవని గర్వమున చరించుచుండెను. ఒకదినమున కొన్ని హంసములు సముద్రతీరమునకు వచ్చుటఁజూచి వైశ్యునికొడుకులు వానిని కాకమునకుఁజూపి "నీవుపక్షులందెక్కుడు దాననని చరించుచుంటివి. ఈహంసములఁ జూచితివా? ఇవి వినువీధిని మిగుల వడిగఁబోవును. నీవు వీనితోఁ బందెము వేసి గెలువవలయు" నని పలికిరి తారతమ్యజ్ఞానమెఱుఁగని యా వైశ్యపుత్రుల మాటల కొడలుప్పొంగ, నా వాయస మది యెంతపని యని, యా హంసములఁజేరి, యందు దక్కిచ్చవచ్చిన హంసమును గాంచి తనతోఁ బఱచుటకు రమ్మనిపిలిచెను. అంత నయ్యంచలు కాకి పలుకులకు నవ్వి "వాయసమా! మేమెప్పుడును మానస సరోవరమున నివసించుచుఁ బృథ్విస్థలమునఁ జరించుచుందుము. ఎంతదూరము పోవలసివచ్చినను నొక్కింతయు నాయాసపడము. అట్టిచో మాయందఱిలోన మిగుల బలశాలియైన హంసమును నీతోఁ బఱచుటకు రమ్మని పిలిచితివి. మున్నెప్పుడు నంచలతోఁ బందెము వేసిన వాయసమును మేమెచ్చటను జూడలేదు." అని పలికెను. అందునకు వాయసమిట్లు పలికె. "నడకలయందు నూరుగతులున్నవి ఆనడకలు వక్రియానము, వలయాక్రమము మొదలగు నామములతో నొప్పుచుండును. అందొక్కొక్క నడకమీద శతయోజనపర్యంతము నేను నడువఁగలను. మీరందఱుఁ జూచుచుండ నే నీయంచతోఁ బఱచి గెలిచెదఁగాక!"

అని పలికిన విని కాకముచేఁ బిలువఁబడిన మరాళము "నీవు నూరుగతులఁ బాఱుదునని వచించితివి. నాకవన్నియుఁ

దెలియవు. ఆకసమున బక్షులన్నియు నేచందమున బాఱునో యట్లే సముద్రమునను నాకాశమునను బాఱుదము రమ్ము" అని కాకితోఁ బలికెను. అచ్చటనున్న కాకులన్నియు దానినిఁ బరిహాసించుచు "ఈ కాకము నూఱుగతులఁ బాఱును. ఒకటే నడక నేర్చిన నీవు దీనితో నెట్లు నడవఁగలవు? దీనిచే నీవు భంగమందెద" వని వచించెను. మరాళ మా వాక్యముల సరకుఁగొనక, కాకముతో బఱచుటకుఁ గడంగెను. రెండును జలధిపై నాకసం బంటునట్లు పఱుగిడు నవసరమున, రాయంచ నెమ్మదిగాఁ బోవుచుండెను. వాయస మతితీవ్రముగా నాయాసము నొందుచుఁ జనుచుండెను. ఉచ్ఛిష్టదర్పితయగు కాక మనేకగతులఁ బోవుచు. వెనుకనున్న మరాళము దగ్గరకు వచ్చుచుఁ, బిలుచుచు, ముక్కును ముక్కుమీద మోపుచు మరల ముందునకుఁ బోవుచు మురియుచుండెను. కాకము పఱచుటఁ జూచి తక్కిన వాయసములు 'కాకా' యని సంతోషమునఁ బెద్దపెట్టున నఱచుచు, మరాళము భంగపడునని పలుకుచుండెను. కాకముల కలకలము, మరాళము విని యుత్సాహభరితయై మిగుల పొడవునకు నెగసి యతిరయమునఁ బఱవఁ దొడఁగెను. రాయంచను గలిసికొనుటకుఁ బ్రయత్నించి పఱుగిడఁజాలక యక్కాకము తన చిత్తమున "అక్కటా! ముందువెనుకలు చూడక దీనితోఁ బఱచుటకు సిద్ధపడితిని, నిలుచుటకైన నెక్కడ వృక్షములుగాని, పొదలుగాని లేవు. ఇదియంతయు సముద్రమయమైయున్నది. దిగితినేని చచ్చుట నిశ్చయ" మని తలపోసి భయమందుచుండెను. మరాళము దానిఁగాంచి "వాయసమా! నీ వనేకగతుల నేర్చియుంటినని

పలికితివి. ఇది యేగతి? సత్వరముగ రమ్ము" అని గేలిసేయుచు, వెండియు "నొక్కింతయైన నడుగు వేయఁజాలక బలమంతయుఁ గోలుపోయి యెగురలేక బెగడొందియుంటివి. ఎవ్వరికైనఁ జెప్పినట్లు చేయుట కష్టముగదా" యని పలికెను. అప్పుడు దీనమానసియైన యావాయసము రాయంచం గాంచి "కోమటి కొడుకులు పెట్టిన యెంగిళులు తిని గర్వమునఁ జరించుచు సుపర్ణునినైన గెలుతునని పలుకుచుండెడుదాన. ఇప్పటికి నా గర్వ మడఁగినది. నాయపరాధము మన్నించి, దయగల నీచూపులు నాపై నిగుడఁజేసి రక్షించి మరలఁ గాకులలో నన్నుఁ గలుపుము" అని పలుకుచుఁ "గాకా" యని యఱచుచు సముద్రమునఁ బడుటకు సంసిద్ధమైయున్న వాయసముపైఁ గరుణ వహించి యమ్మరాళము, దానినిఁ దన చరణములసందున నిఱికించుకొని, మరణభయమును బాపి, తీరమునకుఁ జేర్చి తక్కిన కాకులన్నియు వినుచుండ "ఎదిరిబలమును నీబలమును నెఱుఁగకుండ నెన్నఁడును నిట్టియకార్యము సేయకు" మని చెప్పెను.

"క॥ నాకొలఁది యిప్పుడెఱిఁగితి
నీకరుణాలోకనంబు । నిగిడించి శర
ణ్యా కావు నన్ను మగుడం
గాకులలోఁ గలుపఁ దగవు । గాదే నీకుఁ."

7
సువర్ణష్ఠీవి

పర్వత నారదులను మునీంద్రులు మహీమండలమునఁ జరించు వేడ్కతో దివినుండివచ్చి తమలోఁ దాము తమ చిత్తవృత్తులు దాచుకొనకుండునట్లును, నట్లొనర్చినచో శాపము లిచ్చుకొనునట్లును ప్రతినలు సలుపుకొనిరి. వారు భూలోకమునఁ జరించుచు సృంజయుఁ డను నృపాలునిమందిరమున కరుదెంచి యాతనిచేఁ బూజలంది "నృపాలా! నీమందిరమునఁ గొన్నాళ్ళుండఁదలఁచి వచ్చినార" మని పలికిన నా రాజచంద్రుఁడు మిగుల సంతసముబొంది సుకుమారి యనునామమునఁ దనరు నాతనికూతును వారికిఁ బరిచర్యలు సలుపుటకై నియమించెను. ఆమెయుఁ దండ్రియాజ్ఞ ననుసరించి యాపర్వతనారదులను భక్తితోఁ గొలుచుచుండెను. అక్కన్నియ రూపసౌందర్యాదులఁ గాంచి, నారదుఁడు భ్రమించి నానాటికి ధైర్యముచెడి కృశాంగుఁ డగుచుండెను. కాని సిగ్గుచే నియ్యది పర్వతున కెఱింగింపక యుండెను. పర్వతుఁడు తన చిత్తమున నారదుడు తెఱంగెఱింగి, యాతనింగాంచి "నీవు సమయభంగ మొనర్చితివి. రాచకన్నియపై నీచిత్తము జిక్కియున్నదను విషయము నాకుఁ దెలుపవైతివి. కానిమ్ము, నీకు శాపమొసఁగెదను. రాజేంద్రుఁడు తనపుత్రికను నీకొసంగును. కాని, వివాహమైన వెంటనే నీవు వానరవదనుండ వగుదువు గాక" యని పలికెను. నారదుడు పర్వతునకు "నీకు నాక

లోక సంచారము లేకుండుఁగాక" యని ప్రతిశాపమిచ్చెను. పర్వతుఁ డాస్థలమువిడిచి చనెను. నారదుఁడు శాపభయము బొందక, సంజయుని జేరి, యాతనికుమారియగు సుకుమారినిఁ దనకిచ్చి పెండ్లిసేయుమని యడిగెను. రాజేంద్రుఁడు సంతసించి సుకుమారిని నారదునకొసఁగి పెండ్లి జేసెను. వివాహమైనవెంటనే నారదుఁడు వానరముఖుఁడయ్యెనుఁ. సుకుమారియు, నారదునకుఁ గలిగిన యారూపమును గాంచి విరక్తచిత్తగాక యాతనిం గొలుచుచుండెను. ఇట్లుండ నొక్కదినమున నారదుఁడు వనమునకరుగఁ బర్వతుఁడు చూచి తనకొసఁగిన శాపము మరల్పుమని కోరెను. అందునకు నారదుఁడు "నీవు ముందుగా నాకు శాపమిచ్చితివి కావున నీవుమరల్పు" మని చెప్పెను. అప్పు డొండొరులు తమతమ శాపముల మరల్పుకొని మందిరమున కరుదెంచిరి. నారదుఁడు శాపవిముక్తుఁ డగుటచేత నతనిమొగము మాఱిపోయెను. సుకుమారి యాతనిం గాంచి పరపురుషునిగాఁ దలంచి మార్మొగము పెట్టుకొనెను. పర్వతుఁ డప్పుడు నవ్వుచు "రమణీ! ఈతఁడు నీపతి యగు నారదుఁడే, నీవు నమ్ముము." అని చెప్పి తమతమశాపంబులఁగూర్చి చెప్పెను.

నారద పర్వతులు సృంజయుని మందిరమునఁ గొన్నాళ్ళుండి, యచ్చటనుండి వెళ్ళుటకు బుద్ధిపుట్టగా, నారాజునకేదేని యుపకారము సేయఁదలఁచి, యతనింగాంచి "రాజేంద్రా! నీకుఁగావలసిన వరంబేదేని గోరుము" అని నుడివిరి. సృంజయుఁడు సంతసించి దేవతలను మించునట్టి కుమారునిఁ బ్రసాదింపుఁడని కోరెను. నారదుడు రాజునకా వరము

నిచ్చెను. పర్వతుఁడు "ఆకుమారుఁడు దీర్ఘాయువు గలవాఁడుగ నుండ"డని పలికెను. దానికి భూపాలుఁడు విచారింప, నారదుఁడు "రాజేంద్రా! నీతనయుఁడు దేవేంద్రుని మించినట్టి వాఁడగును. ఇంద్రుఁడసూయవహించి యక్కుమారున కేదియైనఁ గీడు సేయఁదలంచునేమో! అట్టిదేదియు జరుగకుండఁ గాపాడుము. ఒకవేళ నపాయము కలిగినచో నన్నుఁదలంపుము. నేనది తొలఁగించెదను మఱియు నాకుమారుని నిజ నిష్ఠీవనాదులు సువర్ణమయ మగుచుండును గావున నాతఁడు సువర్ణష్ఠీవియను పేరఁబరఁగును." అని చెప్పి పర్వతునితో నచ్చోటు వాసి వెడలిపోయెను. అంతఁ గొన్నాళ్ళకు సృంజయుఁడు కుమారునిగాంచెను అక్కుమారునకు సువర్ణష్ఠీవి యనుపేరు బెట్టఁబడెను. వాని నిష్ఠీవన మలమూత్రాశ్రుస్వేదనంబులు సువర్ణమయంబులుగా నొప్ప దినదిన ప్రవర్ధమానుఁడగుచుండెను. చోరులీవృత్తాంతము నెఱింగి సమయము వేచియుండి, యక్కుమారు నెత్తుకొని యడవికిఁ బోయి వధించి, శరీరమంతయు వెదకి, సువర్ణంబునుగానక, మృతకళేబరము నచ్చటనే పడవైచి పోయిరి. సృంజయుఁడప్పుడు తన కుమారుని నింద్రుఁడే హరించియుండునని తలంచి, నారదునిఁ దలంచెను. నారదుండువచ్చి జరిగినవిధము దివ్యదృష్టినెఱిఁగి ముచ్చులచేఁ జంపఁబడిన సువర్ణష్ఠీవిని బ్రదికించి "రాజేంద్రా! ఇప్పుడు జరిగినహాని యింద్రునివలన జరుగలేదు. కాని, యీ కుమారుఁడు వానిని మించునేమోయని హరింప సమయము వేచియుండును. కావున వీనిరక్షణము మఱువవలదు" అనిపలికి నారదుం డరిగెను. అనంతరము కొన్నాళ్ళకు మహేంద్రుఁడా

కుమారునిఁ జంపింపఁదలచివజ్రమును విలోకించి "నీవు శార్దూల రూపముధరించి సృంజయసుతుఁడగు సువర్ణష్ఠీవినిజంపు" మని యాజ్ఞనొసఁగెను. వజ్రము శార్దూలరూపమున సమయము వేచియుండెను. ఇట్లుండ సృంజయుఁడు ప్రియకాంతలును, కుమారుఁడును వెంటరానరిగి భాగీరథీతీర కాంతార ప్రదేశమున విహరించుచుండ శార్దూలము రయమునవచ్చియకుమారునిఁజంపి యదృశ్యమయ్యెను. సృంజయుఁడకుమారునికై పెక్కువిధముల శోకించుచు, నారదునిఁదలంప, నతఁడు వచ్చి కుమారుని బ్రతికించి బలశాసనుని యసూయఁబాపెను. నారదునికటాక్షమున బ్రతికిన కుమారునింగాంచి సృంజయుఁడపరిమితానందము నందెను.

క॥ ప్రముచ్చుల మూఢత్వమునం
జచ్చి నరకవాసమునకుఁ । జనిన తనయు నేఁ
డెచ్చి మగుడంగ వే నీ
కిచ్చెద వరపుడుగు మింక । నేనియు నధిపా !

8
వ్యాఘ్రగోమాయు సంవాదము

ఒకానొకసమయమున దుష్టులు సజ్జనులుగను సజ్జనులు దుష్టులుగను గనిపించుచుందురు. దానిని బాగుగ బరిశీలించి ప్రవర్తించుట శ్రేయస్కరము. పురికయను నగరమేలు పౌరికుఁడనురాజు క్రూరకరుఁడగుటంజేసి గోమాయువై

జన్మించెను. అతఁడట్లు జన్మించినను బూర్వజ్ఞానముమాత్రము మఱువక యుండెను. ఆ నక్కమాంసముం దినక, యరణ్యమున నుంపలు, ఫలములు మొదలగునవి యాహారముగాఁ గైకొనుచుఁ బరమనిష్ఠఁబూని కాలము గడుపుచుండెను. ఇతర జంబుకములు దానింగాంచి "ఇదియేమి వ్రతము? నీకు మాంసము మేము తెచ్చి ఇచ్చెదము. సుఖముగా దినుచుండు" మని చెప్పుచు వచ్చెనుగాని యా గోమాయువు దానికి సమ్మతింపక యశనదీక్షఁ బూని యుండెను.

ఇట్లుండ నొకనాడు దానిచెంత కొక వ్యాఘ్రమరుదెంచి యిట్లనిపలికె. "జంబుకమా! నీవు సద్గుణసంపన్నుఁడవని యరణ్యమునఁగల మృగములన్నియుఁ జెప్పుకొనుచున్నవి. అందరును నన్ను గ్రూరాత్ముఁడని పలుకుచున్నారు. నీతో నేను మైత్రిం దగిలియుండెద. నీశికుంజేసి నాకౄరత్వము బాపవలయును" అనిన విని, యానక్క పులిం జూచి యిట్లనియె. "నీవు భోగములయందాసక్తిగలవాఁడవు. నేనట్టివాఁడను గాను. పోనిమ్ము నీ భోగముల జోలి నాకేల? నాయెఱింగిన కొలఁది కార్యాకార్యము లెఱింగించెద. కాని, యొక్కసంశయముమాత్రము నాకుఁ గలుగుచున్నది. నీవు నాకుసఖుఁడవై యుంటివేని, నీమిత్రులసూయఁజెంది మనమైత్రికి భంగము గల్గించుట కనేకప్రయత్నములు సేయుదురు. ఎట్లయిన నీచిత్త మాకర్షింపఁజూచెదరు. కావున వారేమిచెప్పినను వినక యుండుమని నాతో శపథము సేయవలయును. అట్లొనర్చినచో నీకు సఖుఁడనై యుండును." శార్దూలము జంబుకముమాటలకు సమ్మతించెను. నాటనుండియు నక్క పులినివాసమునందే

వసించుచుఁ దానెఱింగిన ధర్మములు సెప్పుచుండెను. ఇట్లు కొంతకాలము గడచెను. శార్దూలముయొక్క భృత్యులును, హితులును, గోమాయువుతో సఖ్య మధికముగా నున్నదని యసూయఁజెంది యొక్కదినమున నాపులి యాహారమునకై దాచుకొన్న మాంసమును నపహరించిరి. ఆదినమున నాహార పదార్థ రక్షణముసేయు నది గోమాయువు వంతుగావున నది మాంసమునుగానక, యెవ్వరో తస్కరించి యుందురని తలంచి యాసంగతి శార్దూలమున కెఱిగించెను. అంత నాశార్దూలము మాంసము హరించినవారెవ్వరో యరయఁ దలంచి యుండఁ, గపటహితులు దానిని సమీపించి రహస్యముగ నిట్లు పలికిరి. "ఈగోమాయువున కిదియేమివ్రతము? ఇదియంతయు డాంబికము. నక్కయట! మాంసము దినదట! ఈవాక్యము లెవ్వరైన విన్నవార్వరా! నక్క కపటములోఁ బుట్టినది. ఆమాంసము నిదియేతిని, యేమియు నెఱుఁగని దాని తెఱంగున నున్నది. ఇది నిన్నుఁజేరిన నాటనుండియుఁ గపటము బూనియే వర్తించుచున్నది. ఇన్నిదినముల నుండియు నీతోఁ జెప్పినచో నీకేమి యాగ్రహము కలుగునోయని సంశయించి యూరకుంటిమి. ఇఁకపై నీయిష్టము వచ్చినట్లు సేయుము."

అని కపటహితులు చెప్పినమాటలు విని యాశార్దూల మాగ్రహాయత్తచిత్తమై, యానక్కను బంధించుకొనిరండు; చంపెద"నని చెప్పెను. ఇంతలో శార్దూలముయొక్క తల్లి వచ్చి యిట్లుపలికె "కుటిలమతులగు హితులమాటలు విని నక్కకు హానిఁ గూర్పఁదలఁచితివి. సుమతులఁ జూచి కుమతులును, నధికులఁజూచి హీనులును, రూపవంతులఁజూచి కురూ

పులును, సామాన్యముగా నసూయవహించి యుందురు. ఒక్కొక్కసమయమున ధర్మ మధర్మముగాను నధర్మము ధర్మముగాను దోఁచును. అది నిర్మలమైన చిత్తముతో నరయవలయును. గోమాయువు నిన్నుఁ జేరిననాటనుండియు నీకెన్ని హితములు బోధించియుండెను? వానినిఁ బాటింపవలదా! ఆ జంబుక మెట్టిదుష్కృత్యమును సేయునదికాదు. ఎవరైనను ధర్మపరుండగు హితునకు, నీచులవాక్యము లాలించి కీడు సేయఁదలఁతురా?" అని తల్లి పలికిన వాక్యములు విని క్రోధము విడిచి, పశ్చాత్తాపమునంది, నక్కను బిలువఁబంచి, గౌరవించెను. అప్పుడు జంబుకము శార్దూలమును గాంచి "మనమైత్రికిఁ బూర్వము నీవుచేసిన బాసను మఱచి, కుటిలహృదయుల మాటలువిని నాకెగ్గుసేయఁ దలఁచితివి. ఎఱిఁగియో యెఱుంగకో యొకనిని భంగపెట్టి మరల వానిం బ్రసన్ననిగాఁ జేసికొనుట మంచిదికాదు" అని పలికి యచ్చోటువాసి మఱియొకస్థలముజేరి, కొన్నాళ్ళకు ముక్తిబొందెను.

క॥ "ధర్మ మధర్మముభంగి, న
ధర్మము ధర్మంబుమాడ్కిఁ • దనయా! తోఁచున్
నిర్మలమతి నరయవలయు
ధార్మికతన కోరువాఁడు • దనకేర్పడఁగన్."

9

దీర్ఘదర్శి

ఒక్కమడువున దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుఁడు, దీర్ఘసూత్రుఁడు నను మూఁడుమత్స్యములు వసించుచుండెను. అవ్వి మిగుల మైత్రిఁగలిగి, యెన్నఁడు నొకదాని నొకటియెడఁబాయకయుండెను. ఇట్లుండ వేసవి ప్రవేశించెను. అప్పుడు దీర్ఘదర్శి తక్కిన రెండుమత్స్యములఁ జూచి "స్నేహితులారా! వేసవి ప్రవేశించెను. ఇంక మడువునందలి జలము లింకిపోవును. కావున మనమిప్పుడు నింకని జలములుగల మఱియొక మడువునకుఁ బోవుట మంచిది" యని పలికెను. అనినవిని ప్రాప్తకాలజ్ఞుఁడు "ఎప్పటి కేది. ప్రాప్తించునో దానినెఱింగి యాకార్యమునకుఁ దగినట్లు సేయుట మంచి"దని నుడివెను. ఇరువురి మాటలువిని దీర్ఘసూత్రుఁ డిట్లనెను. "ఈమడువిప్పుడు నిండుచందమున నున్నది. ఈస్థలము విడిచిపోవుట కిప్పుడు వచ్చిన యుపాయ మేమియున్నది? అంత యవసరము వచ్చినప్పుడు చూచుకొనవచ్చును." ఇట్లు పలుకుట విని యది కార్యము కాదని తలఁచి, దీర్ఘదర్శి తత్క్షణమే యాస్థలము విడిచి, జలపూరితమైన మఱియొక పెద్దమడువునఁ బ్రవేశించెను. ప్రాప్తకాలజ్ఞుఁడును దీర్ఘసూత్రుఁడును నందేయుండిరి.

అంతఁ గొన్నాళ్ళకుఁ జేపలఁబట్టుటకై జాలరులువచ్చి మడువునందలి జలములఁ దోడ నారంభించి, త్రాళ్లుమొదలయినవానిని విసరుచు వలలఁ బన్నిరి. ఆసమయమున నామడువున

నిలిచిపోయిన మత్స్యద్వయమున కధికభయమయ్యెను. కాలానుగుణ్యముగ నుపాయము నూహించు శక్తిగల ప్రాప్తకాలజ్ఞుఁడు తన మనమున "జాలరులు వచ్చి మీనములఁ బట్టుటకు త్రాళ్లను గ్రువ్వుచున్నారు. ఆలసించినచో నపాయము వాటిల్లును. కావున వీరిచే విసరఁబడు నొక త్రాడును, గఱచి గ్రుచ్చుకొని పోయినట్లుండి, పిదప నెమ్మదిగాఁ దప్పించుకొని మఱియొకమడువు జేరెద"నని తలంచి యొక చేపలగుత్తిమధ్యముఁ జేరి, రెండుదౌడలచేతను త్రాడును గఱచిపట్టుకొని గ్రుచ్చుకొనిపోబడి మూర్ఛిల్లిన విధముననుండెను. అనంతరము జాలరులు వేటజాలించి బురదపోవునట్లు నీటిలోఁ జేపలగడుగు నవసరమున నా ప్రాప్తకాలజ్ఞుఁడు త్రాడువిడిచి, యపాయము దప్పించుకొని, కడురయమున మఱియొక మడువుం జేరె. దీర్ఘసూత్రుఁ డందేయుండి ; యిటునటునరుగుట కేయుపాయముఁ దోఁచక జాలరులచేఁ బట్టుబడెను.

ముందుజరుగు హానిఁదలంచి దానికిఁ దగినయుపాయము నూహింపలేనివాడు దీర్ఘసూత్రునివలె నాపదనొందును. అపాయ మొదవినప్పు డప్పటికిఁ దోఁచినట్లు ధైర్యముఁబూని కార్యము నిర్వహించువాఁడు ప్రాప్తకాలజ్ఞునివలె సుఖముండును. ముందువచ్చు సంగతులన్నియు నెఱింగి, యప్పటికప్పుడే జాగ్రత్తపడువాఁడు దీర్ఘదర్శిచందమున సౌఖ్యపడును.

క॥ విను ద్వాదవ్వులఁ గార్యము
గని కొని వలయు పని మున్న । కావింపఁగ నే
రని జడుఁడు దీర్ఘసూత్రుం
డను మత్స్యంబుభంగి । నాపదనొందున్॥

10

మూషికమార్జాల సంవాదము

ఒకయరణ్యమున నొకమఱ్ఱిచెట్టుపై రోమశుఁడను మార్జాలము వసించుచుండెను. చెట్టునకుఁగ్రింద నొకమూషిక ముండెను. ఆప్రదేశమున కనుదినము నొకకిరాతుఁడు సంధ్యాసమయమునవచ్చి, వలనొడ్డియుంచిపోయి, తెల్లవారుసరికి మరలవచ్చి, యందుఁబడినపక్షులు మొదలయిన వానిఁ గొనిపోవుచుండును. ఇట్లుండ నొకదినమున నాహారమునకై చరించుచున్న మార్జాలమందుఁబడెను. అదిచూచి పలితుఁడు భయమువిడిచి, యచ్చట నెరసెమకికొనుటకు బయలుదేఱెను. ఆసమయమున నాయెలుకకొక గూబయు, నొక ముంగిసయుఁ గనబడెను. ఎరకైవచ్చిన యెలుక యారెంటిని జూడఁగనే భయమంది, వాని బారినుండి తప్పించుకొనిపోవుట యెట్లని తలంచి ధైర్యముబూని, వలయందు జిక్కియున్న పిల్లిని సమీపించి "మార్జాలమా! ఈవలఁ గొఱికివేసి నీకు మేలుఁగూర్చెద. ఈ యుపకృతి నీకునేను చేసినందులకు నీవు నాతో మైత్రివాటించి యుండుము. ముంగికిని గూబకును భయమంది యిట్లు పరుగెత్తుకొని వచ్చితి. నీ ప్రక్కనున్నచో నాకు భయముపోవు" నని పలికెను. మార్జాలము మూషికమును గాంచి "నీవునాకు మేలుసేయఁ జనుదెంచితివి. అట్టి నీకు నేను హితంబొనరింపక యుందునా? వెఱపుమాని నా యొద్దకుఁగమ్ము. నాదగ్గఱనున్నచో ముంగియు గూబయునిన్ను

సమీపింపఁజాలవు." అని పలికిన విని మూషికము పిల్లిని సమీపించి నిలిచియుండెను. ఉలూక నకులములు, పిల్లిదగ్గఱనున్న మూషికమును గాంచి, దానిం బట్టశక్యముకాదని నిజేచ్ఛం బోయెను. ఆ రెండును దమదారిం బోయినఁజూచి మూషికము సంతసించుచు వలత్రాళ్లు గొఱుకక నటునిటు దిరుగుచుండెను. అప్పుడు రోమశుఁడు పలితుంగాంచి "నీవేల యురులు గొఱుకక యున్నవాఁడవు ఆలస్యమేల చేసెదవు? ద్రోహతనముబూని కృతఘ్నుఁడవై యుండఁ జూడకుము" అని పలికెను. మూషికము మార్జాలమును జూచి ఆశ్రితుఁడనగు నన్ను రక్షించిన నీమేలు మఱచెదనని తలంపవలదు. నాయాలస్యమును నీ వెగ్గుగాఁ దలంపకుము. కిరాతుఁడు నీకంటికిఁ గనఁబడిన యంతనే యురులు గొఱికెదను. ఇప్పుడే ఇందుండి నిన్నుఁ దప్పించితినేని నన్నేమి సేయుదువోయని భయంబయ్యెను. నే నీవలత్రాళ్ళు గొఱికినయంతనే, కిరాతునిరాకఁ గాంచి భయాకులితస్వాంతవైన నీవు కడురయమునఁ జెట్టుపైకిఁ బోవలయును. నేనును నా యాలయము నప్పుడే ప్రవేశింపవలయును. నన్ను నమ్ముము. నీకు మేలొనర్చెద" నని బదులు చెప్పెను. కిరాతునియందున్న భయముచే మార్జాలము మూషికము పలుకు నమ్మక "నేను నీ ప్రాణముల రక్షించితిని. నీవుఁగూడ నట్టే నాయెడ నుపకారమును సేయవలదా" యని యడిగిన "తొందరపడకుము. తగుసమయము వచ్చిన యంతనే నీ కుపకారము చేసెద" నని మూషికము చెప్పెను. ఇట్లిరువురు మాటలాడుకొనుచుండఁగాఁ గిరాతుఁడు వచ్చుచుండెను. మార్జాలము భయమంది "అదుగో!

కిరాతుఁడు హస్తమునఁ గృపాణముతోఁ గొన్ని కుక్కల వెంట బెట్టుకొని వచ్చుచున్నాఁడు. ఇంక నాకేమి దారి" యని పలికిన, భయము వాయుమని చెప్పి, కడుశీఘ్రగతి నా వలఁ దెగఁగొఱికి, యా మూషికము తన బొఱియలోనికిఁ బోయెను. పిల్లియు రయమున మహీజ మెక్కెను. కిరాతుఁడు వచ్చి త్రెంపఁబడియున్న వలంజూచి విచారించుచుఁ బోయెను.

ఇది యంతయు నెలుక తన బొఱియలోనుండి పొంచి పొంచి చూచుచుండెను. అప్పుడు పిల్లి చెట్టుపైనుంచి మూషికము వినునట్లు "హితము జేసె తగిన మిత్రుని గాంచి, యాతనితోఁ గలిసి యుండవలయును గాని వేఱుండుట నీతివిదుల లక్షణము కాదు. నీవు బేలవై నన్నుఁగూర్చి భయమందవలదు. నీవు నాకు మిగుల మేలొనరించితివి. నీవు నన్ను విశ్వసింపకపోవుట భావ్యము కాదు. నీవుగూడ నా సంపద ననుభవించుటకు యోగ్యుఁడవు రమ్ము. నా చుట్టములును, నేనును నిరంతరము నీకు మేలు గూర్తుము. నాతోఁ గలసి మెలసి యుండుము." అని పలికెను. ఆ పలుకులు విని మూషికము "మీరు శత్రువులు, నాకు మిత్రులవలె సంగతి నెఱుంగుట మిగుల దుర్లభము. కొందఱు మిత్రులై యుండి కీడు సేయుచుందురు. కావున నీతో నుండుట నాకు నుచితము కాదు. బలవంతులైన రిపులోకసమయమున స్వప్రయోజనమునకై ఇతరులకు లోబడియుండుట కలుగుచుండును. శత్రువుయెడల మిత్రభావ ముంచరాదు. నేను సమీపమునందే యుండి నీకు హితము సేయుచుందును. మార్జాలమునకాహారము మూషికము. అట్టియెడ నిన్ను నమ్మి నేనెట్లు రాగలను? నీవు

నన్ను చలించును. రాత్రియంతయు నీవు వలయందుఁ జిక్కియుండుటచే క్షుద్బాధ యెక్కువగా నుండును. అందుచే జలిదినిమిత్తము నన్నుఁ బిలుచుచుంటివి. నీమాటలకు మోసమంది నేను వచ్చుదానఁగాను" అని పలికెను. "ప్రాణరక్షణ మొసఁగిన నిన్ను నేను శత్రువునిఁగాఁ దలంపను. నన్నుగూర్చి నీవు భయమందవల" దని మార్జాలము మరలఁ జెప్పెను. ఆ మాటలకు మూషిక మిట్లు నుడివెను. "నీ మూలమున నేను బ్రతికితిని. నా మూలమున నీవు బ్రతికితివి. ఈ విధముగాఁ గలిగిన సుహృద్భావము చాలును. బలవంతుఁడైన వైరివలన నొకప్పుడు ప్రయోజనము కలిగినను దానితోడన సరిపుచ్చుకొనవలయును గాని, నమ్మియున్నచో నాపదఁ బొందును. నమ్మఁదగనివారిని నమ్మఁగూడదు. ఒరులను నమ్మక యొరులు తన్ను నమ్మునట్లు చేసికొనుటయే ధర్మము. కావున నీవంటి వారిని నమ్మక నేను బ్రతికెదను, నీవును గిరాతునివంటి వారిని నమ్మక సుఖంబున నుండుము."

ఈ పలుకులకుఁ బిల్లి సిగ్గుబొంది యూరకుండెను. మూషిక మాస్థలము విడిచి మఱియొక చోటికిఁ బోయి సుఖముగ నుండెను.

ఆ॥ వె॥ "నమ్మఁదగనివారి । నమ్మకయున్నది
తగినవారినైనఁ । దద్దనమ్మి
యుంటఁ దగదు తన్ను । నొరులు నమ్మునట్లు
యుండి యొరులనమ్మ । కునికి నీతి."

11

కిరాతుఁడు - కపోతము

ఒక పురమున నొక కిరాతుఁ డనుదినమున్ను నరణ్యమునకుఁ బోయి పక్షుల వధించి, వాని నమ్ముకొనుచు జీవయాత్ర గడుపుచుండెను. ఒకదినము నాతఁడు పక్షులఁ బట్టుకొనుటకుఁ గావలసిన పరికరములఁ దీసికొని యొక యరణ్యమున కరిగి, వల నొడ్డియుంచెను. అనేక పక్షు లా వలయందుఁ బడుచుండెను. ఇంతలో సంధ్యాసమయమైనది. అట్టి సమయమునఁ బెనుగాలితోఁ గూడుకొన్న వర్షము సంభవించెను. అడవి యంతయు జలమయమైపోయెను. అప్పు డా కిరాతుఁడు సమీపముననున్న యొక చిన్న ప్రవాహముదాటి గుబురుగానున్న యొక వృక్షముక్రిందఁ జేరి, చలిచే బాధనొందుచు, నచ్చటనున్న పాషాణమే పఱుపుగాచేసికొని, యా వృక్షరాజము నుద్దేశించి "రాత్రియైనది నా కెవ్వరు నిక్కడ దిక్కులేరు. ఈ వృక్షముపైనుండు భూతములే నన్నురక్షించుగాక" యని పలికి పరుండెను.

ఆసమయమున నావృక్షాగ్రముపై వసించియున్న యొక కపోతము మేతకరిగిన తనభార్య చీకటియైనను రాకఁ దడసిన కారణమెఱుంగజాలక "అయ్యో! నాకుఁ బ్రియముగూర్చు భార్య యెక్కడఁ జిక్కియున్నదో కదా! ఇంతసేపు నన్నువిడచి యెప్పుడు నుండలేదు. అది లేకపోయినచో నాజీవితము వ్యర్థము కదా! అనురాగముకలిగి, భక్తితో సేవించు భార్యయొక్క పతివ్రతవము భర్తకిహపరలోకసౌఖ్యముల నిచ్చునని పెద్ద

లు చెప్పుదురు అక్కటా! అది యీవర్షమున నెక్కడనైనఁబడి మరణించెనేమో, అట్లయిన నాగతియేమి" యని పరిపరివిధముల విలపింపఁజొచ్చెను.

కపోతము విలాపము, బోయవాని వలయందుఁ జిక్కికొనియున్న కపోతి యాలకించి మనమున మిగుల సంతోషించి భర్తమనస్సునకు సంతోషముకలుగునట్లు వర్తించు సతియే పుణ్యవతి. నన్నుఁగూర్చి నా మనోహరు డిట్లు ప్రియవాక్యములాడ వినుభాగ్యము గాంచితిని. ఇఁక నేను కృతార్థురాలనైతిని. నాజన్మము ధన్యమైనది. ఇంక నేను యమునినైన గెలిచెదనని తలంచి పతికిఁ దనవిధమెఱుంగఁ జేసి, భగవంతుఁ డొనర్చినదానికి దుఃఖించినందువలనఁ బ్రయోజనము లేదని పలికి, మఱియు నిట్లనెను. "శరణాగతరక్షణముకన్న మఱియొక ధర్మము లేదని పెద్దలు చెప్పుదురు. ఈబోయ చలిచే మిగులవడఁకుచున్నాఁడు. శరణాగతుఁడైన వీనిని చేతనైనంతవరకు నాపదఁబొందకుండఁ గాపాడుము."

అని పలికిన కపోతివాక్యములువిని, శోకమువిడిచి, యాకపోతము కిరాతునిఁజూచి మనుజస్వరమున "అన్నా! నీవుమిగుల డస్సియుంటివి, మాభాగ్యవశమున నేడు మాయింటి కతిథివైతివి. నీకెట్టియాతిథ్యము నేను సలుపవలసియున్నదో యెఱిఁగింపు" మనెను. ఆ పక్షిమారకుఁ డాకపోతము పలుకులకు ముదంబంది "చలిబాధచే శరీరము ముక్కలైపోవుచున్నది. ఈబాధ మాన్పు" మనెను. అంతట నక్కపోతము తత్ప్రదేశమునమున్న చిన్నచిన్న యెండుపుల్లలు తనముక్కునఁగొనితెచ్చి

పోవుచేసి, సమీపమున నున్న పల్లియకుం జని చివర నగ్నియున్న పుడకం దెచ్చి యాపోవునం బెట్టి బోయకు శరీరము గాచికొను మని చెప్పెను. అలుబ్ధకుండగు కిరాతుఁడు తనమేను నాయగ్నిం గాచికొని శీతబాధను వాసి, తన కాకలియగుచున్నదని పక్షి కెఱింగించెను. అందుల కుపాయ మేమియుఁ దోఁచక యక్కపోతము బోయనుజూచి "పక్షుల కాహారమని యొకటి నిర్ణయింపఁ బడియుండునా? ఏసమయమున కేది దొరికిన నది తిందుము. నీ వాకలిఁ గొని యున్నాఁడవు. ఎట్లయిన నీయాకలిబాధఁ దీర్ప వలయును. ఇదిగో! నాశరీరము నీకాహారముగాఁ జేసెద" నని పలికి యగ్నింబడెను ఇట్లు కపోతము తనకై యగ్నింబడుటఁ జూచి, యాపాపాత్ముఁడు విస్మయమంది తనమనమున "లోకమున నిట్టికార్యమెచ్చటనైనఁ జూచి యుంటినా? నాచరిత్రము మిగుల నిందకుఁ బాత్రమైయున్నది. నేటినుండి క్రూరకార్యముల జేయుట మానివేసెదను నా కీపక్షియే గురువై సద్బోధఁ గావించెను. ఈకపోతము నానిమిత్తము తనభార్యను, బంధువులను విడిచి యగ్నిం గూలెను. నేనును హరిని సేవించి ముక్తినందెదఁ గాక!" యనితలంచి విరాగము బూని వలయందున్న పక్షుల నెల్ల విడిచి పక్షులఁ బట్టు పరికరము లచ్చటనే పాఱవేసెను. కపోత మగ్నిలోఁ బడుటఁ జూచి కపోతి తనచిత్తమున "నా యాకలిఁ దీర్పకుండ నెన్నఁడు నీ వాహారము గొన నంగీకరింపవు. నదీతీరములకడకును, నేమావి గున్నలకడకును, విహరించుటకు నీతోఁ గూడ నన్నుఁ గొనిపోవు నీలీలలు మఱువ నాకు శక్యమగునా? నేనుగూడ నీ చనినచోటునకు వచ్చెద. ఇరువురము నచ్చట సుఖముగా నుండద" మని పతిం

గూర్చి పలికి, యగ్నింబడి ప్రాణములు వాసి, ప్రకాశమానమైన విమానముమీఁద నమరులు గొలిచియుండ, దివ్యతేజముతో విరాజిల్లు భర్తం గలిసికొని స్వర్గమునకుఁ బోయెను. బోయయు వీరిం జూచి తానుకూడ నట్లగుటకుఁ దలంచి, శరీరం బెల్ల ముండ్లచే గీచికొనిపోవ నరణ్యమంతయుఁ దిరుగుచు నొక్కచోట దవానలము గాంచి, యానందమందుచు, భగవద్ధ్యానము సేయుచు నందుఁ బ్రవేశించి దేవత్వము నందెను.

క॥ "పతిమదికి వింతయొక్కన [illegible]
యతివగదా పుణ్యవతి ప్రి యాలాపము లీ
గతి వినఁగాంచితి జన్మము
కృతకృత్యంబయ్యె నాకు గెలిచితి జమునిన్."

గృధ్రజంబుకోపాఖ్యానము

విదిశాపురమున నొక బాలుఁడు మృతినందఁ, దల్లిదండ్రులును, బంధువులును నామృతకళేబరమును ప్రేతభూమికిఁ గొనిపోయి యాబాలునిఁ గూర్చి శోకింపఁదొడఁగిరి. అప్పు డచ్చటి కొక గ్రద్ద వచ్చి బాలునకై యేడ్చువారిం గాంచి యిట్లు పలికె. "మానవులారా! భయ మింతయైనను లేక యిక్కడఁ బలవించుచు నుండఁదగదు. సంధ్యాసమయ మగుచున్నది. భూతప్రేతపిశాచము లీ ప్రదేశమున సంచరించుచుం

డును. జననమరణములు దేహికి సహజములై యున్నవి. ఈ రీతి నేడ్చుచు నున్నందువలనఁ బ్రయోజన మావంతయు లేదు. చచ్చినవారితోడ బ్రదికియున్నవా రేగుదురా? మరణించిన వారు మరల జీవింపరు. మీరును నెప్పుడో మరణమందవలసినవారలే, కావున నీ బాలునికై శోకింపక ఇంటికిఁబొండు."

గ్రద్దమాటలు విని వారా శవము నచ్చటవిడిచి యరుగ నెంచుచుండ, నంతలో నచ్చటి కొక జంబుకమువచ్చి, వారిం జూచి "ఓ వెఱ్ఱిమనుష్యులారా! గ్రద్దమాటల నాలకించి, భయమంది చంద్రునివలె నున్న యీ బాలుని విడిచిపోవుటకు మీకు మనసెట్లొప్పెను. ఇంకను సంధ్యపడలేదు. ఒకవేళ మీ రిట్లేడ్చుచున్నచోఁ బ్రాణములు మరల వచ్చునేమో!" యని పలికిన వారుమరలవచ్చి పెద్దపెట్టున నేడ్వసాగిరి. అప్పుడు గృధ్రంబు వారింగాంచి "మందబుద్ధులై జంబుకము మాటల నాలకించి, ఇట్లు వచ్చితిరా? మీ యవివేకము జూడ నాకు మిగుల నవ్వువచ్చుచున్నది. ఎచ్చటనైన మృతకళేబరమునఁ బోయిన ప్రాణము మరలఁ బ్రవేశించుటఁ జూచి యుంటిరా? ఆ యముఁడీ బాలుని జీవముల నిదివఱకే హరించినాడు. ఇఁక నెంతవగచినను లాభము లేదు. కావున మీరు శక్తియున్నంత వఱకు దానధర్మము లాచరించి, యాతఁడు సుగతికిఁ బోవు మార్గ మూహింపుఁడు." అని పలికెను. గ్రద్దపలుకుల నాక్షేపించుచు నక్క ఇట్లనెను. "క్రూరబుద్ధిగల గృధ్రంబుమాటలు మీరు వినవలదు. ఇట్టి పుత్రుని విడిచి మీ రెట్లోర్వఁగలరు? కరుణాహీనులరై పీనుం బాసి మీరు పోవలదు. దైవము మీ యెడల ననుగ్రహింపకయుండునా? అనుగ్రహించి బాలుని

బ్రదికించెనేని సంతోషమే. లేనియెడల నప్పుడే పోవచ్చును. ఇంతలోఁ దొందరయెందుకు?" అని పలికినవిని, గృధ్రంబు యామనుజులఁజూచి "నేనుపుట్టి యనేకవేల సంవత్సరము లయ్యెను. ఎప్పుడునుజచ్చి మరల బ్రదికినవాని నెందును జూచియుండలేదు. కాని యొకటిమాత్రమున్నది. చచ్చినవారు మఱి యొక గర్భమున మాత్రము జన్మింతురు. ఈ నక్కమాటలు విని మీరేల వృథాయాస మందెదరు?" అని పలికెను. మానవులా బాలుని విడిచిపోవుచుండ నక్క వారి కడ్డమువచ్చి "గ్రద్దమాటలకు మీరు మోసపోవుచుంటిరి. మున్ను శ్రీరామచంద్రుఁడు మరణించిన యొక బ్రాహ్మణ పుత్రుని బ్రదికించినాడు. నారదుఁడు తన తపఃప్రభావమున సృంజయ సుతుఁడగు సువర్ణష్ఠీవినిఁ బునర్జీవితుఁ జేసినాఁడు. అట్లే యే మహానుభావుఁడైన మీ శోక మాలించి కుమారుని బ్రదికించునేమో ప్రయత్నింపుఁడు."అని చెప్పెను.

జంబుకము చెప్పిన మాటలు విని వారందఱు మరల వచ్చి శవముచుట్టుఁజేరి, పెద్దపెట్టున రోదనము సేయసాగిరి. ఆ గృధ్ర జంబుకములు రెండును, నా మృతకళేబరము నాహారముగాఁ గైకొనుటకుఁ దమ తమ వాక్యములనేర్పున నా జనంబుల మరలించుచుండెను. రాత్రిపడినచో గ్రద్ద యుండదు. కావున చీకటిపడకుండ జనంబులఁ గ్రమ్మరించుటకుఁ దగినవిధమున నది చెప్పుచుండెను. నిశాసమయము తన కనుకూలము. కావున జంబుకము దానికిఁ దగినవిధమునఁ బలుకుచుండెను. ఇంతలో సూర్యుం డస్తగిరిం జేరెను. అట్టిసమయమున స్మశానస్థలవిహారుండును, భక్తసంరక్షణపరాయణుండును నగు పర

మహేశ్వరుఁడు బాలునికై యేడ్చుజనులకుఁ బ్రసన్నుఁడయ్యె. వారా మహాత్మునకు మ్రొక్కి "దేవా! మాశోకము నీవువిని సాక్షాత్కరించితివి. ఈబాలుని మరణమునకు మేము వగచుచున్నాము దయాళుండవగు నీవు మాదుఃఖము బాపుము." అని వేడిన నక్కరుణాసముద్రుఁడగు శంకరుఁడు బాలుని బ్రదికించి గృధ్రజంబుకముల కెన్నఁడును నాకలిగలుగకుండు వరమిచ్చి యంతర్ధానుఁడయ్యె. సజీవుండైన బాలుంగాంచి వానితల్లిదండ్రులానందమందిరి.

స్వకార్యార్థతత్పరులగు వారు తమ మాటల నేర్పున నొరుల నీగృధ్రజంబుకములవలె మోసముచేయఁ జూతురు.

క॥ "కడు బెట్టిదుండు కాలుఁడు
మిడుకమిడుక నపహరించు । మీరీయాసల్
విడువుఁడు బాలుఁడు సుగతిం
బడయుఁడు దానాదులైన । బహుధర్మములన్."

13

నాడీజంఘుఁడు

పూర్వమొక బ్రాహ్మణుఁడు కులాచారధర్మములఁ బరిత్యజించి యొక బోయదాసిని భార్యగాఁజేసికొని, కిరాతులతో వేటకుఁబోవుచు, మాంసముఁదినుచు భోగములయందాసక్తిగలవాఁడై యుండెను. అతఁడు ధనార్జనము చేయఁదలఁచి వైశ్యులఁగొందఱంజేరి, వర్తకమునకు దేశాంతరమున కేగు

వారితో నతఁడుగూడ నరిగెను. వైశ్యులందఱును నొకమహారణ్యమార్గమునఁ బోవుచుండిరి. అప్పుడు మత్తగజమొకటి వారిపైఁబడఁగ వారందఱును భయమంది నలుదిక్కులకుఁ బాఱిపోయిరి. వారివెంటనేగిన బ్రాహ్మణుఁడు మఱియొకమార్గమునుబట్టి పోయిపోయి విశాలమైన యొకవటవృక్షమునుగాంచి దానిక్రింద సేదఁదీర్చుకొనుటకు విశ్రమించియుండెను. అప్పుడచ్చోటికి (నాడీజంఘుఁడు, రాజధర్ముఁడు ననుపేరులనొప్పు నొకబకమువచ్చి) "భూసురోత్తమా! నీవెచ్చటనుండి యెచ్చటికిఁబోవుచు నిచ్చటికివచ్చినాఁడవు. నిన్నుఁజూడ నాకు సంతసమొదవుచున్నది. నీవు నాయింటి కతిథివైతివి." అనిపలికెను. అందులకా భూసురుఁడు కొక్కెరంగాంచి యిట్లుపలికెను. "నే నొక బ్రాహ్మణుఁడ. నన్ను గౌతముఁడందురు. బాల్యమున నెట్టివిద్యయు నభ్యసింపక, కులధర్మములవిడచి, యొక్కబోయతను భార్యగా గ్రహించినాఁడ ధనార్జనమునకై వర్తకులతో వచ్చుచు నొకమదగజముబారిఁబడక తప్పించుకొని యిట్లు నాభాగ్యవశమున నీ నిలయము జేరితి." ఆపలుకులకు బకము ముదమంది యాబ్రాహ్మణునిజూచి "నీదారిద్ర్యము నేను బాపెద. నీ వధైర్యమునందవలదు. నాయొనర్చు నాతిథ్యము నంగీకరింపు" మని చెప్పి, మందాకినీనదియందుఁ దాను దెచ్చిన మత్స్యములు పక్వముజేసి, వన్యఫలములతో నాతని కాహారమిడి సంతృప్తునిఁజేసెను. ఆరాత్రి బ్రాహ్మణుఁడు బకము నిర్మించిన పర్ణశయ్యం బండెను. మరునాఁడుదయమాకొక్కెర భూసురుని విలోకించి యిట్లనెను. "స్నేహితుఁడును, కనకమును, రజితమును, బుద్ధియు దారిద్ర్యమును పాపఁగలవు ఈనాల్గింటి

యందు మిత్రుఁడెక్కుడై దనరుచుండును. ఇచ్చటి కనతిదూరమున మధువ్రజమను పురంబొండు కలదు. దానినేలు విరూపాక్షుఁడను దానవుఁడు నాకుఁ బరమమిత్రుఁడై యున్నాఁడు నీవు తిన్నగా నాతనికడకేఁగి నేను పంపితినని చెప్పుము. అతఁడు నీకుఁ గావలసిన ధనమొసఁగును." అనిన విని భూసురుఁడు సంతోషముఁబొందుచు మధువ్రజపురమును జేరి, విరూపాక్షునిఁగాంచి "నేను నీహితుఁడగు రాజధర్ముఁడు పంపఁగావచ్చిన భూసురుఁడ. నా దారిద్ర్యబాధ నీవు నివారింపఁగల సమర్థుఁడవని యాతఁడు నన్ను నీకడకుఁ బంపె" నని వచించెను. బ్రాహ్మణుని మాటలు విని "నీకులమేది? నీ వే విద్యనభ్యసించితివి? నీవృత్తి యేమి" యని విరూపాక్షుఁడు బ్రాహ్మణుని నడిగెను. భూసురుఁడు తన వృత్తాంతమెల్ల నొక్కింతయు దాచకుండ నెఱిఁగించెను. అతఁ డెట్టివాఁడైనను తనసఖుండగు రాజధర్మునిచేఁ బంపఁబడినవాఁడగుటచే సహాయము చేయవలయునని తలంచి, యా విరూపాక్షుఁడు, బ్రాహ్మణునకు వలసిన యాహారము నొసఁగుటకుఁ దగినవారిని నియమించి, మఱునాఁడు భూసురులకుఁ దనయింట విందుఁజేసి, యాబ్రాహ్మణునిఁగూడ వారిలోఁ గలిపి, పిదప నాతఁడు మోయఁదగినంత బంగారము, రత్నములు మొదలగు ధనరాసులిచ్చి పంపెను.

ఆబ్రాహ్మణుఁ డంతధనము తనకు లభించెనని సంతోషమందుచు నాధనము మూపున నీవును గొంటుబోవ, మోసికొనిపోయి బకమున్న స్థలము జేరెను. ఆకొక్కెర యాతని నాదరించి, తనమిత్రుని దయవలన భూసురుఁడు భాగ్యవంతుఁ

డయ్యెనని సంతసించుచు, మార్గశ్రమచే డస్సియున్న యాతనికిఁ దనపక్షములచే విసరి యాహారమునఁ దృప్తునిఁ జేసెను. అంత నారాత్రి బకము నిద్రపోవుచుండఁ గృతఘ్నుండగు నాబ్రాహ్మణుండు మఱునాటి దినమున నాహారమునకై యోచించి "ఈబకము మిగుల మదించియున్నది. దీని నాహారముగాఁ జేసికొందు" నని తలంచి, యొక్కకాష్ఠము దెచ్చి దానిచే నాబకముం జంపి, యీకలఁదీసివేసి, మాంసము దీసికొని, డొక్క నచ్చట బాఱవేసి పయనమయ్యెను.

అక్కడ తెల్లవాఱినంతనే విరూపాక్షుఁడు తన మనసునఁ గలఁతఁజెంది "ఈ కలఁతకుఁ గారణమేమైయుండును. రాజధర్ముఁ డనుదినము వచ్చుచుండునే. నేఁ డేల రాక తడసె? ఆబ్రాహ్మణు డేమయిన నాతని మొసలఁ గీడుఁ దలఁచెనా?" యని విచారించి, యాతని వృత్తాంత మరయుటకు భటులఁ బంపెను. ఆభటులు వచ్చి, యీకలును, కొక్కెరడొక్కయుఁ, జూచి, కదురయమున నరిగి దానవేంద్రునకుఁ జెప్పిరి. రాజధర్మునకు బ్రాహ్మణునివలననే యట్టిహాని సంభవించియుండెనని యూహించి, వెంటనే వానిం బట్టితెండని విరూపాక్షుఁడు భటుల కాజ్ఞాపించెను. విరూపాక్షుని యానతి ననుసరించి భటులు తొందరగాఁబోయి, బ్రాహ్మణుని బట్టుకొని, చేతులు విఱిచికట్టి విరూపాక్షునికడకుఁ దెచ్చిరి. అతఁడు భటులం జూచి "ఈకృతఘ్నుని నా యొద్దకేల తెచ్చితిరి. వీనిం జంపి తినుఁడు లేక మ రేమయిన సేయుఁ" డనిన, వా రాతని నచ్చోటునుంచి తీసికొనిపోయి, పురము బయలునఁ జేర్చి శరీరమునుండి రక్తము గాఱునట్లు పొడచి పాఱవేసినను, నాత

నిని నక్కలైన స్పృశింపలేదు. పాపాత్ముల శరీరములు నక్కలైన ముట్టవు కదా!

మిత్రుని మృతికి విరూపాక్షుఁడు చింతించుచు రాజధర్ముని డొక్కఁ దేరఁబనిచి, దాని కగ్ని సంస్కారము గావించెను. తరువాత విరూపాక్షుని కడకు దేవేంద్రుఁ డరుదెంచి మిత్రునికై చింతించుచున్న యాతనిం జూచి యిట్లు పలికె. "దానవేంద్రా! నీకు సఖుఁడగు రాజధర్ముఁడు బ్రహ్మకుఁ గూడఁ గడుఁ గూర్చు సఖుండె. అతనికై నీవు వగవవలదు. అతఁడనుదినమును దనకడ కరుదెంచుచుండుటకు బ్రహ్మ కోరుచుండును. నీవు రాజధర్ముని డొక్క కగ్ని సంస్కారము చేసి వచ్చిన తరువాత నా చితిసమీపమున నొకగోవు తన వత్సమునకుఁ బాలు గుడుపుచుండ నా వత్సము నోటినుండి వచ్చు ఫేనము వాయువశమున నా సొదపైఁ బడెను. ఆ కారణమునఁ జతుర్ముఖుని మహిమచే రాజధర్ముఁడు సజీవుఁడయ్యె. ఇట్లు చెప్పుచుండగనే మరల బ్రతికిన బక మచ్చటికి వచ్చెను. మిత్రుని రాకకు విరూపాక్షుఁడు సంతసించెను. రాజధర్ముఁడు తనమూలమున బ్రాహ్మణున కట్టిగతి కలిగినదని యెఱింగి రాక్షసభటులచేఁ బొడిచి పాఱవేయఁబడిన భూసురుని రావించి దానవేంద్రుఁ డతని కిచ్చిన ధనము నిచ్చి పంపివేసెను.

క॥ "ఉత్తమకులజుఁడు సుగుణా
యత్తుఁడు సుస్నేహమతియు నగు మిత్రునకుం
జిత్తమెలర్చు తెఱంగునఁ
బొత్తు మనఁ వలయు శుభము పొందవలసినన్.

14

చిరకారి

మేధాతిథి యను మునీంద్రునకు చిరకారి యను నొక కొడుకు కలఁడు. ఏ కారణముననో గాని యొకనాఁడు మునీంద్రుఁ డాగ్రహయుక్తచిత్తుఁడై చిరకారిం బిలిచి, వాని తల్లిం జంపుమని యాజ్ఞాపించి యెచ్చటికో వెడలిపోయెను. ఎట్టి కార్యము సేయవలసి వచ్చినను, దీర్ఘాలోచనముఁ జేసి కాని చేయని యా చిరకారి తండ్రి యాజ్ఞఁ దలఁచి మనమున నిట్లు విచారించెను. "ఇప్పుడు మా తండ్రి తల్లిం జంపవలసినదని యాజ్ఞాపించెను. నేనేమి సేయుదును. తండ్రి యాజ్ఞ నతిక్రమించుట మహాపాపము. కావున నతని యాజ్ఞ దాటరాదు. తల్లినిఁ జంపుటకు నాకుఁ జేతులాడకున్నవి. జనకాజ్ఞఁ బాలింపక తల్లినిఁ గాచుటయే కర్తవ్యమని తలచితినేని, తండ్రియానతి మీఱినవాఁడ నగుదును. నా స్థితి యిప్పుడు ముందు నుయ్యి, వెనుక గోయి యనునట్లున్నది. మాతృవధ నొనర్చిన నరక మనుభవింపవలసి వచ్చునని యూరకున్నచోఁ దండ్రియాజ్ఞ మీరుట పాపము కాదా! వంశోద్ధారకార్థము తండ్రి నన్నుఁ దల్లియందు గాంచినాఁడు. ఇరువురును నాకుఁ గావలసినవారలే. ఇందులో నేనెవ్వరిని విడువగలను?" అని కొంతసరకు విచారించి మరల నిట్లు తలంచె. "పితృవాక్యపరిపాలనము సమస్తపాపములఁ బోగొట్టును. అదియే సౌఖ్యప్రదము. అదియే సుజనసన్నుతము, అదియే యానందదాయకము. సకలతపములకును, ధర్మములకును, విద్యలకును, దండ్రియే మూలము. అతఁడే దైవము, అతఁడే గురుఁడు, అతనికి సంతో

పము గలుగునట్టిపనిఁ జేసితినేని దేవతలు గూడ సంతసించెదరు" అని మరలఁ దల్లి దెసఁ దలంచి యిట్లని విచారించె. "ఈశరీరోద్భవమునకుఁ దల్లియే కదా కారణము. నిజశరీరపోషణమువిషయమై శ్రద్ధదీసికొనక దుర్భరంబగు గర్భఖేదము నొందుచు గాంచిన తల్లికష్టమే యెక్కువకష్టము. తండ్రి యిట్టివన్నియుఁ జూచుచుండునే గాని తల్లివలె నిట్టికష్టములఁ బడఁడు. తనకొమరుడు బాలుఁడైనను వృద్ధుఁడైనను వానిం దల్లి యొకతీరుగనే యరయుచుండును. ఆమాతృప్రేమయే జగమందు లక్ష్మికిఁ గారణము. కుమారున కెప్పుడు మాతృవియోగము సంభవించునో యప్పుడు వాఁ డేపనిఁ జేయుటకైన నశక్తుఁడగును. అప్పుడే వాఁడు శోకసముద్రమున మునుఁగును. అప్పుడే వానికి జగమంతయు నంధకారబంధురమైనట్లు తోఁచును. భాగ్యవంతునికైనను, నిరుపేదకైనను, బలవంతునికైనను, దుర్బలునికైనను, మూఢునకైనను మాతృభక్తి సమానముగనే యుండును. అదియే సౌఖ్యకరమై యుండును. అట్టియెడల మాతృవధ మహాపాపవారాశియందు ముంచివేయును. మాతృభక్తి యనునది పశువుల వధించు కటికివానికైనఁ దెలియును. అట్టిమాతృభక్తిని విడిచి నేను నాతల్లి నెట్లు చంపుదును! ఎట్లు నాకుఁ జేతులాడును." అని యాలోచించుచుఁ గడు నాలస్యముఁ జేయుచుండెను.

ఇంతలో నాతని తండ్రి తనమనమున "అక్కటా! మహాక్రూరకార్యము సేయుమని నాకొడుకున కాజ్ఞాపించి వచ్చితి. ఆపని యాతఁడు చేసియుండునేమో" యని చింతించుచు వచ్చుచు, చిరకారి నామధేయుఁడగు నాకొమరుఁడు దీర్ఘాలోచనముఁ జేసికాని యొట్టిపనియుఁ జేయఁడు. అట్టిచో వాఁ డీవిషయమునఁ దొందరపడియుండునని నేనూహింపజాల" నని తలంచుచు నాశ్రమమునకువచ్చి యెదుట నిలిచియున్న కుమారుం గాంచి యంతవఱకును దల్లిని జంపనందులకు సంతోషించి వాని కిట్లనెను. "వత్సా! మహాపుణ్యశీలుండవగు నీవు నాకు జనించితివి నీపుట్టువుచే నాజన్మము ధన్యమయ్యె. నాతపము ఫలించెను. నాయాజ్ఞనుబూని తల్లిని వధించు విషయమున దీర్ఘాలోచనాపరుఁడవై యుండి నాకెంతయు మేలుఁ జేసి నీచిరకారి నామము సార్థకముఁ జేసికొంటివి. నాకు నింద రాకుండునట్లును, నాతపమునకు భంగ మొదవకుండునట్లును, నన్ను బాపము చెందకుండునట్లును, జేసిన నీదీర్ఘాలోచనము సకలదేవతలచే సన్నుతింపఁబడుఁగాక" యని పలికెను. చిరకారియుఁ దల్లిం జంపుటకుఁ జేతఁ దాల్చిన ఖడ్గము క్రిందఁ బాఱవేసి, తండ్రికి నమస్కరించెను. మునీంద్రుఁ డానందబాష్పములు విడుచుచుఁ గుమారుని గౌఁగలించుకొని యాశీర్వదించెను.

ఎట్టికార్యము సేయవలసి వచ్చినను, దీర్ఘాలోచనము జేసి, చేయువాఁడె సకలసౌఖ్యము లందఁగలఁడు. మిత్రత్వము, శత్రుత్వము, పాత్రత, యపాత్రత యనునవి దీర్ఘాలోచనము జేసి పరికింపఁగలవాఁడు నిరంతరము పరిపూర్ణశుభములు బడయుఁగలఁడు.

క॥ "కార్యవిచారము చిరముగ
ధైర్యముతో నడుపవలయుఁ, దత్తత్క్రియలం
దార్యుఁ డనార్యుఁడు వీఁడని
యార్యులు సేయుదురు నిశ్చయమును చిరముగన్."

15

అష్టావక్రుఁడు

తొల్లి యేకపాదుండను మునివరుం డొకండు కలండు. అతనికి సుజాత యను భార్యకలదు. ఏకపాదుఁడు తపోవనమున నిరంతరము భగవంతుని గొలుచుచు, దన్నాశ్రయించిన శిష్యులకెల్ల వేదములు చెప్పుచుండెను. ఇట్లుండఁ గొన్నాళ్ళకు సుజాత గర్భిణియయ్యెను. ఒకనాఁడు ఏకపాదుఁడు శిష్యులకుఁ బాఠములు జెప్పుచుండ, సుజాతగర్భమునయున్న యర్భకుఁడు తండ్రినుద్దేశించి "అహోరాత్రులీగతి శిష్యులచేఁ జదివింపవలయునా? నిద్రలేకపోవుటచే వారుజడమతులై పాఠములు తప్పఁజదువరా?" యని యుపాలంబించి పలికెను. ఆపలుకుల కేకపాదుఁ డలిగి "వేదాధ్యయనమునకు వ్యతిరేకముగా పలికితివి కావున నీవెనిమిదివంకలుగలదేహముతో జన్మించెదవుగాక" యని కొడుకునకు శాపమిచ్చెను. అగ్నికల్పుఁడైన యయ్యర్భకుఁడు గడుపునఁ బెరుగుచుండెను. ప్రసవకాలము సమీపించుచుండుట యెఱిఁగి యాసుజాత, భర్తను విలోకించి "పురుఁడు వచ్చుననియెఱింగి మిక్కిలి పేదవారుగూడ ఘృతతైల ధాన్యములు ముందర సంగ్రహింతురు. మన మర్థవంతులముగాకపోవుటచే నవియన్నియుఁ గఱవయ్యెను. ఏమి సేయుదము? నాకీచింత యెట్లుబాయు?" నని పలికెను. అంత, నేకపాదుఁడు ధనార్థియై జనకరాజుపాలికిఁ బోయెను. అప్పుడారాజచంద్రుఁ డొకమహాయజ్ఞము సేయుచుండెను. అచ్చట

నేకపాదుఁడు వరుణపుత్రుఁడైన వందితో వివాదమునేసి యోడి, వివాదమునకుఁ బూర్వము చేసికొన్న శపథముల ననుసరించి, జలమగ్నుండై యుండెను.

అట సుజాత ప్రసూతియై యష్టావక్రుంగనెను. ఆసమయముననే యుద్దాలకుఁ డను మునుభార్య శ్వేతకేతుం డను కుమారుం గనియె. ఉద్దాలకుఁడు సుజాత కగ్రజుఁడగును. అట్లు జన్మించిన యష్టావక్ర శ్వేతకేతులిరువురును సమవయస్కులై పెరిగి, పండ్రెండేడ్ల ప్రాయము గలవారై, వేదాధ్యయనాది విద్యలందుఁ బ్రవీణులైరి. అష్టావక్రుఁడు వారి బాంధవ్య మెఱుంగక శ్వేతకేతుని భ్రాతగఁదలంచి, సుఖలీలనుండెను. ఒక్కనాఁ డష్టావక్రుఁ డుద్దాలకుని తొడ వెక్కియుండెను. అప్పుడు శ్వేతకేతుఁ డచ్చటికివచ్చి యాతనింజూచి "నీవేల మాతండ్రి యంకభాగమున నాసీనుండవైతివి? పోయి నీతండ్రి యంకభాగము నెక్కు" మని చేయిపట్టి యీడ్చెను. అందున నష్టావక్రుఁడు విచారమందుచుఁ దల్లికడకుఁ బోయి "అమ్మా! మాతండ్రియెవఁడు? నాకుఁ గానుపింపఁడేమి? ఎందరిగె. తెలుపుము." అనియడిగెను. సుజాత, ఏకపాదుని వృత్తాంతము పుత్రున కెఱింగించెను.

అంత, నష్టావక్రుఁడు శ్వేతకేతుని వెంటబెట్టుకొని మిథిలాపురమున కరిగి, జనకుని యజ్ఞమందిరముఁ బ్రవేశింపఁ బోవఁగా నచ్చట దౌవారికులు, వారింగాంచి "జనకమహారాజు యజ్ఞసభఁ దీర్చియున్నాఁడు, అందుమహాయాజ్ఞికులును వృద్ధవిద్వాంసులును, ప్రవేశింప వలయునుగాని, మీవంటి

బాలురు ప్రవేశింపరాదు" అని పలికి వారించిరి అష్టావక్రుడు వారికి "జ్ఞానము గలవాఁడైనచో బాలుఁడైనను వృద్ధుఁడే. వేదాధ్యయనశీలుండగు బాలుండైనను సభాపూజ్యుఁడగును. కావున మమ్ము బాలురని పలుకవలదు. మేము జనకుని సందర్శించి, యతనియనుమతిని, నతని సభయందున్న వేదవాదులను వాదంబున గెలువవచ్చితి"మని బదులు చెప్పెను. అప్పుడు ద్వారపాలకులు వారిని మందిరప్రవేశము సేయనిచ్చిరి. అష్టావక్రుడు జనకుఁడడిగిన ప్రశ్నములకెల్ల నుత్తరమిచ్చి, తన తండ్రితో వాదముఁజేసి గెలిచిన వరుణపుత్రుఁడైన వందితో వాదముఁజేసి గెలిచి, యతనితోఁ జేసికొన్న శపథము ననుసరించి జలమధ్యమునున్న తండ్రిని నిగ్రహముక్తుని జేసి, జనకునిచేఁ బూజలంది, యచ్చటనున్న మునులచేతను, భూసురులచేతను వినుతింపఁబడి, యేకపాదుని దోడ్కొని నిజాశ్రమమునకుఁ జేరెను.

క॥ అలయక యేండ్లు గడుం బె
క్కులు జీవించుట నరగలు గుటయుం దగు వృ
ద్ధులలక్షణమే జ్ఞానము
గలఁడేనిన్ బాలుఁడయినఁ గడువృద్ధుమహిన్"

16

ఉష్ట్రము

తొల్లి యొక యుష్ట్రమొక మహారణ్యమున వసించుచు బ్రహ్మనుగూర్చి యతిఘోరమైన తపస్సుఁ జేసెను. అది మృగమైనను నిశ్చలమైన చిత్తముతోఁ దన్నుఁ గొల్చుటచేత, నాలుమొగంబులవేల్పు, దానికిఁ బ్రసన్నుఁడై "నీవేమి కోరి నన్నుఁగూర్చి యిట్లు తపము సేయుచుంటివి ? నీయభీష్టముం దెలుపుము" అనిపలికెను. ఆమాటలకాయుష్ట్ర మెంతయు సంతోషించి బ్రహ్మకు నమస్కరించి తనమెడ శతయోజన పరిమాణంబగునట్లు వరమనుగ్రహింపుమని వేడికొనెను. అజుఁడావరము బ్రసాదించి యరిగెను.

ఆయుష్ట్రము వికించి వరముచేతఁ దనకుఁ గల్గిన నిడుపైన మెడకు గర్వించి యితరుల సహాయము నపేక్షింపక కాననమెల్లఁ దిరుగుచుండెను. ఇట్లుండ నొక్కనాడది యరణ్యమున నఱ్ఱుసాచి మేయుచుండఁ బెద్ద వానవచ్చెను. అప్పుడది తనయుత్తమాంగమును నచ్చటి గుహలోనఁ బెట్టి యిచ్చవచ్చినట్లు నిద్రించుచుండెను. ఆసమయమున నచ్చటకు రెండు నక్కలు వచ్చి యాకలిబాధ సహింపనేరక దానికుత్తుకం గొఱికిఁ గండకండలుగా మ్రింగఁ దొడంగెను. అదిమేలుకొని మెడఁ ద్రిప్పికొను లోపల, మెడ నరములు జంబుకములు గొఱికి వేసెను. అంతట నాలోఁబ్రాణములు విడిచెను.

ఎట్టివారైనను సహాయసంపన్నత్వము లేక పోయినచో నెప్పటికైన హాని బొందుదురు.

తే॥గీ॥ బాహుబలముండెనంచు, గర్వంబుఁబూని
యొరుల సాయంబుఁ గోరక । తిరుగఁబోల
దెట్టివానికినైనను । నట్టులున్నఁ
గను సహాయ మెప్పటికేనిఁ । గలుగకున్న ?

17

పవనుఁడు—శాల్మలీతరువు

హిమవన్నగమునకు సమీపమున నొక శాల్మలీ వృక్షము కలదు. అది మిగుల దృఢము కలదై శాఖోపశాఖలతో విలసిల్లుచు ననేక మృగపక్షి సంశ్రియణీయమై యుండెను. ఒకనాఁడు నారదమునీంద్రు డత్తరువుకడకుఁబోయి, దానిని విలోకించి "ఓవృక్షరాజమా! నీవింతపొడవుగల్గి యనేకమృగపక్షులకు నాశ్రియమిచ్చుచున్నావు. నిన్నుఁజూడ నాకెంతయు ముదము కలుగుచున్నది. కాని యొక్కవిషయము నిన్నడుగఁ దలచినాను. సాధారణముగా ననిలునిచేతఁ బెద్దపెద్ద వృక్షములు పడుచుండును. నీవు మాత్రిమట్లు పడక యుంటివి. ఇందునకుఁ గారణమేమి? పవనునకును నీకును నేమైన బాంధవమున్నదా! అతఁడు నీయందు దయఁబూని రక్షించుటచేత బ్రదికితివా? యని పలికెను. అనినవిని యాబూరువ వాయువు

బలము నాబలముతో నెనగాదు. నాబలములో నెనిమిదవ భాగమాతని కుండు'' నని బదులు చెప్పెను. "అట్లనవలదు. పవనుని ముందు గొండలేయాగవు. సకలభూతముల చేష్టితములు వాయువశగతములుగదా!" యని నారదుఁడు పలుక "ఘనమూలప్రబల శాఖాయుతుఁడనైన నన్ను వాయువు దాకినచో నతని ప్రభంజన నామమునకు భంగము వచ్చునని భయంబంది నాతెరువునకు రాడు" అని శాల్మలీతరువు మరలఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఇట్లు గర్వించి పలికిన శాల్మలీ వృక్షముంజూచి "నీవిప్పుడు పలికిన మాటలు మఱువక యుండుము. నీబిరుదుమాటలాపవనుఁడు విను"నని పలికినారదుం డచ్చోటు వాసి పవనుని కడకుఁబోయి శాల్మలీతరువు పలికిన గర్వవాక్యముల వినిపించెను. మారుతుం డామాటలు విని, కోపము వహించి వెంటనే శాల్మలీతరువుం జేరి "నేను కరుణఁబూనియుండుటచేత నీవింతవఱకు నశింపక యుంటివి. దాని కింత గర్వించి నారదునితో నట్లుపలికితివిగా" యనిన నబ్భూరుహము "నీవట్లు పలుకుటకు నేను నీకంటెఁ దీసిపోతినా! లోకముననున్న తక్కిన వృక్షములను నన్నును నొక్కటిగఁ జూడఁదలఁచితివా యేమి? నాబలము నీకుఁదెలియ" దని బదులు చెప్పెను. అమాటలకుఁ బవనుఁడు ఒకనాఁడు "బ్రహ్మ నీ నీడకు వచ్చి యించుక కాలము విశ్రమించుటఁ జేసి యాతని కృపకుఁ బాత్రవైతివి. నేనును నా కారణమున నిన్ను మన్నించితిని. కానిమ్ము. ఇప్పుడు చెప్పినమాట మరలఁ జెప్పుము చూచెద" నని పలికి వెడలెను. మారుతుం డరిగిన పిదప నావృక్షము తనలో "నక్కటా! నారదునికి నే నట్లువచించితిని. వచించితినిగాక!

అతఁడేల వాయుపుత్రుతో నా మాటలు జెప్పవలయును. చెప్పినం తనే మారుతుఁడు నాయొద్దకువచ్చి యిట్లుపలికినప్పుడు నేనేల గర్వించి ప్రత్యుత్తరమిచ్చితి! మహాబలుండైన పవనునిరాకకు నే నోర్వఁగలనా? అతనిముందట నేనెంత? అతఁడు రేపు నామీఁదకు రాకమునుపే యతనిని నేనేయొకవిధంబున గెల్వవలయు నని తలంచి తన్నుందాన విఱుచుకొని పడియుండె. మఱునాఁడు ప్రభంజనుఁడువచ్చి పడియున్న శాల్మలింజూచి "నేఁజేయ దలఁచినపని నీవే చేసికొంటివా?" యని యుల్లసం బాడి చనెను.

దుర్బలుఁడు ప్రబలునితోఁ దొడరి మత్సరగ్రస్తుఁడయి నచోఁ దనవిభవమును గోల్పోవును.

చ॥ మనుగడదప్పనొక్కొ ముని • మాటలుగైకొననైతినాబలం
బన నదియెంత యుగ్రతమ • హాబలురాకకునోర్వఁజాల ; నా
తనువొకభంగిగెల్తునని • తాఁదలపోసి హరించె నాకులుం
గొనలునుజొంపములు నిడుద • కొమ్మలు రేయగుమున్ రయంబునన్

18
కాపవ్యుఁడు

మున్ను పారియాత్రాచల సమీపమునఁ గాపవ్యుఁ డను నొకబోయవాఁడు కలఁడు. వాఁడు విలువిద్యయందు మిక్కిలి నేర్పరి. వాఁడు కులమునకు బోయవాఁడైనను సకలసద్గుణములచే విరాజిల్లుచుండెను. వృద్ధులైన తల్లిదండ్రులయెడల మిగులభక్తిఁబూని వారికేకొఱంతయు సంభవింపకుండ నిరం

తరము సేవించుచుండెను. ఆప్రాంతముననున్న మునులకు మృగబాధలు గలుగకుండఁ జూచుచుఁ వారికిఁగావలసిన ఫలములు మొదలగునవి యొసంగుచు వారియాశీర్వచనములకుఁ బాత్రుఁడగుచుండెను. ఇట్లుండ వానిసుగుణములకు మెచ్చి యచ్చటనున్న దస్యులెల్ల వానినిఁ దమకు నధిపతిగాఁ జేసికొనఁ గోరి, వానికడకేగి తమయభిప్రాయముఁ దెలిపిరి. వారియభిప్రాయమెఱిఁగి కాపవ్యుఁడు వారికిట్లనెను: "శిశుమునిజన స్త్రీల నెవ్వఁడును జంపరాదు. తనమీఁద నెవ్వఁడును ముంచు గవియకుండ నతఁడు వానిం గవయరాదు. స్త్రీలఁ జెఱపట్టరాదు. ఎట్టిమృగములలోనైన నాడుదానిం జంపఁగూడదు. గోబ్రాహ్మణులను సంకటపెట్టరాదు. గోబ్రాహ్మణ సంరక్షణార్థము యుద్ధము జేయవచ్చును. దానివలనఁ బుణ్యమొనఁగూడును. ప్రజకు బాధఁగలిగించి ధనమార్జించుట పాపము. ఇట్టిధర్మము లన్నియు మీరు బాగుగ నెఱింగి నేఁజెప్పు దెఱంగున మీరుండు రేని మీకు ముఖ్యుండనై యుందును." అనిపలికిన విని యా దస్యులు వాని వచనములకు సంతోషముతో సమ్మతించి, యాకాపవ్యునిఁ దమకు ముఖ్యునిగాఁ జేసికొని కృతార్థులయిరి.

"క॥ బలవిక్రమసంపన్నుఁడ
వలఘుచరిత్రుఁడవు మమ్ము • నందఱ ప్రభువై
తలకొని రక్షింపుము నీ
వలచినపనిగొనుము పుత్ర • వర్గముబోలెన్."

19

కుక్కురనీచత్వము

ఒకయరణ్యమున నెప్పుడును దపోవృత్తినిఁ గాలముగడపుచున్న యొకమునీశ్వరుఁడు కలఁడు. ఒకసమయమున నాతఁడు తపముఁ జేసికొనుచుండఁగా నెక్కడనుండియో యొకశునకమాతనికడకువచ్చెను. మునీంద్రుఁడు దానియెడలఁ గరుణ వహించి యాశ్రయమిచ్చి పోషఁదొడగెను. ఆశునకమును నాతనియందు భక్తిఁబూని యతనియందు విశ్వాసముకలిగి వర్తించుచుండెను. మునీంద్రుఁడెచ్చటికేఁబోయిన నదియునాతనివెంటఁ బోవుచుండును. ఏదియేని క్రూరమృగము దానిపైకి వచ్చినప్పుడది మునియొద్దకుఁ బరుగెత్తుకొని వచ్చుచుండును. ఎప్పుడైనను సింహముగాని, వ్యాఘ్రముగాని దానిం దరుముకొని వచ్చినచో, మునీంద్రుఁడు తన తపోమహిమచే దానిని ననేకరూపములుగామార్చి యామృగములను గెలిపించుచుండును. ఇట్లు ప్రతిదినమును మునిమహిమచే ననేకరూపములఁ దాల్చుచుఁ దుదకు శరభాకృతిందాల్చి మదంబునఁ జరించుచుండెను.

ఇట్లుండ నొక్కదినమున శరభరూపమున నున్నను గుక్కబుద్ధిని విడుక తనమనమున "ఈమునీంద్రుఁడు నన్నెప్పుడెట్టిరూపముగా మార్చవలెనన్న నట్లుమార్చుచున్నాఁడు. ఈకృప యెప్పుడును నుండునో యుండదో! కావున నే నీతనిం జంపితినేని, నేనెప్పుడు నిట్లేయుండవచ్చునని" యాకుక్క-

రము తలంచెను ఆమునీంద్రుఁడు దానిభావ మెఱింగి "నిన్ను నేను పెంచుచున్న విశ్వాసమును విడిచి నా కెగ్గుసేయఁ దలంచితివి. ఇందు నీవలన నావంతయు దోషములేదు. నీచజన్మమునఁ బుట్టిన నిన్ను దగ్గఱఁ జేర్చుకొనుట నాదేదోషము. కావున మునుపటివలెఁ గుక్కవై యుండు"మని పలికెను. అంతట నది యెప్పటి కుక్కరూపముఁ దాల్చెను.

చ॥ "ననుఁగనియొందుసత్త్వముమునంబున బెగిలిపాఱునప్పుడీ
మ్మునివరుఁ డిట్లపోలెఁగృప మొక్కలమొశ్రరభంబుగాఁగఁజే
యునో తగ దానినట్లయిన నుద్ధతినాకుఁ జరింపలేదుగా
వున నితనిన్ వధింతు వెరపున్ బలమున్ సరి నుల్లసిల్లఁగన్."

20

భృగుఁడు

భాగీరథీ నదీతీరమున మహాపద్మంబను నామంబున నొప్పు నొకపురముకలదు. అందు భృగుండను నొకబ్రాహ్మణుఁడు కలఁడు. అతఁడు నిత్యధర్మరతుఁడును, సత్యవ్రతుఁడును, నహింసాశాలియు, నింద్రియముల జయించినవాఁడును, నిష్క్రోధుఁడును, న్యాయముగా నార్జించిన ధనముచే నతిథి యభ్యాగతులఁ బూజించువాఁడును, మిత్రకార్యములు నిర్వర్తించువాఁడును నై యుండెను. అతనికి సద్గుణమూర్తులైన తనయులుగలరు అతఁడెప్పుడును, "నెట్టికార్యముఁ జేసినచోఁ గైవల్యమును గాంచవచ్చు"నని చింతించుచుండును.

ఇట్లుండ నొకదినమున నాతని యింటికొక బ్రాహ్మణుఁ డతిథియై వచ్చెను. భృగుం డా బ్రాహ్మణున కాతిథ్యమిచ్చి, గౌరవించి "బ్రాహ్మణోత్తమా! లోకసామాన్య గుణాకలనమున బద్ధుఁడనై యుంటి. ఎట్లు నేను ఖండరహితమగు సుఖమున మునింగియుండి ముక్తిఁబొందఁ గలుగుదు" నని యడిగెను. అనిన విని యాబ్రాహ్మణుం డిట్లుపలికె, "నేనును నీవలెనే మోహాధీనుఁడనై యుంటిని. కొందఱు బ్రహ్మచర్యమున నుండి, కొందఱు గృహస్థధర్మములఁ బూని, కొందఱు వనమునఁ దపముఁజేసి కొందఱు యజ్ఞములుజేసి, కొందఱు దానములాచరించి, కొందఱు జననీ జనకారాధనమొనర్చి, కొందఱు గురుభక్తిఁబూని, కొందఱు సత్యవ్రత మవలంబించి, మోక్షమును గాంతురు. మోక్షమును గాంచుట కనేక మార్గములున్నవి. ఇంతకు నన్నిటికిని ముఖ్యమయినది యాత్మానందము. అట్టి యాత్మానందము సామాన్యముగా నలవడదు. నైమిశారణ్యసమీపమున గోమతి యనునదికలదు. దాని ప్రక్క మహాపద్మమను పుణ్యహ్రదము కలదు. దానితటమునఁ బద్ముఁడను సర్పరాజుకలఁడు. అతఁ డుదాత్తుఁడు, అఖిల ధర్మజ్ఞుఁడు, దయాపరుఁడు. అతిథిపూజారతుఁడు, పుణ్యచరిత్రుఁడు, నీ వాతని సన్నిధికిఁ బోయినచో నీకోరిక తీరును." భృగుఁ డా భూసురుని పలుకులకు సంతసించి, యతనినిఁ దనయింట రెండుదినము లుండిపొమ్మని కోరెను. భృగునికోరిక ననుసరించి యతఁడు రెండుదినము లుండి యరిగెను.

తరువాత భృగుఁడు, పద్మునిఁ జూడఁగోరి ప్రినదినది యాణములు సేయుచు, ననేక తీర్థసంసేవలు సల్పుచు, నైమిశారణ్యమును బ్రవేశించి, గోమతీ నదింగాంచి, మహాపద్మహ్రదము తటముననున్న భుజగేంద్రుని మందిరమునుజూచి నెమ్మదిగా నందుఁబ్రవేశించెను. భృగుం డా మందిరముఁ జొచ్చిన యంతనే, భుజగేంద్రుని భార్య యతని కెదురువచ్చి తోడ్కొనిపోయి పూజించి సుఖాసీనుం జేసి "బ్రాహ్మణోత్తమా! నీరాకకుఁ గారణము సెప్పుము నీపనుపుఁ గావించెద" నని పలికెను. అనినవిని భృగుండు "దేవీ! నీప్రాణేశ్వరునిఁ జూడ వచ్చితిని, అతనిం జూడజేయు" మనెను. పద్ముఁడప్పుడు మందిరమున లేడు సూర్యరథము గడపుట కరిగియుండెను. ఎనిమిది దినములకుఁ గాని గృహంబునకు రాఁడు. భుజగేంద్రుని భార్య యావృత్తాంత మాతనికెఱింగించెను. అంతట నాభూమీసురుఁడు సర్పరాజు వచ్చువఱకును నచ్చటనున్న వనమున నుందుననియు, వచ్చినతరువాతఁ దనరాక నతని కెఱింగింపుమనియుఁ జెప్పి యచ్చోటు వాసెను. భృగుం డా మందిరమునకు సమీపముననున్న వనమున, బ్రవేశించి నిరాహారుఁడై భుజగనాథుని రాకకు వేచియుండెను అట్లాఱుదినములు గడిచెను. ఏడవదినంబున పద్ముని బంధువు లాతనిపాలికిఁ బోయి "భూసురోత్తమా! నీవు భుజించి నేటి కేను దినమ్ములయ్యె. మే మెప్పుడును నతిథుల బూజించుచుందుము. మా వ్రతమునకు భంగముఁ గలిగింపక మాయొనర్చు నాతిథ్యమును గ్రహింపుము. నీవేదికోరిన, దానిం దెచ్చియిచ్చెదము, భుజింపు" మని పలికిరి. అందునకు భూసురుఁడు వారింజూచి "నేను భుజ

గేశ్వరుని రాకఁగోరి నిరీక్షించుచున్నాఁడ, ఆతనిం జూచు వఱకు నేను జలమునైన ద్రావను. మీకు ధర్మవిరోధముగా కుండ నీదినముగూడ జూడుడు. రేపాతఁడు రాకున్నచో భుజించెద" నని ప్రార్థనా పూర్వకముగఁ బలికెను. వా రందున కొడంబడి తమ నిలయమునకుఁ బోయిరి.

మఱునాఁడు భుజగేంద్రుఁడు మందిరమునకు వచ్చెను. అట్లు వచ్చిన యాసర్పరాజు భార్యచేఁ బూజింపఁబడి యొక్క యెడ సుఖాసీనుఁడై యుండి భార్యను "కాంతా! నీకు సేమమే కదా! దేవతాతిథిపూజనములు జాగ్రత్తగా నడుపుచుంటివికదా! నేను లేని కాలమంత యేమియు లేదుకదా" యని యడిగెను. అనిన విని యక్కాంత "దేవా! నీ శిక్షాతిశయమున నేను ప్రతి విషయము జాగరూకతతోఁ జూచుచుంటి. అతిథులఁ బూజించుచుంటి. బంధుజనులకుఁ బ్రీతిఁగలిగించుచుంటి గురుభక్తి శిష్యులకును, వేదపఠనము విప్రులకును, జనరక్ష భూపతులకును, న్యాయార్జనము వైశ్యజనములకును, ద్రివర్ణారాధనము శూద్రులకును, ప్రభువాక్యసరణము భటులకును, నెట్లు నియమింపఁ బడియున్నదో యట్లే పతివ్రతాత్వము భార్యకును వ్రతమైయున్నది. ధర్మరతుఁడవగు నీచిత్తమున ఖేదముదోడర కుండ వర్తింతు"నని పలికి మఱియు నిట్లనెను. "నాథా! నిన్నుం జూచుట కొకభూమీసురుండువచ్చి నాచేతఁ బూజింపఁబడెను. ఎందున కరుదెంచితివన, నిన్ను దర్శించుటకని చెప్పెను. కార్యము మాత్రముఁ జెప్పక వనంబున నీరాకఁ గోరుచున్నాఁడు. నేటి కాతఁడు భుజించి యెనిమిది దివసంబులయ్యెను. నీవు వచ్చువఱ

కును భుజింపనని పలికినాఁడు. కావున నీ వచ్చటికరిగి యతనిని సంభావింపవలయు" భార్యమాటలు విని యాపద్ముఁడు కుపితుఁడై "నే నెక్కడ! ఆ భూసురుఁడెక్కడ! నే నాతనిం గాంచ బోవలయునా! దేవతలును నసురులును నేరీతి నన్ను గౌరవింతురో నీ వెఱుఁగవా!" యని పలికెను. ఆమాటలు విని భార్య "నాథా! నీరాకఁగోరి నిరాహారుఁడై యున్న విప్రునియభిలాషఁ దీర్పకుండుట నీయట్టిధర్మరతునకు ధర్మమా? ఆ బ్రాహ్మణుని యాసఁ జెఱిచి, తత్పాపాగ్నిచే నీపురుషార్థమును, కృపయు, ధర్మమును గాల్పఁదలంచితివా? నీ వాబ్రాహ్మణున కాశావిచ్ఛేదనము గలిగించితివేని నీకు బ్రహ్మహత్య సంభవించును. కావున రోషముడిగి వానరాకఁగోరు చాతకమువడువున నీకై వేచియున్న యాభూసురుని సంభావింపు" మని ప్రబోధించెను. పత్నిబోధ విని కోపముడిగి యామెనుజూచి "తరుణీ! ఒరుని జూడఁ బొమ్మని పలికినంతనే యాగ్రహముకలిగి యట్లంటిని. అంతటితో నీవూరకొనక నాకుధర్మము జెప్పి మహోపకారము జేసితివి. రావణుఁడు కార్తవీర్యార్జునుఁడు మొదలగు ప్రముఖులు క్రోధముచేతనే సమసిరి. కావునఁ గ్రోధము విడువవలయును. నీయట్టి భార్యయుండుటచే దురితాపాయమునఁ బడక తొలఁగితిని. ఇంక నే నవ్విప్రునికడకేగి యతని యభీష్టముఁ దీర్చివచ్చెద"నని పలికి, యాక్షణమునఁబోయి తనరాకకు నిరీక్షించుచున్న భృగుంగాంచి, యతనిం బూజించి నిజమందిరమునకుఁ దోడ్కొనివచ్చి యతఁ డడిగిన యర్థములకెల్లఁ దగు నుత్తరము సెప్పి ప్రముదితాంతరంగునిఁ జేసి పంపెను.

క॥ "మౌనమున దృఢజ్ఞానము
దానంబున నభ్యుదయము • ధర్మనిరతి యా
శానిర్వహణంబున నర
కానేకనివారణ సౌఖ్య • మగునండ్రు బుధుల్.

21

భగీరథుఁడు

తొల్లి యిక్ష్వాకు కులమున సగరుండను రాజు కలఁడు. అతఁ డనేకరాజులను జయించి, నిరంకుశముగ ధరాతలముఁ బాలించుచుండెను. అతనికి వైదర్భియు, శైబ్యయు నను నిద్దఱు భార్యలు కలరు. అతనికి సంతానము లేకపోవుటచే భార్యాసహితుఁడై కైలాసమున కరిగి, పరమేశ్వరునిఁ గూర్చి యుగ్రమైన తపస్సుఁ జేసెను. పరమేశ్వరుఁ డాతని తపమునకు మెచ్చి ప్రసన్నుఁడై వైదర్భియం దఱువది వేవురు కొడుకులును, శైబ్యయందొక్కఁడును గలుగుదురనియు, నయ్యఱువది వేవురు పుత్త్రులును నేకకాల మృతినందుదురనియు, నయ్యొక్క కొడుకు వంశకర్త యగుననియుఁ జెప్పెను. అంతఁ గొన్నాళ్ళకు సగరుని భార్యలిరువురును గర్భముల ధరించిరి. వైదర్భికఱువది వేవురు కొడుకు లుదయించిరి. శైబ్యకు నసమంజసుఁడను కొడుకు పుట్టెను. అట్లు జన్మించిన యఱువది వేవురు పుత్త్రులును క్రమక్రమముగ వర్ధిల్లి, కడు దర్పితులై లోకముల కెగ్గు సేయుచుండిరి. అసమంజసుఁ డతిక్రూరుఁడై పౌరబాలకుల

నకారణముగ వధియించి నదిలోఁ బడవైచుచుండెను. సగరుఁ డట్టి దుష్కార్యములు సహింపక, వానిని విడిచిపెట్టెను. ఈ యసమంజసునకు నంశుమంతుఁడను కుమారుఁ డుండెను. సగరసుతులగు నఱువది వేవురును జేయు బాధలకోడి యమరులెల్ల బ్రహ్మపాలికిఁ బోయి విన్నవించుకొనఁగా, వారు త్వరలో దగ్ధులగుదురని యాతఁ డానతిచ్చెను. నిఖిలలోకనివాసులును 'సగరసుతు లెప్పుడు మడియుదురా' యని నిరీక్షించుచుండిరి.

ఇట్లుండ సగరుఁ డశ్వమేధయాగ దీక్షితుఁడై యజ్ఞాశ్వమును విడిచెను. దానివెంట రక్షకులుగా నతని సుతు లఱువది వేవురును జనిరి. వానిచే రక్షితంబైన యా యాగాశ్వము వసుంధర యెల్లఁ దిరిగి సముద్రములోఁ దిరిగి యదృశ్యంబయ్యెను. సగరసుతులు దానిజాడ నెఱుంగజాలక, యా సంగతి సగరున కెఱింగించి, యతని యానతిని వెదుక నారంభించిరి. భూలోకమున నెచ్చటను నది కనఁబడలేదు. అంత వారు పాతాళంబున నన్వేషింపఁదలఁచి భూమినివ్రచ్చి పాతాళమును బ్రవేశించి, యచ్చటఁ గపిలమహాముని యాశ్రమసమీపమునఁ గట్టఁబడియున్న యజ్ఞాశ్వమును గాంచి, యతఁడే దానిని హరించినాఁడని తలంచి, యమ్ముని ననేకవిధములఁ బరిభవించిరి. అందునకు మునీంద్రుం డలిగి యతిఘోరదృష్టిం జూచినయంతనే, వారందఱును భస్మమైరి. ఈ వార్త నారదుఁడు వచ్చి సగరున కెఱింగించెను. సగరుడు కుమారుల మృతికి మిగుల వగచి, పరమేశ్వరుని వాక్యములు దలఁచి ధైర్యము వహించి, తన మనుమఁడైన యంశుమంతునిఁ జూచి యిట్లు పలికె. "వత్సా ! నీతండ్రు లఱువది వేవురును గపిలమహా

ముని కోపాగ్నిం బడి దగ్ధులైరి. నీతండ్రి క్రూరకార్యము లొనర్చు
చుండుట నాచేత విడువఁబడెను. పురాకృత ప్రారబ్ధవశమున
జరిగిన యీ కుమారుల మరణమునకు వగవను. కాని యశ్వ
మేధమునకు భంగమగునని చింతించెద. నీవిపు డరిగి యెట్లయిన
మఖాశ్వమును గొని రావలయును" అనిన విని యంశుమంతుఁ
డా క్షణమున బయలుదేరి, సగరకుమారులు చనినమార్గమును
బట్టి చని పాతాళముఁ బ్రవేశించి, సహస్రదివకరుల చంద
మున వెలుంగుచున్న కపిలమహామునిం గాంచి, తత్పాదములకు
నమస్కరించి తాను వచ్చిన కారణ మెఱిఁగించెను. కపిలుఁడు
వాని వినయగుణమునకును, భయభక్తివిశేషములకును సంత
సించి, యశ్వంబునిచ్చి "వత్సా! నీ కారణమున నీ తండ్రులు
సుగతికిఁ బోఁగలుగుదురు. సగరునకును నుత్తమగతి దొర
కును. నీకు మనుమఁడగు భగీరథునిచేతఁ దేఁబడు గంగాజల
ముల మూలమున నీ తండ్రులు స్వర్గమునకుఁ బోవుదురు.
సముద్రమున జలము సంపూర్ణమగును" అని చెప్పెను. అంశు
మంతుఁ డావిధమునఁ గపిలుని ప్రసాదమంది యశ్వమును
దెచ్చి, సగరునకు సమర్పించి జరిగిన వృత్తాంతమంతయుఁ
జెప్పెను. సగరుఁడు పుత్రశోకము విడిచి, యాగము బూర్తిఁ
జేసి సముద్రునిఁ బుత్రునిఁగాఁ గల్పించుకొనెను. నాటి
నుండియు సముద్రమునకు సాగరమను పేరు వచ్చెను.

సగరుఁడు పెక్కేండ్లు రాజ్యము నేలి, యంశుమంతునకు
రాజ్యమిచ్చి తపోవనమునకుఁ బోయెను. అంశుమంతుఁడును
బితామహునివలెనే రాజ్యము బాలించిన పిదప నిజపుత్రుఁడైన

దిలీపుని పట్టభద్రునిఁ జేసి తాను తపమునకుఁ బోయెను. దిలీ
పుఁడు తనపితామహులగు సాగరులకు స్వర్గముగలిగించుటకు
గంగఁ దెచ్చుటకుఁ బ్రయత్నించెను గాని శక్తుఁడుగాక పోయెను.
దిలీపునికొడుకు భగీరథుఁడు. భగీరథునియందు రాజ్యభారము
నిలిపి దిలీపుఁడు తపమున కరిగెను. కపిలుని కోపాగ్నిచేఁ దన
పితామహులగు సాగరులు దగ్ధులైరని విని వారికి హితము సేయ
దలంచి గంగను దెచ్చుటకుఁ గడంగెను. అతఁడు హిమవత్పర్వ
తమునకుఁ బోయి పరమనిష్ఠతో ఘోరమైన తపస్సుఁ జేసెను.
ఆతపమునకు మెచ్చి గంగాదేవి ప్రసన్నయై యతని యభీష్ట
మెట్టిదని యడిగెను. భగీరథుం డాదేవికి నమస్కరించి యిట్లు
పలికె. "కపిలుని కోపాగ్నిచే నాపితామహులగు సాగరులు
దగ్ధులైయుండి వారు భవదీయ పుణ్యజలసంసిక్తులైనచో స్వర్గ
మును బ్రాపింతురు. కావున నాయం దనుగ్రహించి నీవీ దేవపథ
మునుండి వసుంధరకు రావలయు" భగీరథుని వాక్యములు విని
యాగంగ "నేను భూమికి వచ్చునప్పుడు నాజలము భరించుట
కొక్క నీలకంఠుఁడు శక్తుఁడగును. కావున నీవతని కరుణబడయు"
మని చెప్పెను. ఆమాటలవిని భగీరథుఁడు శివునిఁ గూర్చి
తపము సేయ, నద్దేవుఁడు ప్రత్యక్షమై "నీవు భూలోకమునకు
గంగను దీసికొనిపొమ్ము. నేను గంగను జటాజూటమున ధరిం
తు"నని పలికెను. భగీరథుఁడు మరల గంగాదేవిని స్తుతించి
యామె కరుణఁబడసెను. అంత నాగంగ మహాతరంగ సంహతు
లతో వచ్చుచుండ శంకరుఁడు జూటాగ్రమునఁ దాల్చెను.
అనంతర మాపావనవాహిని భగీరథునిచే భూమిమీఁదికిఁ గొని
రాబడి సముద్రమును గూడి సాగరుల భస్మరాసులపై ప్రవ

హించి వారినిఁ బవిత్రులఁ జేసెను. భగీరథునిచే భూమికిఁ గొనిరాబడుటచే గంగకు భాగీరథియను పేరువచ్చెను.

క॥ "సాగరులకు సద్గతిగా [illegible]
సాగరమును దివిరి సలిల • సంపూర్ణముగా
భూగతయై భాగీరథి
భాగీరథకీర్తి భువన • పంక్తుల సంచెఁ."

22
ద్రోణుఁడు

ద్రోణుఁడు బ్రాహ్మణుఁడు. మహావీరుఁడు. ఈతఁడు భరద్వాజ మునీంద్రునిపుత్త్రుఁడు. ఈతఁడును పాంచాల పురాధీశ్వరుఁడగు ద్రుపదుఁడు నొక్కగురువుకడ విద్యలనభ్యసించిరి. ఆసమయమున వీరతిమైత్త్రిం దగిలి వర్తించిరి. చదువు చాలించి, ద్రుపదుఁడు నిజపురమునకుఁ బోవునప్పుడు ద్రోణునిఁ జూచి "నేను రాజునై యుండగా నీవు నాకడకువచ్చి నావలన సత్కారము బొందవలయు" నని చెప్పి యరిగెను. తరువాతఁ గొన్నాళ్ళకు ద్రోణుఁడు వివాహమాడి యశ్వత్థామయను నొకపుత్త్రునిఁ గాంచెను. అతనికి విద్యయుం దెట్టికొఱతయు లేదు. కాని దారిద్ర్యదేవత యాతనియొద్ద మూర్తీభవించియుండెను. అతఁ డెట్లయినను దనదారిద్ర్యము బాపుకొనఁ దలఁచి పరశురాముని యొద్దకుఁ బోయెను. పరశురాముఁ డంతకుమున్న తనయొద్ద

నున్న ధనమంతయు విప్రులకుఁ బంచియిచ్చినకారణమున, నమోఘములైన యస్త్రములుమాత్రము ద్రోణున కిచ్చెను. తరువాత ద్రోణుఁడు బాల్యమునఁ దనకు ద్రుపదుఁడు చెప్పిన మాట జ్ఞప్తికిఁ దెచ్చుకొని యతనియొద్దకుఁ బోయెను. ద్రుపదుఁ డప్పుడు రాజై యుండెను. ద్రోణుఁడు తిన్నగా ద్రుపదుని కొలువుకూటమునకుఁ బోయి తమ బాల్యస్నేహమును ప్రకటించెను. ద్రుపదుఁ డైశ్వర్యగర్వమున మునిఁగి ద్రోణుని నాదరింపక "నీ వెవ్వఁడవు? నే నెవ్వఁడ? నీవు దరిద్రుఁడవు, నేను నరపాలుఁడ! నీకును నాకును సఖ్యమెట్లు" పొమ్మని పలికెను. బాల్యస్నేహమును మఱచి ద్రుపదుఁ డట్లు పలికినందులకు ద్రోణుఁ డాగ్రహించి పలికి యచ్చోటు వాసెను.

తరువాత నీతఁడు నెమ్మదిగా హస్తినాపురమున భీష్మునిఁ జేరెను. భీష్ముఁ డీతని ననేకవిధముల గౌరవించి పెక్కుభాగ్యములిచ్చి, కురుపాండవుల కస్త్రశస్త్రవిద్యలు గఱపమని కోరెను. ద్రోణుఁడు సంతసించి యచ్చటనుండెను. కొన్నాళ్ళకు ద్రోణుఁడు రాజకుమారులను సకలాస్త్రవిద్యాపరిపూర్ణులుగాఁ జేసెను. ద్రుపదునివలనఁ దనకుఁగలిగిన పరాభవమునకుఁ బ్రతీకార మర్జునుఁడు సేయఁగలఁడని ద్రోణుఁడు తలంచెను. కురుపాండవులు గురుదక్షిణ యడుగుఁడని ద్రోణునకుఁ జెప్పినప్పుడు "యుద్ధమున ద్రుపదుని బంధించి తెచ్చి నాముందు పెట్టుటే గురుదక్షిణ" యని యతఁడు వారికి బదులు చెప్పెను. ద్రుపదుని బట్టి తెచ్చుటకు ముందు కౌరవులేగి, యతనిచేఁ బరాభవింపఁబడి వచ్చిరి. తరువాత నర్జును డరిగి భయంకర

యుద్ధమున ద్రుపదు నోడించి తన రథమునకుఁ గట్టి తెచ్చి ద్రోణుని ముందు బెట్టెను. ద్రోణుఁ డర్జునుని పరాక్రమమునకు సంతసించి, ద్రుపదునిఁ జూచి "ఓహో! వీరు ద్రుపదమహా రాజులేనా? ధనగర్వమున బాల్యస్నేహమును మఱచి నిండు సభలో నన్ను నిరాదరించినవారా? అయ్యో! ఎట్లు పట్టుబడినారు. బ్రాహ్మణుని నవమానించిన గర్వ మిప్పు డడఁగినదా? మాకుఁ జిక్కిన నిన్నిప్పుడు మేమేమి చేసినను చేయగలము. కాని, నీ తండ్రి నా తండ్రికి హితుఁడగుటచే క్షమింపవలసి వచ్చినది." యని యుల్లసములాడి విడిచిపుచ్చెను.

ద్రోణుఁడు కౌరవుల యొద్దనే యుండెను. అతఁడుగూడ భీష్మునివలెనే ధర్మమూర్తియగుటచేఁ బాండవులకు రాజ్యభాగ మిచ్చు విషయములోఁ గౌరవుల కనేకసారులు చెప్పెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఈతఁడు కౌరవపక్షమున నిలిచి యద్వితీయ పరాక్రమముతోఁ బోరాడెను. ఈతఁడు సమరము సేయుదినములలో నీతఁ డెప్పుడు రణమునఁ గూలునా యని పగవారు తలంచుచునే యుండిరి. ఒకనాటి యుద్ధమున నీతఁడు పరాక్రమమున విజృంభించి రిపుసేనను చిందరవందర సేయుచుండగా నీతనిం జంపుటకు మార్గము గానక శ్రీకృష్ణుఁడు ధర్మరాజుచే "నశ్వత్థామ యను కుంజరము చచ్చె"నని పలికించెను. ద్రోణుఁడు తన కుమారుఁడే మరణించెనని తలంచి యస్త్రము నేలఁబెట్టి శోకించుచుండెను. ఆసమయమున వెనుకనుండి వచ్చి ద్రుపదపుత్రుండగు ధృష్టద్యుమ్నుఁడు ద్రోణుని కంఠము నఱికెను.

క॥ [illegible]
[illegible]లె యెట్లు కృపణు • లయి పట్టువడన్
వీరికి వలసెనె యహహా యు
సా[illegible]జ్య మదాంధకార • మడి వాసెనొకో."

23

ధర్మరాజు

ధర్మరాజు పాండురాజునకుఁ గుంతీదేవియందు యమునివరమున జన్మించెను. పాండవులలోఁ బెద్దవాఁడు ధర్మసంఘుఁడని పేరుగన్నవాఁడు. అనృతమాడనివాఁడు. పాండురాజు గతించినపిమ్మట పాండవులు ధృతరాష్ట్రునిచేఁ బెంపఁబడిరి. చిన్నతనమునుండియు ధర్మరాజుగుణములు ప్రజలచే శ్లాఘింపఁబడెను. ధర్మజుని ధర్మసంధత, సత్యవ్రతము, మొదలగు సద్గుణములు చూచి, ధృతరాష్ట్రుఁడు భీష్మద్రోణవిదురాది వృద్ధుల సమ్మతిని నాతనిని యువరాజుగాఁ జేసెను. ప్రజలెల్లరును దానికి సంతసించిరి. కాని, ధర్మరాజు యువరాజుగానుండుట, కౌరవులలోఁ బెద్దవాఁడైన దుర్యోధనునకు మాత్రమిష్టము లేదు. అతఁడు పాండవులయం దోర్వలేనితనము వహించి, యెట్లయినను వారిని నరగమునుండి వెడలనడపవలయునని సంకల్పించుకొని, నెమ్మదిగాఁ దన యభిప్రాయము తండ్రికి దెలియఁజేసెను. అంధుఁడైన ధృతరాష్ట్రుఁడు కుమా

రుని కపటవాక్యములకుఁ దలయూఁచి, "పితృకర్మలు చేసి రావలయు"నని నెపముబెట్టి పాండవులను వారణాసికి బంపెను.



పంచపాండవులు.

ధర్మరాజు అమాయకుండగుటచే ధృతరాష్ట్రుని యాజ్ఞను సమ్మతించి తమ్ములను, తల్లియగు కుంతిని వెంటఁ బెట్టు

కొని వారణాసి కేగెను. వారణాసియందు పాండవులు దిగుటకు దుర్యోధనుఁ డొకలాక్షాగృహమున నిర్మించెను. పాండవులందు దిగిరి. ఎట్లయినను పాండవులను హతముసేయవలయునని తలంచియున్న దుర్యోధనుఁడా లక్కయింటికిఁ బురోచనుఁడనువానిచే నగ్నిఁ బెట్టించెను. కాని, పాండవుల శ్రేయము గోరువాఁడును, ధర్మవిదుఁడును నగు విదురుఁ డంతకు మున్నే దుర్యోధనుని పన్నుగడ పాండవుల కెఱింగించుటచే, లక్కయింటఁబడి చావకుండ వారు తప్పించుకొనిపోయి, యందందు ప్రచ్ఛన్నవేషములతో నుండి, తుదకు ద్రుపదుని నగరమును బ్రాహ్మణవేషములతోఁ బ్రవేశించిరి. ఇచ్చట నర్జునుడు మత్స్యయంత్రమును గొట్టెను. పాండవు లేవురును ద్రుపదరాజ తనూజయగు ద్రౌపదిని వివాహమాడిరి. ద్రౌపదీ వివాహానంతరమున భీష్మద్రోణ ప్రబోధితుఁడై ధృతరాష్ట్రుఁడు పాండవుల రావించి, వారి కింద్రప్రస్థపుర రాజ్యము నిచ్చి, యచ్చటకుఁ బంపించెను.

ధర్మజుం డింద్రప్రస్థపుర రాజ్యమును ధర్మసంధుఁడై పరిపాలించుచుఁ బ్రజల వినుతికి బాత్రుఁడగుచుండెను. తమ్ముల పరాక్రమముచే, ననేకరాజు లాతనికి సామంతులైరి. మయుఁడను దానవవిశ్వకర్మ యొక యపూర్వసభను నిర్మించి తెచ్చి ధర్మనందనున కిచ్చెను. ఈ మయసభాప్రాప్తియే కురుపాండవ యుద్ధమునకుఁ గారణమైనది. మయసభాలాభమును బొందిన ధర్మరాజు రాజసూయయాగము సేయఁదలచి, నానాదేశాధీశుల నాహ్వానించెను. దుర్యోధనాదులుగూడ వచ్చిరి. దుర్యోధనుఁడు పాండవుల వైభవము జూచి యసూయ

వహించి, వారిసంపదలు హరింపదలఁచెను యాగానంతరమాతఁడు నిజపురమునకుఁ బోయి, తండ్రినొప్పించి, సుహృద్ద్యూతమునకుఁ బాండవులను హస్తినాపురమునకుఁ బిలిపించెను. ధర్మరాజు ద్యూతకలాప్రవీణుఁడగుటచే దుర్యోధనుని యాహ్వానమునకు సమ్మతించెను. ధర్మయుద్ధమునకుఁ బిలిచినప్పుడు వినోదార్థము జూదమునకుఁ బిలిచినప్పుడు క్షత్రియుఁడు నిరాకరించుట ధర్మముగాదని ధర్మరాజు దుర్యోధనునితో జూదమాడెను. అమాయజూదమున ధర్మరాజు సమస్తరాజ్యసంపదలను, తమ్ములను, దన్ను నోటువడుటయేగాక, ద్రౌపదినికూడ నొడ్డి యోడిపోయెను. దుర్యోధనుడు ద్రౌపదిని నిండుసభకు రప్పించెను. దుశ్శాసనుఁ డామెశిరోజములఁ బట్టికొనియీడ్చి యగ్రజుని యాజ్ఞపై నామెవస్త్రము లొల్వఁదొడంగెను. సభయందెవ్వరును దుర్యోధనునివారింపలేదు. ద్రౌపది కంటనీరుఁ బెట్టుచు పాండవుల నుద్దేశించి కోపముగలిగించు వాక్యములు పలికెను. శాంతస్వభావుఁడగు ధర్మజుఁ డామెను జూచి యిట్లు పలికెను. "ఓసాధ్వీ! నీపతులలోఁ బరాక్రమశౌర్యబలములులేని వారెవ్వరును లేరు. నేను ధర్మపాశమునకుఁ గట్టుబడియుంటిని. ఇప్పుడు మమ్మునీదారుణవాక్యములచే నుద్రేకచిత్తులుగాఁ జేయవలదు. నిన్నిట్లు పరాభవించిన దురాత్ములు కాలక్రమమున మాచేఁ గూలుట నీవు చూచి యానందింపఁగలవు. ఇప్పుడు నీకు శ్రీకృష్ణుఁడే దిక్కగుగాక! ఇట్లు పలికిన ధర్మజుని శాంతమున కచ్చటివారెల్ల శ్లాఘించిరి.

ద్రౌపది తన్నుఁ గాపాడుమని కృష్ణభగవానుని వేడుకొనెను. దైవబలమునకు సాటియేమున్నది! ఆమెకు వలువ

లక్షయములైనవి. ఇదియంతయు జరిగినపిదప నంధుఁడైన ధృతరాష్ట్రుఁడు ద్రౌపదికి వరప్రదానము గల్పించి ధర్మాత్మజుఁ డోడిన రాజ్యసంపదలన్నియు నిచ్చివేసి ఇంద్రప్రస్థమునకుఁ బంపించెను. కాని దుర్యోధనుఁడు మాత్రము తనదుర్బుద్ధినివిడువలేదు. మఱికొన్నాళ్ళకు మరల నాతఁడు ధర్మజుని జూదమున కాహ్వానించెను. ఈసారి జూదమున నోడినవారు పంద్రెండు సంవత్సరములు వనవాసమును, నొక్కవత్సర మజ్ఞాతమును సేయునట్లు శపథములు జేసికొనిరి. ఈ జూదమునఁగూడ విధికృతమున ధర్మజుఁడే యోడి తమ్ములతోడను భార్యతోడను నరణ్యమున కరిగెను. ధర్మజుఁ డరణ్యవాసము జేయునప్పుడు భీముఁ డెన్నిసారులో క్షాత్రమునననుసరించి దుర్యోధనాదుల వధించుట కాజ్ఞనీయవలసినదని కోరెను. కాని ధర్మసంధుఁడగు నాతఁ డందుకు సమ్మతింపలేదు. కష్టములన్నిటి నోర్చియాతఁ డరణ్యవాసము పూర్తిజేసెను. తరువాత ధర్మరాజు తమ్ములతోడను భార్యతోడను నజ్ఞాతవాసము సేయుటకు మత్స్యదేశాధీశుఁడైన విరటుని కొలువునకేగిరి. ధర్మరాజు కంకుఁడను నామముతోఁ బురాణములు చెప్పుచుండెను. అట్లాతఁడు విరటునియొద్ద నజ్ఞాతవాసము చెల్లించెను. అజ్ఞాతవాసానంతరమున ధర్మరాజు కృష్ణునిఁ దమ రాజ్యభాగము దమ కిమ్మని యడుగుటకుఁ గౌరవులకడకు కృష్ణుని రాయబారిగాఁ బంపెను. సంధికిఁ గౌరవులు సమ్మతింపకపోవుటచేఁ గౌరవులకును బాండవులకును యుద్ధము గలిగెను. ధర్మరాజు కేవలము శాంతగుణప్రధానుఁడే కాదు. వీరులలో నగ్రగణ్యుఁడని చెప్పవచ్చును. యుద్ధమున నీతఁడు విల్లును, ఖడ్గమును

గదనుబట్టి యనుపమాన పరాక్రమముతోఁ బోరాడెను. శల్యునితో గదాయుద్ధము సేయువా రెవ్వరును లేరని, కృష్ణాదులీతని నాతనితోఁ బోరుటకు బ్రోత్సహించిరి. ధర్మజుఁడు గదాయుద్ధమున శల్యుని గూల్చెను. దుర్యోధనుఁడుగూడ యుద్ధమున మడసిన పిదప, నీధర్మరాజు హస్తినాపుర సామ్రాజ్యపీఠము నెక్కెను. ధర్మమార్గమునఁ గొన్నాళ్ళు రాజ్య మేలి, పిదప నభిమన్యుని కాంతయైన యుత్తరయందు జనించిన పరీక్షిత్తునకు రాజ్యమిచ్చి, తమ్ములతోడను, ద్రౌపదితోడను వనమునకరిగి దేహము చాలించెను.

క॥ "ఆపద గడవం బెట్టఁగ
నోపి శుభంబైన దాని • నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి • చనియె మహాత్మా!"

24
భీముఁడు

భీముఁడు పాండవులలో రెండవవాఁడు. కుంతీదేవికి వాయుదేవుని వరమున జన్మించినాఁడు. ఈతడు చిన్నతనమునుండియు మిగుల బలశాలియుఁ బరాక్రమవంతుఁడునై యుండెను. ఇతని పేరువిన్న దుర్యోధనుఁడు భయమందుచుండెడి వాఁడు, దుర్యోధనుఁ డీతనికి బాల్యమునుండియు నగ్గులు చేయుచునే యుండెను. ఈతఁ డనేక సాహసకృత్యములు చేసెను.

— • హిడింబాసురవధ • —

వారణాసియందు దుర్యోధనునిచే నిర్మింపఁబడిన లక్కయింటిలోఁ బడి చావకుండ, భీముఁడు తనతల్లిని సోదరులను రక్షించి హిడింబాసురుని వనము జేర్చెను. అచ్చట వారందఱును నిద్రలోనుండిరి. వారికి నిద్రాభంగము గలుగకుండ హిడింబాసురునిఁ జంపి, యతని చెల్లెలగు హిడింబికోరఁగాఁ బత్నిగాఁ గైకొనెను. భీమునకు హిడింబియందు ఘటోత్కచుండను తనయుఁడు గలిగెను.

— • బకాసురవధ • —

పాండవులు పాంచాలరాజకుమారి యగు ద్రౌపదీ స్వయంవరమునకుఁ బోవుచు నేకచక్రపురమున నొక బ్రాహ్మణునియింట విడిసి, భిక్షాటనమునఁ గాలము గడుపుచుండిరి. ఆపురమునకు సమీపముననున్న యరణ్యమున బకుఁడను నొక రాక్షసుఁడుండెను. వాని కనుదినము నేకచక్రపురమున నొకగృహమునుండి యొక మానిసియు, రెండెనుబోతులు బూన్చిన శకటముపై భోజనమును నాహారముగాఁ బోవుచుండుట యాచారమైయున్నది. ఒకదినమునఁ బాండవులు బసచేసినయింటివారి వంతువచ్చెను. ఆరాక్షసున కెవ్వ రాహారముగాఁ బోవుదుమాయని యేడ్చుచుండిరి. కుంతి వీరిదుఃఖకారణమెఱిఁగి యావృత్తాంతము భీమున కెఱింగించెను. అప్పుడు భీముఁడు భూసురప్రాణసంరక్షణార్థము తానే యెనుబోతులఁ బూన్చిన శకటముపై భోజనము బెట్టుకొని బోయి, యదియంతయు దానే

భుజించి, యాబకాసురునిఁ జంపి, యేకచక్రపురవాసులకు ముదముగూర్చెను.

— జరాసంధవధ —

ధర్మరాజు సేయఁబోవు రాజసూయమునకు ముందు మగధదేశాధీశ్వరుఁడైన జరాసంధునిఁ జంపవలసియుండెను కృష్ణభీమార్జునులు బ్రాహ్మణవేషముతో మగధంజొచ్చి యాజరాసంధుని యుద్ధమున కాహ్వానించిరి. భీముఁడు వానితో మల్లయుద్ధమునకుఁ దలపడి ఘోరముగఁబోరి యంతకునిపురమునకు బంపెను.

— సౌగంధికము —

సౌగంధికమనునది యొకపుష్పము. పాండవులు వనములనుండునప్పు డొకదినమున భీముఁడును ద్రౌపదియు విహరించుచుండఁగా వాయువశమున నీ సౌగంధికమువచ్చి వారి ముందు బడెను. ద్రౌపది యా పుష్పమునుజూచి తనకింకను నట్టివి కావలయునని కోరెను. అంతట భీముఁ డా పుష్పము వచ్చినమార్గము ననుసరించిపోయి యొక కాసారమును గాంచెను. దానితీరమున నొకపాషాణముపై దారికడ్డముగా గంభీరాకారుఁడగు నొకవానరుఁడు నిద్రించుచుండెను. ఆవానరుఁడు లేచినఁగాని పోవుటకు మార్గము లేకపోవుటచే భీముఁడు సింహనాదము జేసెను. ఆధ్వని విని వానరుఁడు మేల్కొని భీముంగాంచి "ఓయీ! నేను రోగపీడితుఁడ. వృద్ధుఁడ. నిద్రం దగిలియుంటి. అట్టిచో నానిద్రకు భంగము గలుగఁజేయుట నీకు ధర్మమా?" యనిపలికి, మరల నీవెవ్వరని యడిగెను.

"నేను పాండునృపాలునకుఁ గుంతియందు వాయుదేవుని వరమునఁ బుట్టిన భీముఁడనని భీముఁడు బదులు చెప్పెను. ఆ మాట విని యా వానరుఁడు "నాయనా! నీవేనా భీముఁడవు. భీముఁడు మహాబలపరాక్రమ సంపన్నుఁడని యనేకులు చెప్పగా వింటిని. నాయనా! వృద్ధుఁడను లేవఁజాలను. నా తోకఁ గొంచె మవ్వలికిఁ ద్రోచి నీదారిం బొమ్ము" అని పలికెను. భీముఁడు వానరుని తోకఁ గదుపుటకు శక్తినంతయు వినియోగపఱచెను. ప్రయోజనము లేకపోయెను. వానరుని బలమున కతఁ డద్భుతమంది, వానరుని నిజవృత్తాంతము దెలుపుమని కోరెను. అప్పుడు హనుమంతుఁడు భీమునకు నిజరూపమును జూపి తాను హనుమంతుఁడగుట యెఱింగించి, సౌగంధికసరోవరమునకు మార్గముజూపి యదృశ్యుఁడయ్యెను. తరువాత భీముఁడు హనుమంతుఁడు చెప్పినమార్గమునఁ బోయి సౌగంధికసరోవరమును గాంచి, యచ్చటనున్న యక్షుల నోడించి యనేక పుష్పములఁ దెచ్చి ద్రౌపది కిచ్చెను.

— అజ్ఞాతవాసము —

అజ్ఞాతవాసమున భీముఁడు వలలుఁడను పేర, విరటునకు వంటలవాఁడై యుండెను. పాండవులను నెట్లయిన గనుఁగొనవలయునని దుర్యోధనుఁడు పంపగా నిరువురు మల్లులు విరటుని యాస్థానమునకు వచ్చిరి. భీముఁడు వారి నోడించెను. విరటరాజునకుఁ గీచకుఁడను బావమఱఁది యొకఁడు కలఁడు. ఆతఁడు మహాబలపరాక్రమవంతుఁడు. అతనికి సింహబలుఁడను మఱి యొక నామముకూడఁ గలదు. ఆ సింహబలుఁడు

సైరంధ్రీవేషమున మాలిని యను పేరనున్న ద్రౌపదిని గోరిన కారణమున, భీముఁడు వానిని నర్తనశాలయం దర్ధరాత్రి సమయమున వధించెను.

— యుద్ధము —

భీముఁడు గదాయుద్ధమునఁ బ్రవీణుఁడు. యుద్ధమునఁ గురుకుమారు లందఱును నీతని గదకే యాహారమైరి. ద్రౌపదీ వస్త్రాపహరణసమయమున దుశ్శాసనునియెడల నీతఁడు చేసిన శపథము దీర్చుకొనుటకు నాతనిని కురుసైన్యము చూచుచుండ, రణమధ్యమునఁ జంపి హృదయరక్తమును ద్రావి, ప్రేవులు చీల్చెను. అట్లే దుర్యోధనుని తొడలుగూడ విఱుగఁ గొట్టి ప్రతిజ్ఞ చెల్లించుకొనెను.

క॥ "ఏ నరము వ్రచ్చి నెత్తురు
దేనియవలె ద్రావెదం గడిసినను గడిమిన్
మానుపఁగ దిక్కు గలిగిన
వ్రానిమ్మొత్తిగింపు మీ మొనం గలవారిన్."

25

అర్జునుఁడు

అర్జునుఁ డింద్రునివరమునఁ బాండురాజునకుఁ గుంతి యందు జన్మించినాడు. ద్రోణాచార్యునియొద్ద శస్త్రాస్త్ర విద్యలు గఱచి విలుకాండ్రలో మేటియని కీర్తిగాంచెను. గురునిపంపున నరిగి, పాంచాలదేశాధీశ్వరుఁడయిన ద్రుపదుని

నాజిలో నోడ్చి బంధించి తెచ్చి గురుదక్షిణగా సమర్పించెను. ద్రుపదుఁడు సామాన్యపరాక్రమవంతుఁడు గాడు. అతనిని రణమున నెట్టివారును నోర్వఁజాలరు. అట్టివాని నర్జునుఁడు జయించెను. ద్రుపదుఁ డర్జుని శౌర్యమున కాత్మలో సంతసించి వాని నల్లునిగాఁ బడయఁదలంచి తపం బొనర్చి యగ్నికుండమున ద్రౌపదినిఁ గూతునుగాఁ బడసెను. మత్స్యయంత్రమును గొట్టి యర్జునుఁడీ ద్రౌపదినిఁ గొనెను. తరువాత నీతఁడు శ్రీకృష్ణుని చెల్లెలగు సుభద్రను, మఱికొందఱిని వివాహమాడెను. సుభద్రయం దభిమన్యుఁ డను కుమారుఁడు జనించెను.

పాండవులు వనవాసమున నుండగా, నీయర్జునుఁ డస్త్రలాభమును వడయ నెంచి తపము జేసెను. ఈశ్వరుఁడు ప్రసన్నుఁడై యతని పరాక్రమము పరీక్షించి పాశుపతాస్త్రము ప్రసాదించెను. అర్జునుఁడు రుద్రునివలనఁ బాశుపతాస్త్రము వడసిన సంగతివిని, యింద్రుఁ డాతనియొద్దకువచ్చి కాలకేయాదిదానవులఁ గూల్చుటకుఁ దనలోకమునకుఁ దీసికొనిపోయెను. అచ్చట నూర్వశియను నమరవేశ్య యర్జునునిఁ గామించెను. అర్జును డామె యభీష్టము దీర్చుట కంగీకరింపకపోవుటచే, నక్కాంత యతనిని షండుఁడ వగుమని శపించెను. ఈశాప మతనికి నజ్ఞాతవాససమయమున ననుకూలమయ్యెను. అజ్ఞాతవాసము దీర్చుటకుఁ బాండవులు విరటుని కొలువునఁ బ్రచ్ఛన్నవేషములతో నున్నప్పు డర్జునుఁడు బృహన్నలయను పేర విరటుని తనూజయగు నుత్తరకు నృత్యగీతాది విద్యల నేర్పుచుఁ గాలము గడిపెను. పాండవుల జాడఁ దీయుటకు దుర్యోధనుఁడు విరటుని గోగణములు బంధింపఁగా,

నర్జునుఁడు ఉత్తరుని సారథిగాఁ జేసికొని కౌరవులపై కెత్తి పోయి, జయించి గోగణముల మరలించుకొని వచ్చెను.

కృష్ణసారథ్యమున నితఁడు భారతయుద్ధమున వర్ణింప నలవి కాని యద్భుతసాహసకృత్యములు సలిపెను. తన కుమారుఁడైన యభిమన్యునివధకు సైంధవుఁడు కారణంబని యెఱింగి వానిని సూర్యాస్తమయము గాకుండ వధింతుననియు, నట్లు వధింపలేకపోయినచోఁ దాన యగ్నిం బ్రవేశింతుననియు శపథము జేసి, కృష్ణసహాయమున సైంధవుని వధించి ప్రతిజ్ఞఁ దీర్చుకొనెను. కౌరవపక్షముననున్న కర్ణునితో సమానమైన యస్త్రవిద్యాధురంధరుఁడు గాక యర్జునుఁడే. కర్ణుఁ డర్జునునిఁ దప్పక కర్ణునిఁ దప్పక వధించునని ధర్మరాజు నమ్మియుండెను. ఒకనాటి యుద్ధమునఁ గర్ణుఁడు ధర్మజునిపై దారుణాస్త్రములఁ బ్రయోగించి, యనేకభంగులఁ బరాభవించి విడిచిపెట్టెను. ధర్మరాజు భీతిల్లి శిబిరమునకుఁ బాఱిపోయెను. ఆతని క్షేమము విచారించుటకుఁ గృష్ణార్జునులు వచ్చిరి. అర్జునుఁడు కర్ణునిఁ జంపి వచ్చినాఁడని ధర్మరాజు తలంచెను. కాని కొంతసేపటి కట్లు జరిగియుండలేదని గ్రహించి యతఁ డర్జునునిఁ జూచి యిట్లు పలికెను. "యుద్ధమున శత్రువులఁ జంపుట లేక చచ్చుట ఈ రెండును వీరులకు గుణములు. వైరులచే నొప్పింపఁబడినను సమరము విడిచి రాగూడదు. అట్లు నేను వచ్చి యందఱకు జులకనైతి. కర్ణునకు నేనే యోడలేదు. నీవును భీమనకుల సహదేవులు నోడిరి. మనతో మాధవుఁడుగూడ నోడె. ఇంక మనము రణమున కేగినందువలనఁ బ్రయోజనము లేదు. మరల

వనములకుఁ బోవుదము నీవేమో కర్ణునిఁ జంపుదువని ఇంత వరకు నాశతో యుంటిని. నీ వీతనినిఁ గెలువఁజాలనని ఇంతకు ముందే చెప్పియున్నచో నేను యుద్ధమునకు సమ్మతింతునా? అగ్నిదేవుఁ డిచ్చిన రథము, శ్వేతాశ్వములు, గాండీవము, కపిధ్వజము, కృష్ణసారథ్యము గలిగియుండియు నా రాధేయునకు భయమంది ఇట్లు వచ్చితివేమి! నేటిదినమున నభిమన్యుఁడైన, ఘటోత్కచుఁడైన బ్రతికియున్నచో నాకీపాటు సంభవించునా! పోనిమ్ము. నీవు కర్ణునకు భయమందినవాఁడవేని, నీ గాండీవము కృష్ణున కిచ్చి నీవు సారథివైనచో నతఁడైనఁ గర్ణుని వధించియుండును."

తన గాండీవము నొరుల కిమ్మని ధర్మజుఁడు పలికినందుకు ధనంజయుఁ డలిగి, ధర్మరాజు శిరము నరుకఁ బోయెను. కృష్ణుఁడు సమయోచితవాక్యములచే యర్జునుని శాంతచిత్తునిఁ జేసి, పెద్దలను దూషించుట చంపుటవంటిదే యగును. కావున ధర్మరాజును దూషింపుమని పలికెను. అట్లు చేసి, అర్జునుఁడు మరల నగ్రజుని దూషించినందుకుఁ దన శిరము గోసికొనఁ బోయెను. కృష్ణుఁ డది వారించి యాత్మస్తవము జేసికొనుట మరణముతోఁ దుల్యము. కావున నట్లు చేయుమనెను. అంతట నర్జునుఁడు తాను చేసిన ఘనకార్యములన్నియు వచించి, కృష్ణుఁడు చెప్ప ధర్మజుని పాదములపైఁ బడి మన్నింపఁగోరి, కర్ణునిఁ జంపి వచ్చుట కనుజ్ఞ నిమ్మని పలికెను. ధర్మజుఁడు కోపము విడిచి యర్జునుని కర్ణునిపైకిఁ బంపెను. కృష్ణార్జును లిరువురును యుద్ధమునకుఁ బోయి కర్ణుని నెదుర్కొనిరి. కర్ణార్జునులకు ఘోర

[redacted]ము జరిగెను. అర్జునుఁడు నిశితనారాచపరంపరలఁ గప్పి, దుర్యోధనుని మనోరథము భగ్నమగునట్లు కర్ణునిఁ గూల్చెను.

భారతయుద్ధమున నర్జునుఁడు భీష్ముఁడు మొదలైన పెక్కండ్రు వీరులను వధించెను. శ్రీకృష్ణునియం దీతనికి భక్తి విశేషముగఁ గలదు. కృష్ణుఁడుగూడ నీతనిఁ గంటికి ఱెప్పవలెఁ గాచుచుండును.

చ॥ అనిమిషదైత్యకింపురుషు లాదిగ నెవ్వరు వచ్చి కాచినం
దునుముదు నల్లి సైంధవుని దోయజమిత్రుఁడు గ్రుంకకుండ మున్
న్న నరివ ల్యా యిత్తెరఁగు నాకొనరింపఁగ రాక యున్న నే
ననలము సొచ్చువాఁడ నృపులందరుఁ జూడఁగ గాండివంబుతోన్.

26

కర్ణుఁడు

కర్ణుఁడు కుంతికి సూర్యుని వరమునఁ బెండ్లిగాకపూర్వమే జనించినాఁడు. రాధ యను శూద్రవనితచేఁ బెంపఁబడుటచే రాధేయుఁడను పేరుగూడఁ గలిగినది. ఈతఁడు ద్రోణాచార్యుని యొద్దకుఁ బోయి యస్త్రవిద్య నేర్పుమని ప్రార్థించెను. ద్రోణుఁ డందుకు సమ్మతింపలేదు. అంతటఁ గర్ణుఁడు పరశురాముని సన్నిధికిఁ బోయి బ్రాహ్మణుఁడనని బొంకి యతనికి శిష్యుఁడయ్యెను. పరశురాముని యాశ్రమమున నాతఁ డొకనాఁ డస్త్రవిద్యాపరిశ్రమము జేయుచుండ నాతని శరము విధివశమున నొక భూసురుని ధేనువకుఁ దగిలెను. భూసురుఁ డాగ్ర

హించి రణమునఁ గర్ణుని రథచక్రము నేలఁగ్రుంగునని శపించెను. పరశురాముఁడు కర్ణునియందు వాత్సల్యము బూని బ్రహ్మాస్త్రము మొదలగు నస్త్రము లొసంగెను. ఒకనాఁడు కర్ణునితొడపై శిరంబిడి పరశురాముఁడు నిద్రించుచుండఁ గర్ణుని తొడనొక కీటకము దొలుచుచుండెను. కర్ణున కది బాధ కలుగఁజేయుచున్నను, నతఁడు లేచినచో గురునకు నిద్రాభంగమగునని యూరకుండెను. కొంతసేపటికి గురుఁడు మేల్కని రాధేయునితొడనుండి రక్తము గారుచుండుటఁ జూచి యందుకుఁ గారణమేమని యడిగెను. "కీటకము నాతొడఁ దొలుచుచుండెను. నేను గదలినచో మీకు నిద్రాభంగమగునని సహించితి" నని ప్రత్యుత్తర మిచ్చెను. కర్ణుని ధైర్యమునకుఁ బరశురాముఁ డచ్చెరువు బొంది "బ్రాహ్మణుల కింతాల్మి యుండదు. నీ వేకులమున జన్మించితివో నిజము జెప్పు" మనెను. కర్ణుఁడు భయమంది తాను సూతుఁడనని చెప్పెను. అప్పుడు పరశురాముఁడు కుపితుఁడై "నీవు బ్రాహ్మణుఁడవని నన్ను వంచించి విద్యఁ గఱచితివి కావున నీయస్త్రవిభవము వికలమగుఁగాక" యని శపించెను. అస్త్రవిద్యాపరిపూర్ణుఁడైన పిమ్మటఁ గర్ణుఁడు దుర్యోధనునిఁ జేరి యతనికిఁ బ్రాణమిత్రుఁడై, యంగరాజ్యాధిపతి యయ్యెను.

కర్ణుఁ డంగరాజుగ నుండి యర్థు లేది కోరిన నది యిత్తునని కంకణము దాల్చి "దానకర్ణుఁ"డని కీర్తివడసెను. ఈతఁడు సహజకవచకుండలుఁడు. ఆ కవచకుండలము లున్నంతవఱకు నీతనిని రణమున నెవ్వరును గెలువఁజాలరు. ఒకనాఁడు సూర్యుఁ డీతనియొద్దకు వచ్చి "ఇంద్రుఁడు నీకడకువచ్చి కవచకుండ

లము లడుగును గావున నీయవల" దని చెప్పెను. "ఇంద్రుం డంతటివాఁడే వచ్చి నన్నర్థించినచో నేనట్లీయకుందు" నని యాతఁడు సూర్యునకుఁ బ్రత్యుత్తరము చెప్పిపంపెను. మఱికొన్ని నాళ్ళ కింద్రుఁడు బ్రాహ్మణరూపమున వచ్చి కర్ణునిఁ గవచకుండలము లడిగెను. కర్ణుఁ డొక్కింతయు వెనుదీయక వానిని నింద్రునకిచ్చి వానికిమాఱుగా నతనివలన నొకయమోఘమైన శక్తిని గ్రహించెను. ఈతని నమ్ముకొనియే దుర్యోధనుఁడు పాండవులతో రణమునకుఁ గడంగెను. దుర్యోధనునియం దితఁడుజూపినభక్తి యద్వితీయమైనది. రాయబారియై కృష్ణుఁడు కౌరవసభకు వచ్చి కర్ణునితో రహస్యముగ సంభాషించి, యతని జన్మవృత్తాంతము దెలిపి పాండవులను జేరుమని యెంతయో చెప్పెను. కాని స్వామిభక్తిగల కర్ణుఁడు "నా చిత్తము రాజద్రోహమునకు సమ్మతింపదు. నేను కౌరవేశ్వరుని యుప్పుపులుసుఁ దిని జీవించుచు, నింతటివాఁడనైతిని. కావున నా ప్రాణమున్నంతవరకు దుర్యోధనుని విడువను. ఆతని కొరకు నా ప్రాణములయిన సర్పించెద" నని బదులు చెప్పెను. కురుపాండవ యుద్ధమున నీతఁ డనుపమానమైన పరాక్రమముతో దుర్యోధనుని పక్షము నిలిచి పోరాడి, తుద కర్జునునిచే నిహతుఁ డయ్యెను.

క॥ "నన్ను నయ్యర్జునునకు నెదు
రని పెద్దయు నమ్మియుండు నక్కట దుర్యో
ధనుఁ డా నమ్మిక వమ్ముగ
జనునే పాండవులఁ గెలయఁ జన నాకనఘా!"

27

శ్రీరాముఁడు

రాముఁడు సాకేతపురాధీశ్వరుఁడును, సూర్యకుల ప్రసూతుఁడును నగు దశరథుని జ్యేష్ఠసుతుఁడు. భరతలక్ష్మణ శత్రుఘ్నులతని తమ్ములు. ఇందులో లక్ష్మణుఁ డెప్పుడును శ్రీరాముని విడువకయుండును. రాముఁడు బాల్యమునందే తాటకియను రాక్షసస్త్రీని వధించి, మారీచసుబాహుల నర్పమడఁచి విశ్వామిత్రుని యాగము రక్షించి శివుని విల్లువిఱిచి జనకరాజపుత్రియగు సీతను వివాహమాడెను.

శ్రీరాముఁడు ప్రజానురాగమును వడసియుండెను. ఇతరపురుష దుర్లభములైన సుగుణము లాతనియొద్ద ననేకములున్నవి. అతఁడు పరాక్రమవంతుఁడు. జితేంద్రియుఁడు. ధర్మపరుఁడు. సత్యవాది. తక్కినసుతులకంటె దశరథునకు రాముని యందుఁ బ్రేమ యధికముగనుండెను. రామునకుఁ దగినవయస్సువచ్చుటఁజూచి, ప్రజల యంగీకారమునువడసి, దశరథుఁ డతనికి రాజ్యాభిషేకము సేయనిశ్చయించి, యావార్తఁ బురమునఁ జాటఁబంపెను. రామాభిషేకమునకుఁ దగినప్రయత్నములన్నియుఁ జేయఁబడినవి. పురమెల్లడ నలంకరింపఁబడెను. పట్టాభిషేకమునకు వసిష్ఠుఁడు పెట్టిన లగ్నముగూడ సమీపించెను. అట్టిసమయమున మందరయను దాసిచేఁ బ్రేరేపింపఁబడి, రాముని సవతితల్లియగు కైక దశరథునిఁ జేరి "మహారాజా! పూర్వము శంబరాసురయుద్ధమున నాకు రెండు వరము లిచ్చియున్నారు. అవి నాకిప్పుడీయవలయును. ఒకవర

మున రాముని మునివేషమునఁ బదునాల్గువత్సరము లరణ్య
మున వసింపఁ బంపవలయును. రెండవవరమున భరతుని రాజుగా
జేయవలయు" నని పలికెను. సత్యపాశమునకుఁ గట్టువడి దశ



శ్రీరామ వనవాసము.

రథుం డందులకు సమ్మతించెను. సీత యెప్పుడును రాముని బాసి
యుండుటకు సమ్మతించునది కాదు. కావున నతని వెంట నరణ్య
ములకుఁ బోయెను. లక్ష్మణుఁడును రామునియందున్న భక్తిచే

నతని వెంట నరిగెను. కైకవరకారణమున సీతారామలక్ష్మ
ణులు వనములకరిగిరి. రాముఁడు వనములకుఁ బోవునప్పుడు
భరతశత్రుఘ్నులు పురమున లేరు. రాముఁడు వనములకుఁ
బోయినపిదప నతనిపై బెంగచే దశరథుఁడు పరలోకగతుఁ
డయ్యెను. భరతుఁడువచ్చి తండ్రిమృతికిఁ గారణమెఱింగి
యట్టివరములఁ గోరినతల్లిని ననేకదుర్భాషలాడి, శత్రుఘ్ను
నితో బయలుదేరి, చిత్రకూటముననున్న శ్రీరామునియొద్దకుఁ
బోయెను. భరతుఁడు రామునకుఁ దండ్రిమృతి నెఱింగించి పుర
మునకువచ్చి పట్టాభిషిక్తుఁడవుగమ్మని వేడెను. కాని, సత్యసంధు
డగు రాముఁడందుకు సమ్మతింపక తనపాదుకలు భరతునకిచ్చి
పంపించెను. భరతుఁడు రామునిపాదుకలకే, రాజ్యాభిషేకము
జేసి, తానుగూడ రాముడు వనములనుండి వచ్చువరకు ముని
వేషమున నుండెను.

అరణ్యముననుండగా రామలక్ష్మణులు పర్ణశాలయందు
లేనప్పుడు లంకాపురనాయకుండైన రావణాసురుఁడు సీతను
హరించుకొనిపోయి లంకకుఁ జేర్చెను. పర్ణశాలకు వచ్చి
సీతను గానక రాముఁడు మిగుల చింతించుచు లక్ష్మణయు
తుఁడై యామె నన్వేషించుచుఁ బోయి కిష్కింధాపురముఁ
జేరెను. అక్కడ రామునకు హనుమంతుని మూలమున సుగ్రీ
వునితో సఖ్యము కలిగెను. సుగ్రీవునికొరకు రాముఁడు వాలిం
దునిమి యతనిని గిష్కింధకు రాజుగాఁ జేసెను. తరువాత,
సీత లంకలోనున్నదని హనుమంతునివలన నెఱింగి, రాముఁడు
కపిబలసహాయమున సముద్రముదాటి లంకకుఁబోయి, రావ

నునితో రణంబొనర్చి వానిని బుత్రామాత్యభృత్యాదివర్గముతోఁ దునిమి వానితమ్ముఁడగు విభీషణుని లంకకు రాజుగాఁ జేసి సీతను గోడ్కొని యయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుఁ డయ్యెను.

"తే॥గీ॥ యావరాజ్యపదంబునఁ యందు భరతు
నధిప యభిషేక మొనరింపు మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబుఁ లుండ నాన
తిమ్ము రాముని నిదియ వఁరమ్ము నాకు"

మహాభారత నీతికథలు ద్వితీయభాగము
సంపూర్ణము.

PRINTED AT THE CHANDRIKA PRESS, GUNTUR, 1927.

చంద్రికా ప్రెస్, గుంటూరు.

మా స్వంత ప్రచురణ పుస్తకములు

1	భాస్కర శతకము టీక (అప్రూవుడ్)	0-[illegible]-0
2	దాశరథిశతకము టీక ... (అప్రూవుడ్)	0-4-0
3	కుమారీ శతకము సటీక	0-2-6
4	బాలరామాయణం సటీక	0-2-6
5	కుచేలోపాఖ్యానము టీక ... ... (అప్రూవుడ్)	0-4-0
6	రుక్మిణీకళ్యాణము టీక సాదా బయిండు (అప్రూవుడ్)	0-8-0
7	డిటో కాలికో బయిండు	0-10-0
8	గజేంద్రమోక్షము సాదా బయిండు (అప్రూవుడ్)	0-8-0
9	డిటో క్యాలికో బయిండు	0-10-0
10	ప్రహ్లాదచరిత్ర టీక సప్తమస్కంధమునుండి.	0-6-0
11	నవీన గోదావరిజిల్లా భూగోళం ... (అప్రూవుడ్)	0-4-0
12	నవీన కృష్ణాజిల్లా భూగోళం	0-4-0
13	నవీన గుంటూరుజిల్లా భూగోళం	0-4-0
14	పంచతంత్రము ... ... (అప్రూవుడ్)	0-8-0
15	నీతిచంద్రిక పరవస్తు చిన్నయ్యసూరి కృతం (అప్రూవుడ్)	0-8-0
16	బాలధ్రువచరిత్ర 3, 4, 5, తరగతులకు	0-3-0
17	బాలకుశలవచరిత్ర 4, 5, 6, తరగతులకు	0-4-0
18	రామాయణ నీతికథలు 4, 5, 6, తరగతులకు	0-6-0
19	భాగవత నీతికథలు 1, 2, 3, ఫారములకు	0-10-0
20	భారత నీతికథలు మొదటిభాగం బొమ్మలతో (అప్రూవుడ్)	0-6-0
21	భారత నీతికథలు రెండవ భాగము బొమ్మలతో (అప్రూవుడ్)	0-8-0
22	సుమతిశతకము టీకా తాత్పర్యము	0-2-0
23	ఆంధ్రనామ సంగ్రహం క్యాలికో	1-0-0
24	డిటో అట్ట బయిండు	0-12-0

అన్నిరకముల అన్ని క్లాసుల పుస్తకములు తదితరరకములు మావద్దకలవు.

దొరకువారు:—మారుతి రాం కంపెని, బెజవాడ.

END OF
TITLE